# భారత్ శక్తి ®

Published from Hyderabad, Kadapa, Guntur, Kurnool, Khammam, Vijayawada & Warangal

సంపుటి - 20 | సంచిక - 84 | హైదరాబాద్ | సోమవారం 15-09-2025 | పేజీలు : 12 | వెల : 1.00




11లో

పోరాడండి.. లేదంటే చనిపోతారు: ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు



11లో

## హైదరాబాద్‌లో వర్షం
## రహదారులు జలమయం

## హిందీని ఆ ఒక్క రంగానికే
## పరిమితం చేయొద్దు: అమిత్ షా

- సైన్స్, టెక్నాలజీ, న్యాయ రంగాల్లోనూ హిందీ వాడాలన్న అమిత్ షా
- ప్రాంతీయ భాషలకు హిందీ పోటీ కాదు, స్నేహితురాలు మాత్రమేనని స్పష్టం
- తమ మాతృభాషలోనే లేఖలు రాయాలంటూ సీఎంలకు కేంద్ర హోంమంత్రి పిలుపు
- అంతర్జాతీయ వేదికలపై హిందీకి మోదీ గౌరవం పెంచారని ప్రశంస
- పిల్లలకు మాతృభాషలోనే బోధించాలని తల్లిదండ్రులకు సూచన


11లో



## నేటి భారతం

- విద్య ఒక్కటే మన జీవితాన్ని వెలుగులోకి తెచ్చే దీపం.
- ప్రతిరోజూ ఒక కొత్త విషయం నేర్చుకోండి..
- అది మీ జీవితాన్ని మార్చే శక్తి అవుతుంది..
- సమయం గడిచేలోపు చదవడం ప్రారంభించండి.
- నీ గమ్యాన్ని చేరడానికి కష్టపడటమే ప్రధాన దారి.
- అధ్యయనం ఎప్పుడూ నీతులు, విలువలు నేర్పుతుంది.
- విజయం సాధించాలంటే పరిజ్ఞానం మూలం కావాలి.
- ప్రతి క్షణం చదువులో ఏదోక ఆసక్తిని చూపించాలి..
- విద్య అనేది మీ జీవితంలో ఎప్పుడూ
- మీ వెన్నంటి వుండే స్నేహితుడు..
- కేవలం జ్ఞానం ఒక్కటే మనం సంపాదించుకోగలిగిన గొప్ప ఆస్థి..
- అందుకే అంటారు.. దొంగలు దొంగలించలేనిది..
- అగ్ని కాల్చజాలానిది.. నీరు తడుపలేనిది..
- వాయువు స్థానచలనం కలిగించలేనిది..
- పంచేకొద్దీ పెరిగేది జ్ఞానం ఒక్కటే..
- అది విద్యవల్లనే సాధ్యం అవుతుంది..

# ప్రైవేట్ కాలేజీల దోపిడీ..
# దాసోహం అంటున్న ప్రభుత్వాలు..



- చీకటి పాలవుతున్న పేద విద్యార్థుల భవిష్యత్తు..
- ప్రభుత్వ విద్యా వ్యవస్థ విచ్ఛిన్నం అయిపోతోంది..

12లో

అందరూ విద్యావంతులైతే తమ ఆటలు సాగవని భావిస్తున్నారు కుహనా రాజకీయ నాయకులు.. కోట్లకు పడగలెత్తిన వ్యాపారస్తులు.. మరికొన్ని సంపన్న వర్గాల వారు.. కానీ వారికి తెలియనిది ఏమిటంటే అందరూ విద్యావంతులైనప్పుడే తమ రాజకీయాలు, వ్యాపారాలు, సమాజంలో విలువలు బ్రతుకుతాయి.. ఉన్నంతగా ప్రకాశిస్తాయి.. ఈ నిజాన్ని గ్రహించలేక ప్రభుత్వాలు కార్పొరేట్ కల్చర్ కు కొమ్ము కాస్తోంది.. ప్రభుత్వ విద్యా వ్యవస్థను నీరు గారుస్తూ ప్రైవేట్ విద్యా వ్యవస్థకు తమవంతు సహకారం అందిస్తున్నాయి.. దీంతో నిరుపేద, సామాన్య, తెలివిగల విద్యార్థులు ఉన్నత విద్యకు దూరం అవుతున్నారు.. దేశ భవిష్యత్తును నిర్మించాల్సిన వారే వేరే దారిలేక సమాజానికి నష్టం కలిగించే విధంగా తమ దారిని వెతుక్కుంటున్నారు.. ఇది వాంఛనీయం కాదు.. ప్రభుత్వాలు సిగ్గుతో తలదించుకోవాలి.. విద్యను వ్యాపారంగా మారుస్తున్న వారిని కఠినంగా శిక్షించాలి.. ముఖ్యంగా వారిని ప్రోత్సహించడం మానుకోవాలి.. ప్రభుత్వ విద్యను పవిత్రంగా భావించాలి.. దానిని మెరుగుపరచాలి.. అప్పుడే మహాత్ములు ఎందరో కలలుగన్న మహా భారతం సాధ్యమవుతుంది..



11లో

## భారత్-పాక్ మ్యాచ్‌పై
## కేంద్రం క్లారిటీ..

### బాయ్‌కాట్ చేసే ప్రసక్తే లేదు!

- భారత్-పాక్ మ్యాచ్‌ను బహిష్కరించాలంటూ సోషల్ మీడియాలో డిమాండ్లు
- పహల్గాం దాడి బాధితుల కుటుంబాల నుంచి కూడా ఇదే తరహా విజ్ఞప్తి
- మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసేది లేదని తేల్చేసిన కేంద్ర ప్రభుత్వం
- క్రీడలను, ఉగ్రవాదాన్ని వేర్వేరుగా చూడాలని మంత్రి కట్టర్ హితవు

ఐదేళ్లుగా విమోచన దినోత్సవాన్ని


## కేంద్రమే నిర్వహిస్తోంది

కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

11లో





## 'అలయ్ బలయ్'
### సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందజేసిన దత్తాత్రేయ

11లో

## మొద్దు నిద్రబోతున్న
## నార్సింగి మున్సిపల్ అధికారులు

12లో



- లంచాల మత్తులో జోగుతున్న దౌర్భాగ్యం
- నార్సింగి మున్సిపల్ కమిషనర్, టిపిఓల అంతులేని అవినీతి
- ఈ వ్యవహారంపై స్పెషల్ కమిషనర్ ఎస్. శ్రీనివాస్ రెడ్డి దృష్టి సారించాలి
- 111 జీవోలో 10 ఎకరాలలో "కే కన్వెన్షన్ హాల్" అక్రమ నిర్మాణం
- నాలా కన్వర్షన్ లేదు, పైగా ప్రభుత్వ భూమి కబ్జా
- నార్సింగి మున్సిపల్ అనుమతులు లేవు..ఓ కుంటను కూడా మింగేశారు,
- ఇరిగేషన్, రెవెన్యూ,హెచ్ఎండిఏ, మున్సిపల్ టౌన్ ప్లానింగ్ అధికారులకు అందిన మామూళ్ళు
- హైడ్రా కమిషనర్ రంగనాథ్ ఓసారి ఇటువైపు చూడండి
- ఎస్.టి.ఎఫ్ ఇంచార్జ్ కలెక్టర్, మున్సిపల్ శాఖ మంత్రి, సీఎం రేవంత్ రెడ్డి దృష్టి సారించాలి...

## 'రెడీ టూ సర్వ్' ఫౌండేషన్ ఆధ్వర్యంలో
## అన్నదాన కార్యక్రమం..

10లో



# సంపాదకీయ

## దేశగతిని మార్చనున్న ఖనిజాలు

ఓవైపు బంగారం.. మరో వైపు పెట్రోలియం .. ఈ రెండు దేశగతిని మార్చేయబోతున్నాయి. భారత దేశం 80 శాతం పెట్రోలియం ఉత్పత్తులు దిగుమతి చేసుకుంటుంది. కేవలం 20 శాతం మాత్రమే మన దేశంలో లభిస్తోంది. అలాగే బంగారం కూడా విదేశాల నుంచే దిగుమతి చేసుకుంటున్నాం. ప్రపంచంలో బంగారం ఎక్కువగా వినియోగించే దేశాల్లో భారత్ ఒకటి. ఈ దిగుమతుల కారణంగా మన రూపాయి విలువ తగ్గుతోంది. విదేశా మారక నిల్వలు తగ్గిపోతున్నాయి. ఇలాంటి పరిస్థితిలో భారత ఆర్థిక వ్యవస్థకు ఊపిరిపోసేలా భారీ బంగారు నిల్వలను జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా (జేఎస్ఐ) గుర్తించింది. ఇది దేశ ఆర్థిక రంగంలో కొత్త ఆశలను రేకెత్తిస్తోంది. రాష్ట్రంలోని నాలుగు జిల్లాల్లో సుమారు 20 మెట్రిక్ టన్నుల బంగారు నిల్వలు ఉన్నట్లు అంచనా. ఇది బంగారం దిగుమతులపై ఆధారపడే భారత్‌కు ఊరట కలిగించే అంశం. ఒడిశా ప్రభుత్వం ఇప్పటికే మైనింగ్ పనులను ప్రారంభించి, త్వరలో వేలం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. జియోలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా ఒడిశాలోని నాలుగు జిల్లాల్లో 20 మెట్రిక్ టన్నుల బంగారు నిల్వలను గుర్తించింది. ఈ నిల్వలు దేశంలో బంగారం ఉత్పత్తిని పెంచి, విదేశీ దిగుమతులపై ఆధారపడే తీవ్రతను తగ్గించే అవకాశం ఉంది. భారత్ ఏటా భారీ మొత్తంలో బంగారాన్ని దిగుమతి చేస్తుంది. ఇది విదేశీ మారక నిల్వలపై ఒత్తిడిని పెంచుతుంది. అధికారిక గణాంకాలు ఇంకా అందుబాటులో లేవు. అయితే, ప్రాథమిక అంచనాల ప్రకారం బంగారు నిల్వలు 10 నుండి 20 మెట్రిక్ టన్నుల వరకు ఉండవచ్చని సూచిస్తున్నాయి. భారతదేశం మొత్తం బంగారు దిగుమతులతో పోలిస్తే ఇది చిన్నదే అయినప్పటికీ, దేశీయ బంగారు ఉత్పత్తిని పెంచే దిశగా ఇది ఒక ముఖ్యమైన అడుగు. ఒడిశా ప్రభుత్వం, ఒడిశా మైనింగ్ కార్పొరేషన్, ఊఎ ఈ ఆవిష్కరణను వాణిజ్యీకరించడానికి వేగంగా పనిచేస్తున్నాయి. దేవ్‌ఘర్ జిల్లాలోని మొదటి బంగారు మైనింగ్ బ్లాక్ వేలానికి సిద్ధమవుతోంది. నిక్షేపం నాణ్యత, దాని మైనింగ్ సామర్థ్యాన్ని నిర్ధారించడానికి ఉ3 నుండి ఉ2 స్థాయిల వరకు వివరణాత్మక డ్రిల్లింగ్, నమూనా సేకరణ జరుగుతోంది. ఈ బంగారు నిక్షేపాన్ని వాణిజ్యపరంగా తవ్వితే, స్థానిక ప్రాంతంలో మౌలిక సదుపాయాలు, ఉపాధి, సేవల విస్తరణకు వీలు కల్పిస్తుంది. భారతదేశం బంగారం దిగుమతులపై ఆధారపడటాన్ని కొంతవరకు తగ్గించవచ్చు. ఒడిశాను ఇనుప ఖనిజం, బాక్సైట్‌లకు మాత్రమే కాకుండా బంగారు కేంద్రంగా గుర్తించవచ్చు. ఒడిశాలో ఇప్పటికే భారతదేశంలోని క్రోమైట్‌లో 96శాతం, బాక్సైట్‌లో 52శాతం ఇనుప ఖనిజ నిల్వలు 33శాతం ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా బంగారు గనులు కూడా ఈ లిస్ట్‌లోకి వచ్చి చేరాయి. దర్యాప్తు, ప్రయోగశాల విశ్లేషణ తుది నివేదిక అందాల్సి ఉంటుంది. ఆ తర్వాత సాంకేతిక కమిటీల ద్వారా వాణిజ్య సాధ్యాసాధ్యాల మూల్యాంకనం చేస్తారు. పారదర్శక వేలం, పెట్టుబడి ఆకర్షణ. పర్యావరణ, సామాజిక ప్రభావ అధ్యయనం చేస్తారు. మొత్తంమీద ఒడిశాలో ఈ బంగారు నిక్షేపాల ఆవిష్కరణ భారతదేశ మైనింగ్ వ్యూహంలో ఒక కొత్త అధ్యాయాన్ని లిఖించగలదు. స్థానిక ప్రజలకు ఆర్థికంగా వరం కాగలదు. స్థానిక ఉత్పత్తి ద్వారా ఈ భారం తగ్గవచ్చు. మైనింగ్ కార్యకలాపాలు స్థానికులకు ఉపాధి అవకాశాలను సృష్టిస్తాయి, ఒడిశా ఆర్థిక వృద్ధికి దోహదపడతాయి. ఒడిశా ప్రభుత్వం ఈ బంగారు నిల్వలను సద్వినియోగం చేసుకునేందుకు వేగంగా అడుగులు వేస్తోంది. మైనింగ్ పనులు ప్రారంభించడంతోపాటు, త్వరలో వేలం నిర్వహించేందుకు సన్నాహాలు చేస్తోంది. పారదర్శకమైన వేలం విధానం ద్వారా సమర్థవంతమైన కంపెనీలకు మైనింగ్ హక్కులు కేటాయించడం ద్వారా ఆదాయాన్ని పెంచుకోవచ్చు. ఆధునిక మైనింగ్ సాంకేతికతలను ఉపయోగించడం ద్వారా ఉత్పత్తి సామర్థ్యం పెరుగుతుంది. మైనింగ్ ఆదాయాన్ని ఒడిశాలో మౌలిక సదుపాయాలు, విద్య, ఆరోగ్య రంగాల అభివృద్ధికి వినియోగించవచ్చు. భారత్ ప్రపంచంలో అతిపెద్ద బంగారం దిగుమతి దేశాల్లో ఒకటి. 2024లో భారత్ దాదాపు 800 మెట్రిక్ టన్నుల బంగారాన్ని దిగుమతి చేసినట్లు అంచనా. ఒడిశాలో 20 మెట్రిక్ టన్నుల నిల్వలు ఈ దిగుమతి భారాన్ని కొంతమేర తగ్గించవచ్చు. స్థానిక ఉత్పత్తి ద్వారా విదేశీ మారక ఖర్చు తగ్గడం వల్ల రూపాయి విలువ స్థిరీకరణకు దోహదం చేస్తుంది. స్థానిక ఉత్పత్తి పెరిగితే, దేశీయ మార్కెట్లో బంగారం ధరలు స్థిరంగా ఉండే అవకాశం ఉంది. భవిష్యత్తులో అధిక ఉత్పత్తి సాధ్యమైతే, భారత్ బంగారం ఎగుమతి దేశంగా మారే అవకాశం ఉంది.


## గిరిజన సంస్కృతి, సంప్రదాయాల ప్రకారం

### సమ్మక్క, సారలమ్మ ఆలయ ఆధునీకరణ మంత్రులు పొంగులేటి శ్రీనివాసరెడ్డి, కొండా సురేఖ, సీతక్క, లక్ష్మణ్ కుమార్

హైదరాబాద్ సెప్టెంబర్ 14 ( **భారతశక్తి ప్రతినిధి**)
ఆసియా ఖండములో అత్యంత ప్రసిద్ధిగాంచిన సమ్మక్క, సారలమ్మ దేవాలయాన్ని గిరిజన సంస్కృతి సంప్రదాయాలు వారి మనోభావాలకు అనుగుణంగా ఆధునీకరణను చేపడుతున్నామని ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, హౌసింగ్, సమాచార పౌరసంబంధాల శాఖ మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి తెలిపారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి సూచనల మేరకు ఆధునీకరణకు సంబంధించిన మాస్టర్ ప్లాన్ పై శుక్రవారం నాడు సచివాలయంలోని తన కార్యాలయంలో పంచాయితీరాజ్ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, ఎస్.సి. అభివృద్ధి మైనారిటీ సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్, మహబూబాబాద్ పార్లమెంట్ సభ్యులు బలరామ్ నాయక్ తో కలిసి మంత్రి గారు సమీక్షించారు. గౌరవ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి గారు ఆధునీకరణ పనులకు తుది ఆమోదం తెలిపిన తరువాత తక్షణమే పనులు ప్రారంభించి వంద రోజుల్లో పూర్తయ్యేలా కార్యాచరణ రూపొందించాలని అధికారులకు మంత్రులు సూచించారు. భక్తులకు మరింత సౌకర్యవంతముగా ఉండేలా చేపట్టే ఆధునీకరణ పనుల్లో గిరిజనుల సాంప్రదాయాలను ప్రతిబింబించేలా ఉండాలని, ఈ విషయములో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఇప్పటికే మేడారం ఆలయాలకు సంబంధించిన మాస్టర్ ప్లాన్‌ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారు పరిశీలించారని, వచ్చే వారంలో ముఖ్యమంత్రి గారు స్వయంగా క్షేత్రస్థాయి పరిశీలనకు వస్తున్నందున తగు ప్రణాళికలు, సమాచారంతో సిద్ధంగా ఉండాలని అధికారులను ఆదేశించారు. ఈ సమీక్షా సమావేశంలో పార్లమెంట్ సభ్యులు బలరామ్ నాయక్, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీనివాసరాజు, దేవాదాయ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ శైలజా రామయ్యర్ ఇతర ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# కేంద్ర కేబినెట్ విస్తరణ ఊహాగానాలు
# ఏపీ నుంచి ఇద్దరికి ఛాన్స్


**విజయవాడ, సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి)**
ఉపరాష్ట్రపతి ఎన్నికలు పూర్తయ్యాయి. తదుపరి బీహార్ తో పాటు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి పెట్టనుంది బిజెపి. బీహార్ లో నితీష్ కుమార్ నేతృత్వంలో ఎన్డీఏ, తమిళనాడులో అన్న డీఎంకేతో పొత్తు ద్వారా అధికారంలోకి రావాలని బిజెపి భావిస్తోంది. అయితే ఇప్పుడు మిత్రుల ద్వారా ముందుకెళ్లాలని చూస్తున్న బిజెపి.. కేంద్ర మంత్రివర్గాన్ని విస్తరించి మిత్రులకు పదవులు కేటాయించాలని చూస్తోంది. బీహార్లో జెడియుకు మంత్రివర్గంలో స్థానం ఇవ్వనుంది. తమిళనాడు నుంచి బిజెపి మాజీ చీఫ్ అన్నామలైకు మంత్రి పదవి ఇచ్చేందుకు సుముఖంగా ఉంది. ఇంకోవైపు ఏపీ నుంచి ఒకరిని కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకోవాలని చూస్తోంది. అదే జరిగితే మూడు పార్టీల్లో ఎవరికి అవకాశం దక్కుతుంది అన్నది ప్రశ్నగా మిగులుతోంది. ఏపీ నుంచి ప్రస్తుతం ముగ్గురు మంత్రులు ఉన్నారు. బిజెపి నుంచి నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, తెలుగుదేశం పార్టీ నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. అయితే కేంద్ర మంత్రివర్గం తూర్పు సమయంలోనే జనసేనకు అవకాశం ఇచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. అప్పట్లో కేంద్ర మంత్రివర్గంలో చేరేందుకు పవన్ కళ్యాణ్ పెద్దగా సుముఖత వ్యక్తం చేయలేనట్టు తెలుస్తోంది. అయితే ఇప్పుడు మంత్రివర్గ విస్తరణలో ఛాన్స్ ఇస్తే దక్కించుకోవాలని పవన్ భావిస్తున్నట్లు సమాచారం. ఆ పార్టీకి రెండుచోట్ల ఎంపీలు ఉన్నారు. మచిలీపట్నం నుంచి జనసేన తరఫున గెలిచిన బాలసౌరి సీనియర్. జనసేనకు గాని ఆ పదవి కేటాయిస్తే బాల సౌరికి అవకాశం దొరికి పరిస్థితి ఉంటుంది. లేకుంటే మాత్రం నాగబాబును కేంద్ర రాజకీయాల్లోకి పంపించాలని పవన్ భావిస్తే ఆయన మంత్రి పదవి చేపట్టే అవకాశం ఉందితెలుగుదేశం పార్టీకి సంబంధించి ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉన్నారు. కింజరాపు రామ్మోహన్



నాయుడుకేంద్రంలో కీలకమైన పౌర విమానయాన శాఖను దక్కించుకున్నారు. గుంటూరు ఎంపీ చంద్రశేఖర్ మాత్రం సహాయ మంత్రి పదవితో ఉన్నారు. తెలుగుదేశం పార్టీకి కేటాయిస్తే మాత్రం రాయలసీమ ప్రాంతానికి చెందిన ఎంపీకి అవకాశం ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఈ లెక్కన హిందూపురం, చిత్తూరు ఎంపీల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి. ఒకవేళ రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వదలుచుకుంటే నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చంద్రబాబు అవకాశం ఇస్తారని తెలుస్తోంది. బిజెపికి సంబంధించి ఇప్పటికే నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మ కేంద్ర సహాయ మంత్రిగా ఉన్నారు. మరోసారి బిజెపికి అవకాశం ఇవ్వాలనుకుంటే ప్రముఖంగా పురందేశ్వరి పేరు వినిపిస్తోంది. మొన్నటి వరకు ఆమె ఏపీ బీజేపీ చీఫ్ గా ఉండేవారు. కేంద్రమంత్రి పదవి కారణంగానే ఆమెను తప్పించారని అప్పట్లో ప్రచారం నడిచింది. ఒకవేళ సామాజిక సమీకరణల దృష్ట్యా పురందేశ్వరికి అవకాశం రాకుంటే మాత్రం.. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కు ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. అయితే ఏ పార్టీకి ఇస్తారో తెలియదు కానీ ఏపీ నుంచి మరో కేంద్రమంత్రి పదవి ఖాయమని టాక్ నడుస్తోంది. ఉపరాష్ట్రపతిఎన్నికలు పూర్తయ్యాయి. తదుపరి బీహార్ తో పాటు తమిళనాడు అసెంబ్లీ ఎన్నికలపై దృష్టి పెట్టనుంది బిజెపి. బీహార్ లో నితీష్ కుమార్ నేతృత్వంలో ఎన్డీఏ, తమిళనాడులో అన్న డీఎంకేతో పొత్తు ద్వారా అధికారంలోకి రావాలని బిజెపి భావిస్తోంది. అయితే ఇప్పుడు మిత్రుల ద్వారా ముందుకెళ్లాలని చూస్తున్న బిజెపి.. కేంద్ర మంత్రివర్గాన్ని విస్తరించి మిత్రులకు పదవులు కేటాయించాలని చూస్తోంది. బీహార్లో జెడియుకు మంత్రివర్గంలో స్థానం ఇవ్వనుంది. తమిళనాడు నుంచి బిజెపి మాజీ చీఫ్ అన్నామలైకు మంత్రి పదవి ఇచ్చేందుకు సుముఖంగా ఉంది. ఇంకోవైపు ఏపీ నుంచి ఒకరిని కేంద్రమంత్రి వర్గంలోకి తీసుకోవాలని చూస్తోంది. అదే జరిగితే మూడు పార్టీల్లో ఎవరికి అవకాశం దక్కుతుంది అన్నది ప్రశ్నగా మిగులుతోంది. ఏపీ నుంచి ప్రస్తుతం ముగ్గురు మంత్రులు ఉన్నారు. బిజెపి నుంచి నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, తెలుగుదేశం పార్టీ నుంచి కింజరాపు రామ్మోహన్ నాయుడు, పెమ్మసాని చంద్రశేఖర్ ఉన్నారు. అయితే కేంద్ర మంత్రివర్గం తూర్పు సమయంలోనే జనసేనకు అవకాశం ఇచ్చారు ప్రధాని నరేంద్ర మోడీ. అప్పట్లో కేంద్ర మంత్రివర్గంలో చేరేందుకు పవన్ కళ్యాణ్ పెద్దగా సుముఖత వ్యక్తం చేయలేనట్టు తెలుస్తోంది. అయితే ఇప్పుడు మంత్రివర్గ విస్తరణలో ఛాన్స్ ఇస్తే దక్కించుకోవాలని పవన్ భావిస్తున్నట్లు సమాచారం
. ఆ పార్టీకి రెండుచోట్ల ఎంపీలు ఉన్నారు. మచిలీపట్నం నుంచి జనసేన తరఫున గెలిచిన బాలసౌరి సీనియర్. జనసేనకు గాని ఆ పదవి కేటాయిస్తే బాల సౌరికి అవకాశం దొరికి పరిస్థితి ఉంటుంది. లేకుంటే మాత్రం నాగబాబును కేంద్ర రాజకీయాల్లోకి పంపించాలని పవన్ భావిస్తే ఆయన మంత్రి పదవి చేపట్టే అవకాశం ఉంది. తెలుగుదేశం పార్టీకి సంబంధించి ఇప్పటికే ఇద్దరు మంత్రులు ఉన్నారు. కింజరాపు రామ్మోహన్ నాయుడు కేంద్రంలో కీలకమైన పౌర విమానయాన శాఖను దక్కించుకున్నారు. గుంటూరు ఎంపీ చంద్రశేఖర్ మాత్రం సహాయ మంత్రి పదవితో ఉన్నారు. తెలుగుదేశం పార్టీకి కేటాయిస్తే మాత్రం రాయలసీమ ప్రాంతానికి చెందిన ఎంపీకి అవకాశం ఇచ్చే పరిస్థితి కనిపిస్తోంది. ఈ లెక్కన హిందూపురం, చిత్తూరు ఎంపీల పేర్లు ప్రముఖంగా వినిపిస్తున్నాయి.
ఒకవేళ రెడ్డి సామాజిక వర్గానికి ఇవ్వదలుచుకుంటే నెల్లూరు ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డికి చంద్రబాబు అవకాశం ఇస్తారని తెలుస్తోంది. బిజెపికి సంబంధించి ఇప్పటికే నరసాపురం ఎంపీ భూపతి రాజు శ్రీనివాస వర్మ కేంద్ర సహాయ మంత్రిగా ఉన్నారు. మరోసారి బిజెపికి అవకాశం ఇవ్వాలనుకుంటే ప్రముఖంగా పురందేశ్వరి పేరు వినిపిస్తోంది. మొన్నటి వరకు ఆమె ఏపీ బీజేపీ చీఫ్ గా ఉండేవారు.
కేంద్రమంత్రి పదవి కారణంగానే ఆమెను తప్పించారని అప్పట్లో ప్రచారం నడిచింది. ఒకవేళ సామాజిక సమీకరణల దృష్ట్యా పురందేశ్వరికి అవకాశం రాకుంటే మాత్రం.. అనకాపల్లి ఎంపీ సీఎం రమేష్ కు ఛాన్స్ ఇస్తారని తెలుస్తోంది. అయితే ఏ పార్టీకి ఇస్తారో తెలియదు కానీ ఏపీ నుంచి మరో కేంద్రమంత్రి పదవి ఖాయమని టాక్ నడుస్తోంది.
చూడాలి మరి ఏం జరుగుతుందో..



# రాజారెడ్డి.. వర్సెస్ జగన్



**కడప, సెప్టెంబర్ 14, ( భారతశక్తి ప్రతినిధి)**
రాజకీయ పార్టీల్లో లెగసీ కంటిన్యూ చేయడానికి అన్నా చెల్లెళ్లు పోటీ పడుతున్నారు. ప్రధానంగా రెండు తెలుగు రాష్ట్రాల్లో ఇలాంటి రాజకీయ వారసత్వంపై కుటుంబాల్లోనే విభేదాలు తలెత్తాయి. అయితే తండ్రి నుంచి సంక్రమించిన రాజకీయాలకు వారసుడెవరు? అనేది నిర్ణయించేది నేతలు కాదు.. ఆ కుటుంబం కాదన్నది మర్చిపోతున్నారు. వారసుడు తామేనంటూ ప్రకటనలు చేస్తున్నారు. తెలంగాణలో బీఆర్ఎస్ లోనూ కల్వకుంట్ల కవిత, కేటీఆర్ ల మధ్య విభేదాలు తలెత్తాయి. కేవలం రాజకీయ ఆధిపత్యం కోసమే ఈ కీచులాటలని చెప్పకతప్పదు. ఆంధ్రప్రదేశ్ లోనూ ఎప్పటి నుంచో వైఎస్ రాజశేఖర్ రెడ్డి రాజకీయ వారసత్వంపై యుద్ధమే జరుగుతుంది. వైఎస్ షర్మిల, వైఎస్ జగన్ ల మధ్య వార్ నడుస్తుంది. తాజాగా వైఎస్ రాజారెడ్డి వైఎస్ వారసుడంటూ షర్మిల చేసిన వ్యాఖ్యలతో మరోసారి రాజకీయ వారసత్వంపై రెండు తెలుగు రాష్ట్రాల్లో చర్చ జరుగుతుంది. సాధారణంగా తండ్రి మరణించిన వెంటనే రాజకీయ వారసత్వం కోసం కొందరు పోటీ పడతారు. జాతీయ స్థాయిలో కాంగ్రెస్ కూడా ఇందిరా గాంధీ మృతి తర్వాత రాజీవ్ గాంధీ, రాజీవ్ గాంధీ మరణం తర్వాత రాహుల్ గాంధీ వారసులుగా నిలిచారు. మేనకా గాంధీ వారసత్వంపై విభేదించారు. మేనకాగాంధీ తన వారసుడిగా వరుణ్ గాంధీని రంగంలోకి దించారు. అయితే చివరకు రాజకీయ వారసత్వం సోనియాగాంధీ ఇంటికి చేరుకుంది. మేనకా గాంధీ బీజేలో చేరిపోయారు. ఇక ప్రియాంక ఉన్నప్పటికీ ఆమె వారసత్వం జోలికి పోలేదు. అన్న రాహుల్ గాంధీ మాత్రమే వారసత్వం చేపట్టాలని చెబుతుంది. తమిళనాడులో కరుణానిధి మరణం తర్వాత స్టాలిన్, ఆళగిరి మధ్య వారసత్వ పోరు ప్రారంభమయినా పార్టీతో పాటు అధికారం కూడా స్టాలిన్ చేతుల్లోకి వచ్చింది. ఆళగిరి కనిపించడం లేదు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో వైఎస్ రాజశేఖర్ రెడ్డి మరణించిన తర్వాత వైఎస్ జగన్ సొంత పార్టీ పెట్టుకున్నారు. ఆయనను జనం ఆదించారు. 2019 ఎన్నికల్లో అధికారాన్ని కట్టబెట్టారు. అయితే ఇప్పుడు వైఎస్ వారసుడు వైఎస్ రాజారెడ్డి అంటూ తన కుమారుడిని రంగంలోకి దించారు. అయితే రాజారెడ్డి ఇంటిపేరు వైఎస్ కాదంటూ వైసీపీ సోషల్ మీడియాలో పెద్దయెత్తున విమర్శలు వినిపిస్తున్నాయి. తన భర్త ఇంటి పేరు కుమారుడికే వస్తున్నా వైఎస్ ట్యాగ్ లైన్ వదలడానికి షర్మిల ఇష్టపడటం లేదు. తన కుమారుడికి రాజారెడ్డి అని వైఎస్ నామకరణం చేశారంటూ గుర్తు చేస్తున్నారు. అయితే రాజారెడ్డిని గుర్తించాల్సింది వైఎస్ కుటుంబ సభ్యులు కాదు.. షర్మిల అభిమానులు కాదు.. వైసీపీ వీరాభిమానులు కూడా కాదు. రాజారెడ్డి రాజకీయ ప్రవేశం చేసి వస్తే ఆయనను నేతగా గుర్తించాల్సింది ప్రజలు మాత్రమేనన్న విషయం మరిచిపోయి వ్యవహరిస్తున్నారన్న కామెంట్స్ బహిరంగంగానే వినిపిస్తున్నాయి. వైఎస్ రాజశేఖర్ రెడ్డి బతికున్నంత కాలం కాంగ్రెస్ లోనే ఉన్నారు. పదవి ఉన్నా లేకున్నా ఆయన పార్టీని వీడలేదు. చివరకు రెండుసార్లు ముఖ్యమంత్రి అయ్యారు. కానీ వైఎస్ జగన్ సొంత పార్టీ పెట్టుకున్న తర్వాత కాంగ్రెస్ ఓటు బ్యాంకు మొత్తం వైసీపీకి షిఫ్ట్ అయింది. అంటే వైఎస్ అభిమానులు, కాంగ్రెస్ పార్టీ నేతలు, కార్యకర్తల్లో ఎక్కువ మంది వైఎస్ వారసుడిగా నాడు జగన్ ను గుర్తించారు. ఇప్పుడు కూడా రాజారెడ్డి రాజకీయాల్లోకి వచ్చినప్పటికీ వారసుడిగా షర్మిల ప్రకటించుకుంటే చాలదు. రేపు రాజారెడ్డి జనంలోకి వచ్చినప్పుడు ఆయనకు కనిపించే ఆదరణ, ఆయన సాధించే గెలుపులు వంటివి మాత్రమే వైఎస్ వారసుడు ఎవరన్నది తేల్చనున్నాయి. రాజారెడ్డి ఇంకా రాజకీయాల్లోకి రాకముందే ఆయన చుట్టూ వారసత్వంపై చర్చ జరుగుతుండటం విచిత్రమనే అనుకోవాలి. వైఎస్ షర్మిల కూడా తాను గత ఐదేళ్ల నుంచి సాధించింది రాజకీయాల్లో ఏమీ లేదని, రాజారెడ్డిని కూడా ఈ మురికి కూపంలోకి ఎందుకు తెస్తున్నారంటూ సోషల్ మీడియాలో వైఎస్ అభిమానులు కామెంట్ చేస్తున్నారు.

# వార్నింగ్‌లతో సరా...



**గుంటూరు, సెప్టెంబర్ 14. ( భారతశక్తి ప్రతినిధి)**
వైసీపీ అధినేత వైఎస్ జగన్ దూకుడు పెంచారు. జనంలోకి వెళ్లడమే కాకుండా ప్రభుత్వ నిర్ణయాలు అమలు కాకుండా వార్నింగ్ ల మీద వార్నింగ్ లు ఇస్తున్నారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేయడాన్ని జగన్ తప్పుపడుతున్నారు. తమ హయాంలో జిల్లాకు ఒక మెడికల్ కళాశాలను ఏర్పాటు చేయడానికి అవసరమైన భవనాలను నిర్మించామని, మౌలిక వసతులు కూడా అనేక కళాశాలల్లో కల్పించామని, కొన్ని చోట్ల మెడికల్ కళాశాలలో తరగతులు కూడా ప్రారంభమయ్యాయని జగన్ చెప్పుకొచ్చారు. ఇప్పుడు ప్రభుత్వ వైద్య కళాశాలలను ప్రయివేటు పరం చేయడానికి చంద్రబాబు నాయుడు పెద్ద స్కామ్ కు తెరలేపారని ఆరోపించారు. తన సొంత మనుషులకు మెడికల్ కళాశాలలను కట్టబెట్టడానికే ఈ నిర్ణయం తీసుకున్నారని దీని వెనక పెద్ద మొత్తంలో ముడుపులు చేతులు మారే అవకాశముందని ఆరోపించారు. అదే సమయంలో చంద్రబాబు నాయుడు కూడా అదే స్థాయిలో కౌంటర్ ఇచ్చారు. ప్రభుత్వ వైద్య కళాశాలలను ఏర్పాటు చేయడం అంటే కేవలం భూములను కేటాయించడమే కాదని, అందుకు అవసరమైన అన్ని రకాలుగా వసతులతో పాటు ప్యాకల్టీని, అవసరమైన సామగ్రిని సిద్ధం చేయాల్సిన గత ప్రభుత్వం మొండి గోడలను వదిలేసిందన్నారు. ఇంత భారీ సంఖ్యలో మెడికల్ కళాశాలలను ఏర్పాటు చేసి, వాటిని నిర్వహించడం ప్రభుత్వానికి భారంగా మారుతుందని కూటమి నేతలు చెబుతున్నారు. అందుకే పీపీపీ మోడల్ లో ప్రయివేటు వారికి అప్పగిస్తే తప్పేమిటని ప్రశ్నిస్తున్నారు. ప్రతి మెడికల్ కళాశాలలో యాభై శాతం సీట్లు కన్వీనర్ కోటా కింద ఉంటాయని, పేద విద్యార్థులకు ఇది ఉపయోగమేనని వారు వాదిస్తున్నారు. ప్రభుత్వం నిర్వహించేకంటే ప్రయివేటు వ్యక్తుల చేతుల్లో నాణ్యమైన వైద్య విద్య అందుతుందని అంటున్నారు. అధికారంలోకి వస్తే అయితే జగన్ మాత్రం తాము తిరిగి అధికారంలోకి వస్తే తిరిగి ప్రభుత్వ పరం చేసుకుంటామని హెచ్చరించారు. ఎవరూ టెండర్లలో పాల్గొనవద్దని కూడా ఆయన పరోక్షంగా చెప్పారు. ఒకవేళ మెడికల్ కళాశాలను ఇప్పుడు తీసుకున్నా మూడేళ్ల తర్వాత తమ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత వారి నుంచి ఖచ్చితంగా తీసుకుంటామని చెబుతున్నారు.

# బెజవాడలో డయేరియా...

**విజయవాడ, సెప్టెంబర్ 14. ( భారతశక్తి ప్రతినిధి)**

విజయవాడలోని న్యూ రాజరాజేశ్వరి పేటలో డయేరియా బాధితులు కోలుకుంటున్నారు. ఇప్పటివరకు మొత్తం 115 కేసులు నమోదైనాయి. వీరిలో ప్రస్తుతం చికిత్స పొందుతున్నవారు 61 మంది. చికిత్స తీసుకొని మరో 54 మంది డిశ్చార్జ్ అయినారు. ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా అక్కడ మెడికల్ క్యాంప్ కొనసాగుతుంది. డయేరియా కారణంగా స్థానికులు కాచి చల్లార్చిన నీరే తాగాలని వైద్యాధికారులు హెచ్చరికలు జారీ చేశారు. బాధితులకు మెడికల్ టెస్ట్‌లు కొనసాగుతున్నాయి.ఇక్కడి డయేరియా కేసుల పరిస్థితి నిలకడగా



ఉన్నప్పటికీ ఓవైపు బాధితులు కోలుకుని ఇంటికి వెళ్తుంటే మరోవైపు కొత్త కేసులు నమోదవుతున్నాయి. న్యూ రాజరాజేశ్వరి పేట వైద్య శిబిరంలో ఈ రోజు కొత్తగా మరో 5 గురు అడ్మిట్ అయ్యారు. దీంతో 57వ డివిజన్ న్యూ రాజరాజేశ్వరి పేటలో సచివాలయాల వారీగా బృందాలు ఇంటింటి సర్వే చేస్తున్నాయి. ఎంపీడీవో స్థాయి అధికారి పర్యవేక్షణలో బృందాలుగా ఏర్పడి ఇంటింటి సర్వే నిర్వహిస్తున్నారు. జ్వర పీడితులు, వాంతులు, విరేచనాలతో ఎవరైనా బాధపడుతున్నారా? అనే సమాచారాన్ని సేకరించే పనిలో అధికార గణం పని చేస్తుంది.పాత రాజరాజేశ్వరి పేటలో పెరుగుతున్న డయేరియా కేసులు.. ఇప్పటివరకు 100 దాటిన డయేరియా బాధితుల సంఖ్య. నిన్న రాత్రి మెడికల్ క్యాంప్‌లో 30 మంది చికిత్స కోసం వచ్చారు. మరికొందరు బాధితులు వైద్యానికి ప్రైవేట్ ఆస్పత్రికి వెళ్తున్నారు. ఇప్పటికే పైప్‌లైన్ ద్వారా నీటి సరఫరా నిలిపివేసిన అధికారిక యంత్రాంగం.విజయవాడలోని న్యూరాజరాజేశ్వరిపేటలో ప్రస్తుతం పరిస్థితి అదుపులోనే ఉందని వైద్యఆరోగ్యశాఖ మంత్రి

# లోకేష్ ఫస్ట్ టాస్క్ కంప్లీటెడ్...

**విజయవాడ, సెప్టెంబర్ 14. ( భారతశక్తి ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తన తనయుడు లోకేశ్ కోసం రోడ్ మ్యాప్ ను సిద్ధం చేసినట్లు స్పష్టంగా తెలుస్తుంది. చంద్రబాబు ఒక మార్గాన్ని ఏర్పరుస్తున్నట్లు కనపడుతుంది. రహదారిని ఏర్పాటు చేసి లోకేశ్ రాజకీయ ప్రయాణానికి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు ఎక్కువగా చంద్రబాబు ఈ టర్మ్ లో కనిపిస్తుంది. గతంలో మూడు సార్లు ముఖ్యమంత్రిగా పనిచేసిన సమయంలో చంద్రబాబు నాయుడులో ఈ ఆలోచన లేదు. ఆయన మదిలోకి కూడా రాలేదు. కానీ లోకేశ్ చేతికి అందిరావడంతో తన కళ్ల ముందే కుమారుడిని అందలం ఎక్కించాలన్నది కన్నతండ్రి తాపత్రయం చంద్రబాబులో స్పష్టంగా కనిపిస్తుంది. లోకేశ్ ను ప్రజల్లోకి పంపడమే కాకుండా ఆయనకు రాజకీయాల్లో ఎత్తుపల్లాలను గురించి ప్రాక్టికల్స్ గా ఈ ఐదేళ్ల కాలం ఉపయోగించేటట్లే కనపడుతుంది. . ఇప్పటికే తెలుగుదేశం పార్టీ కార్యక్రమాల విషయంలో లోకేశ్ దే పైచేయి కనిపిస్తుంది. లోకేశ్ కు ప్రత్యేక టీం ఉంది. ఆయన పార్టీ కార్యక్రమాలను స్వయంగా పర్యవేక్షిస్తూ కార్యకర్తలతో పాటు పార్టీ నేతలను కూడా గాడిన పెట్టే ప్రయత్నం చేస్తున్నారు. కార్యకర్తలలో జోష్ నింపుతూనే వారు ఆర్థికంగా నిలదొక్కుకునేందుకు అవసరమైన అన్ని రకాలుగా చర్యలు తీసుకుంటున్నారు. టీడీపీ ముఖ్య కార్యకర్త కు ఏ ఆపద వచ్చినా వెంటనే లోకేశ్ క్షణంలో సోషల్ మీడియాలో స్పందించడమే కాకుండా ఆపదలో ఉన్న వారికి వెంటనే సాయాన్ని కూడా ప్రకటిస్తున్నారు. తాను స్వయంగా ప్రకటించడమే కాకుండా స్థానిక నేతలను పురమాయించి కార్యకర్తలను ఆదుకోవాలని ఆదేశాలు జారీ చేస్తున్నారు. అప్పుడేనా? టీడీపీ మంత్రులతో కూడా... ఇక మంత్రివర్గ సమావేశం ప్రారంభానికి ముందు టీడీపీకి చెందిన మంత్రులతో లోకేశ్ గత కొన్ని దఫాలుగా ప్రత్యేకంగా సమావేశమవుతున్నారు. వారితో మంత్రివర్గ భేటీ కంటే ముందుగా మాట్లాడుతున్నారు. ఒకరకంగా మినీ కేబినెట్ మీటింగ్ లోకేశ్ నిర్వహిస్తున్నారని పార్టీకి చెందిన నేతలే అంటున్నారు. కూటమిలోని మిత్ర పక్షాలకుచెందిన మంత్రులను ఈ సమావేశాలకు పిలవకపోయినా అత్యధిక సంఖ్యలో ఉన్న తన పార్టీకి చెందిన మంత్రులతో సమావేశమై వారికి దిశానిర్దేశం చేస్తున్నారు. ఇప్పటికైతే ఎమ్మెల్యేలకు, మంత్రులకు ఒక క్లారిటీ మాత్రం వచ్చేసింది. లోకేశ్ నేరుగానే ఆదేశాలు జారీ చేస్తుండటంతో త్వరలోనే ఆయన అందలం ఎక్కడం ఖాయమన్న కామెంట్స్ సొంత పార్టీ నుంచే వినిపిస్తున్నాయి.ఢిల్లీ స్థాయిలో లాబీయింగ్ కూడా... ఇటీవల లోకేశ్ తరచూ ఢిల్లీ పర్యటనలు చేస్తుండటం, కేంద్ర మంత్రులతో సమావేశాలు, మోదీ, అమిత్ షాలతో భేటీలు వంటి వాటితో మరింతగా రాజకీయాలను అందిపుచ్చుకునేలా చంద్రబాబు నాయుడు అవకాశం కల్పిస్తున్నారు. ఉప రాష్ట్రపతి ఎన్నికలకు ముందు కూడా లోకేశ్ ఢిల్లీకి



వెళ్లడం, పార్టీ ఎంపీలతో కలసి మాట్లాడటం వంటివి ఈ తరహాలోనివే. కార్యకర్తలకు, పార్టీ నేతలకు, మంత్రులకు, ఎంపీలకు అయితే ఒక క్లారిటీ వచ్చింది. వచ్చే ఎన్నికల వరకూ చంద్రబాబు ముఖ్యమంత్రిగా ఆయన నాయకత్వంలోనే వెళతారంటున్నారు. అదే వచ్చే ఎన్నికల్లో తిరిగి కూటమి ప్రభుత్వం విజయం సాధిస్తే మాత్రం ఖచ్చితంగా నారా లోకేశ్ ప్రభుత్వ పగ్గాలు చేపట్టడం ఖాయమన్న అభిప్రాయం ఇప్పుడు పార్టీలో మార్మోగుతుంది. అందుకే ఇప్పటి నుంచే టీడీపీ అంతా లోకేశ్ చుట్టూ తిరుగుతుండటానికి అదే కారణమన్న విశ్లేషణలు వెలువడుతున్నాయి.

**లోకేష్.. ఎలా మారారు.. ఎంతలా మారారు**

మంత్రి నారా లోకేష్. ప్రతికూలతల నుంచి ఎదగాలనుకునే యువ నాయకులకు ఆయన ఒక ఆదర్శం. ఎలాంటి లోకేష్.. ఎలా మారారు.. ఎంతలా మారారు అనేది ఇప్పుడు ప్రధాన చర్చ. పప్పు అన్నవారే ఇప్పుడు పప్పులో కాలేశామని బాధపడుతున్నారు. లోకేష్ విషయంలో తప్పు చేశామని పశ్చాత్తాప పడుతున్నారు. అప్పుడెప్పుడో తండ్రి చాటు బిడ్డను చూసి.. వచ్చిరాని మాటను చూసి ఏవేవో వాగేశారు. కానీ ప్రతి మాటను, ప్రతి అడ్డంకిని గుణపాఠంగా మార్చుకున్నారు లోకేష్. నిమిషానికి నిమిషానికి.. ప్రతి గంటకు.. ప్రతి రోజుకు.. ప్రతి నెలకు.. ప్రతి ఏడాదికి తనలో ఉన్న పరిణితిని పెంచుకున్నారు లోకేష్. ఎవరైతే ఎగతాళి చేశారో? ఎవరైతే తక్కువ చేసి మాట్లాడారో? వారందరికీ తన పనితీరు ద్వారా సమాధానం చెప్పారు. తన విషయంలో దూకుడు ప్రదర్శించిన వారికి రెడ్ బుక్ పనితనం చూపించారు. అదే సమయంలో రాజకీయ పరిణితి పెంచుకున్నారు. ఎలా అయితే ప్రజల్లోకి వెళ్ళగలమో ఆలోచన చేసి అందుకు అనుగుణంగా అడుగులు వేస్తున్నారు. చేసిందే చెబుతున్నారు. అనవసర వ్యాఖ్యలకు దూరంగా ఉంటున్నారు. ముఖ్యంగా ప్రజల అభిమానాన్ని పొందే మంచి పనులను ఎంచుకుంటున్నారు. రాజకీయ ప్రత్యర్థుల అంచనాలకు అందకుండా రాజకీయాలు చేస్తున్నారు.మొన్న ఆ మధ్యన దావోస్ పర్యటనకు వెళ్లారు. సీఎం చంద్రబాబు తో పాటు ఇతర మంత్రులు, అధికారుల బృందం సైతం వచ్చింది. లోకేష్ చాలామంది ఐటీ దిగ్గజాలు, పారిశ్రామికవేత్తలతో సమావేశం అయ్యారు. కానీ అదిగో పెట్టుబడులు.. ఇదిగో పెట్టుబడులు అంటూ మాత్రం ప్రకటనలు చేయలేదు. అంతకుముందే లండన్ పర్యటనకు వెళ్లారు. ప్రముఖ దిగ్గజ సంస్థల ప్రతినిధులతో చర్చలు జరిపారు. అవన్నీ సానుకూలం అని చెప్పారే కానీ.. ప్రచార ఆర్భాటం చేయలేదు. కొద్ది రోజుల కిందట సింగపూర్ వెళ్లారు. అక్కడి పారిశ్రామికవేత్తలతో సమావేశం అయ్యారు. తాము ఎందుకు వెళ్ళామో చెప్పారు కానీ.. ఇక్కడ కూడా ఎటువంటి ఆర్భాటం చేయలేదు. అయితే ప్రతిరోజు ఏదో ఒక పరిశ్రమ, సంస్థ ఏపీలో తాము పెట్టుబడులు పెడుతున్నామని చెబుతోంది. ప్రకటనలు చేస్తోంది. అలా చేస్తున్న సంస్థల ప్రతినిధులు లోకేష్ చర్చలు జరిపిన వారే. అయితే వారంతట వారు ఇప్పుడు లోకేష్ పేరు చెబుతున్నారు. ప్రజలు కూడా లోకేష్ పని తీరును మెచ్చుకుంటున్నారు.మొన్న ఆ మధ్యన ఢిల్లీ వెళ్లారు నారా లోకేష్. ప్రధాని నరేంద్ర మోడీతో సమావేశం అయ్యారు. గంట పాటు వారి సమావేశం జరిగింది. తాను ఢిల్లీ ఎందుకు వెళ్లానో లోకేష్ మీడియాకు వివరించారు కూడా. అంతకుముందు మే నెలలో కుటుంబ సమేతంగా ఢిల్లీ వెళ్లి ప్రధాని మోదీతో డిన్నర్ భేటీ చేశారు. అయితే ఇలా ప్రధాని నరేంద్ర మోడీని కలుస్తున్న క్రమంలో ఎటువంటి హడావిడి చేయడం లేదు. కేవలం తన పని తాను చేసుకుని ముందుకు సాగుతున్నారు. అయితే ఒక్కటి మాత్రం నిజం తెలుగుదేశం పార్టీని ఒంటి చేత్తో నడపగలుగుతున్నారు. ప్రభుత్వంలోనూ కీలక పాత్ర పోషిస్తున్నారు. కూటమి సమన్వయం లోనూ ఆయన పాత్ర కీలకం. ఇంకోవైపు రాష్ట్రానికి పెట్టుబడులు తేవడంలో కూడా కీ రోల్ ప్లే చేస్తున్నారు. అయితే ఎంత ఎత్తుకు ఎదిగినా ఒదిగి ఉండవచ్చని చేసి చూపిస్తున్నారు. తాజాగా నేపాల్ లో చిక్కుకున్న ఏపీ ప్రజలను సురక్షితంగా స్వస్థలాలకు తీసుకురాగలిగారు. కూటమికి కీలకమైన అనంతపురం సక్సెస్ సభకు సైతం దూరంగా ఉన్నారు.

# కాన్ క్లేవ్ పేరుతో వైట్ కాలర్ దోపిడీ

**హైదరాబాద్, సెప్టెంబర్ 14 ( భారతశక్తి ప్రతినిధి)**


రాజకీయ నాయకులు ప్రచారాన్ని కోరుకుంటారు. నిత్యం వార్తల్లో ఉండాలని అనుకుంటారు. తమ గురించి మాత్రమే మీడియా గొప్పగా చెప్పాలని.. తమకు నచ్చని వారిపై నిత్యం రాళ్లు వేస్తూ ఉండాలని.. బురద కుమ్మరిస్తూ ఉండాలని అనుకుంటారు. సహజంగా రాజకీయ నాయకులు కూడా మనుషులే కాబట్టి.. వారికి కూడా ఆశలు ఉంటాయి కాబట్టి తప్పులేదు. కానీ వారి మాదిరిగానే ప్రత్యర్థి నాయకులు కూడా అలానే ఆలోచిస్తారు కాబట్టి.. మీడియాకు ఇబ్బందికర పరిస్థితి ఏర్పడుతుంది. ఒకరి గురించి చెప్తే మరొకరు బాధపడతారని నిశ్శబ్దంగా ఉంటుంది. అయితే నేటి కాలంలో రాజకీయ నాయకులు ఆరి తేరి పోయారు కాబట్టి సొంతంగా మీడియా వ్యవస్థలను ఏర్పాటు చేసుకున్నారు. మరికొందరైతే పరోక్షంగా మీడియా వ్యవస్థలను నడిపిస్తున్నారు.గతంలో పత్రికలను మాత్రమే నాయకులు మేనేజ్ చేసేవారు. కొంతకాలానికి న్యూస్ చానల్స్ వచ్చాయి. ఇప్పుడు సోషల్ మీడియా గ్రూపులు అదనంగా జత కూడిపోయాయి. ఆయనప్పటికీ రాజకీయ నాయకులకు ప్రచార యావ తగ్గడం లేదు. పైగా తమ మాటలను మాత్రమే ప్రజలు వినాలి అని కోరిక వారిలో అంతకంతకు పెరిగిపోతోంది. రాజకీయ నాయకుల ప్రచార పిచ్చిని కొన్ని మీడియా సంస్థలు తమకు అనుకూలంగా మార్చుకుంటున్నాయి. అయితే చేసేది ఎలాగూ వైట్ కాలర్ దోపిడీ కాబట్టి మీడియా అధినేతలు దానికి సరికొత్త పేరు పెడుతున్నారు.విదేశాలలో ఎన్నికలు జరిగినప్పుడు పోటీలో ఉండే ఇద్దరు నాయకులను ఒకే వేదిక మీద తీసుకొస్తారు. అక్కడ ఉన్న పాత్రికేయులు రకరకాల ప్రశ్నలు అడుగుతారు. దానికి ఆ ఇద్దరు నాయకులు సమాధానాలు చెప్తారు. ఇందులో ఎటువంటి మీడియా స్వార్థం ఉండదు. పెయిడ్ భజన అంతకంటే ఉండదు. కాకపోతే

> **ఇప్పుడు సోషల్ మీడియా గ్రూపులు అదనంగా జత కూడిపోయాయి. ఆయనప్పటికీ రాజకీయ నాయకులకు ప్రచార యావ తగ్గడం లేదు. పైగా తమ మాటలను మాత్రమే ప్రజలు వినాలి అని కోరిక వారిలో అంతకంతకు పెరిగిపోతోంది.**

ప్రజలకు వాస్తవాలు తెలిసే అవకాశం ఉంటుంది. కానీ మన దేశంలో ఎన్నికలు లేకున్నా.. ఏదో జరిగిపోతోంది అనే భ్రమను కల్పించడంలో మీడియా ఆరి తేరిపోయింది. పైగా దానికి కాన్ క్లేవ్ అని పేరు పెట్టి.. అధికార, ప్రతిపక్ష పార్టీల నాయకులను పిలుస్తోంది. పేరుకు భవిష్యత్తు కాలంలో దేశం పరిస్థితి ఏమిటి? రాష్ట్రాల పరిస్థితి ఏమిటి? అని చెబుతుంది. కానీ అంతర్గతంగా మాత్రం పెయిడ్ భజన. ఒక ముక్కలో చెప్పాలంటే అధికార పార్టీ దగ్గర కొంత.. ప్రతిపక్ష పార్టీ దగ్గర కొంత డబ్బులు తీసుకొని.. మీరు మంచివారే.. వారు కూడా మంచివారే.. వెరసి మనమంతా మంచివారమే అనే సందేశాన్ని ఓట్లు వేసిన ప్రజలకు ఇస్తుంది.

ఎన్నో మీడియా సంస్థలు కాన్ క్లేవ్ లు నిర్వహించాయి. ఇంతవరకు అధికార పార్టీ చేసిన తప్పులను గాని.. ప్రతిపక్ష పార్టీ చేసిన అన్యాయాలను గాని వెలుగులోకి తీసుకురాలేకపోయాయి. న్యూట్రల్

# ఇండియా కు ట్రంప్



**ముంబై, సెప్టెంబర్ 14 :** భారత్‌పై సుంకాలతో ఒకవైపు విరుచుకుపడుతున్న అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. భారత్ వాటిని లెక్క చేయకపోవడంతో ఇప్పుడు దిగివస్తున్నారు. ప్రధాని మోదీతో మాట్లాడతానని సోషల్ మీడియా వేదికగా పోస్టులు పెడుతున్నారు. ఈ నేపథ్యంలో భారత్, అమెరికా, జపాన్, ఆస్ట్రేలియా దేశాల సముదాయం అయిన క్వాడ్ సదస్సు ఈ ఏడాది నవంబర్‌లో ఢిల్లీలో జరగనుంది. ఈ సమ్మిట్‌కు అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హాజరు కావడంపై మొదట్లో ఆసక్తికరమైన చర్చలు జరిగాయి. తాజా ఉద్రిక్తతలు, యూఎస్ అంబాసిడర్ సెర్గీ గోర్‌ల చర్చలు మొదలైనప్పటికీ సమ్మిట్‌కు ట్రంప్ రాకపోవచ్చని తెలుస్తోంది.యూఎస్ అంబాసిడర్ టు ఇండియా సెర్గీ గోర్, ట్రంప్ ఈ సమ్మిట్‌కు చాలా ఆత్రుతగా ఎదురుచూస్తున్నారని తెలిపారు. ఇది భారత్‌తో అమెరికా సంబంధాల్లో బలమైన ఆసక్తిని సూచించింది. మొదట్లో, ట్రంప్ జూన్‌లో మోదీ ఆహ్వానాన్ని అంగీకరించినట్లు ప్రకటించారు. ఇది ఇండో?పసిఫిక్ ప్రాంతంలో చైనా ప్రభావాన్ని అరికట్టడానికి క్వాడ్‌లో అమెరికా కట్టుబాటును బలపరచడానికి సహాయపడుతుందని భావించబడింది. ఈ సమ్మిట్‌లో భారత ప్రధాని నరేంద్ర మోదీ, ఆస్ట్రేలియా, జపాన్ నేతతోపాటు ట్రంప్ చర్చలు జరిగితే, ఆర్థిక, రక్షణ, సాంకేతికతా సహకారాలు మరింత బలపడతాయని అంచనా.ఇటీవలి నెలల్లో పరిస్థితులు మారాయి. న్యూయార్క్ టైమ్స్ వంటి మీడియా రిపోర్టుల ప్రకారం, ట్రంప్ ఇండియా సందర్శనను రద్దు చేసి ఉండవచ్చు. ఇందుకు ప్రధాన కారణాలు ట్రంప్?మోదీ మధ్య ఏర్పడిన ఉద్రిక్తతలు. ట్రంప్, ఇండియా?పాకిస్తాన్ యుద్ధాన్ని తాను 'పరిష్కరించాను' అని పదేపదే ప్రకటించడం మోదీని కోపోద్రేకంచేసింది. ఇది ట్రంప్ నోబెల్ శాంతి బహుమతికి మోదీ మద్దతు కోరుకోవడంతో మరింత తీవ్రమైంది. జూన్ 17న జరిగిన 35 నిమిషాల ఫోన్ కాల్‌లో మోదీ, అమెరికా జోక్యం ఏమీ లేదని స్పష్టం చేశారు. ఇలా రెండు నేతల మధ్య విశ్వాసం దెబ్బతినడంతో, ట్రంప్ ఇప్పుడు నవంబర్ సమ్మిట్‌కు రాకపోవచ్చని సమాచారం.తాజాగా ట్రంప్ వైఖరిలో మార్పు కనిపిస్తోంది. భారత్‌ను దూరం చేసుకోవడంతో అమెరికాకే నష్టం అని ఆర్థిక వేత్తలు సూచిస్తున్నారు. ఈ నేపథ్యంలో ట్రంప్ భారత్‌తో సయోధ్యకు సై అంటున్నారు

# అమరావతిపై మద్దతుగా వైసీపీ

**అమరావతి, సెప్టెంబర్ 14. ( భారతశక్తి ప్రతినిధి)**

మూడు రాజధానుల పేరుతో చేసిన రాజకీయం ఘోరమైన ఓటమిని తెచ్చిపెట్టడంతో వైసీపీ పునరాలోచనలో పడింది. ఓ వైపు అమరావతి నిర్మాణం శరవేగంగా సాగుతూండటం, నిధుల కొరత లేకపోవడంతో మరో మూడేళ్లలో అమరావతి పూర్తయ్యే అవకాశాలు ఉన్నాయి. ప్రధానమైన ప్రభుత్వ భవనాలన్నీ పూర్తవుతాయి. మౌలిక సదుపాయాలు ఏర్పడతాయి. అదే సమయంలో పెద్ద ఎత్తున ప్రైవేటు పెట్టుబడులను తెచ్చేందుకు చంద్రబాబు ప్రయత్నిస్తున్నారు. క్వాంటమ్ వ్యాలీ, యూనివర్శిటీలు సహా పెద్ద పెద్ద సంస్థలను ఆహ్వానిస్తున్నారు. ఈ పరిణామాలతో వైసీపీ వ్యూహం మార్చుకున్నట్లుగా కనిపిస్తోంది. రాష్ట్ర కో-ఆర్డినేటర్ మరియు మాజీ మంత్రి సజ్జల రామకృష్ణ రెడ్డి మంగళగిరిలో జరిగిన పార్టీ కార్యక్రమంలో మాట్లాడుతూ, "వైసీపీ మళ్లీ అధికారంలోకి వస్తే, అమరావతి రాజధానిగా కొనసాగుతుంది. ముఖ్యమంత్రి జూ జగన్ మోహన్ రెడ్డి తాడేపల్లిలోనే నివసిస్తారు, విశాఖపట్నంకు వెళ్లరు" అని వ్యాఖ్యానించారు. గతంలో విశాఖపట్నంకు మారాలని ఆలోచించామని, కానీ అది సాధ్యం కాలేదన్నారు. మూడు రాజధానులను ప్రజలు వద్దన్నారని అందుకే తాము పునరాలోచిస్తున్నామన్నారు. "లక్షల కోట్ల అప్పులు చేసి అమరావతి కట్టడానికి మేము వ్యతిరేకమే. బెజవాడ-గుంటూరు మధ్య రాజధాని నిర్మిస్తే రెండు నగరాలు బాగా అభివృద్ధి చెందేవి" అని సజ్జల వ్యాఖ్యానించారు.

ప్రభుత్వం అమరావతి అభివృద్ధి పేరుతో చంద్రబాబు నాయుడు తన అనుచరులకు మాత్రమే ప్రయోజనం చేయాలని కుట్ర పన్నారు. మేము



మళ్లీ రాజకీయంలోకి వస్తే, అమరావతి ప్రాజెక్ట్‌ను పరిశీలిస్తాము, కానీ రాజధాని భావనను మార్చకుండా ప్రజల అభివృద్ధికి ఉపయోగపడేలా చేస్తామని చెప్పారు. కొండవీటి వాగులో అమరావతిని నిర్మిస్తున్నారని.. మునిగిపోయే చోట నిర్మిస్తున్నారన్నారు. అమరావతి ఒక్కటే రాజధాని కాదు .. గుంటూరు-విజయవాడ మధ్య ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తాము .. అధికారంలోకి వస్తామని వ్యాఖ్యానించారు. రాజధాని అంశంపై వైసీపీలో గందరగోళం ఏర్పడినట్లుగా కనిపిస్తోంది. మూడు రాజధానులు వదిలేసి, అమరావతిని ఒప్పుకున్నట్టు కనిపించడంతో, పార్టీ కార్యకర్తలు తమ విధానం మారిందా అని వాకబు చేస్తున్నారు.వైసీపీ నేతలు అనుకున్నట్టుగా రెండోసారి అధికారం దక్కలేదు. కూటమి అధికారంలోకి రావడంతో అమరావతి నిర్మాణంలో కదలిక వచ్చింది. జంగిల్ కటింగ్ పూర్తయింది. భవనాల నిర్మాణం మళ్లీ ప్రారంభమైంది. దీనికి తోడు కేంద్రంలో కూటమికి విపరీతమైన ప్రాధాన్యం లభిస్తూ ఉండడంతో రాజధాని నిర్మాణానికి భారీగా నిధులు వస్తున్నాయి. ఈ నిధులతో అద్భుతమైన భవనాలు నిర్మించడానికి కూటమి ప్రభుత్వం సన్నాహాలు చేస్తోంది. ఇంతవరకు బాగానే ఉన్నప్పటికీ కూటమి ప్రభుత్వం అమరావతి నిర్మాణంలో పెడుతున్న భారీ ఖర్చును వైసీపీ నేతలు తప్పుపడుతున్నారు. ముఖ్యంగా వైసీపీలో కీలకంగా ఉన్న సజ్జల రామకృష్ణారెడ్డి కూటమి ప్రభుత్వ వ్యవహారాన్ని ఎండగడుతున్నారు.అమరావతి లో ప్రభుత్వ భవనాలు నిర్మిస్తే సరిపోతుంది. అంతేగాని కోట్లకు కోట్లు పునాదుల్లోనే ఖర్చు చేస్తే ఉపయోగం ఉండదు. దీనివల్ల రాజధాని నిర్మాణం భారమవుతుంది. అమరావతి పూర్తిస్థాయిలో నిర్మాణం కావాలంటే 20 సంవత్సరాల వరకు పడుతుంది. అప్పటివరకు ప్రజల నుంచి వసూలు చేసిన పన్నులు మొత్తం దీనికి ఖర్చు చేస్తామంటే ఎలా? అమరావతి నిర్మాణాన్ని పూర్తిచేస్తే సహకరిస్తాం. నిర్మాణ విషయంలో ఇష్టానుసారంగా ప్రవర్తిస్తే వ్యతిరేకిస్తాం. అప్పుడు రాజధాని నిర్మాణాల్లో పునరేకీకరణ అంశాన్ని పరిశీలిస్తాం. ఒకవేళ మేము అధికారంలోకి వస్తే అమరావతి కేంద్రంగానే పరిపాలన సాగిస్తాం. మూడు రాజధానుల అంశాన్ని పరిశీలనలోకి తీసుకోబోమని" సజ్జల పేర్కొన్నారు.సజ్జల చేస్తున్న వ్యాఖ్యలు ఏపీ రాజకీయాలలో మంటలు పుట్టించాయి.. టిడిపి నేతలు సజ్జల వ్యాఖ్యలకు గట్టిగానే కౌంటర్ ఇస్తున్నారు."అధికారంలో ఉన్నప్పుడు మూడు రాజధానులు అన్నారు. విశాఖపట్నం కేంద్రంగా పరిపాలన సాగిస్తామన్నారు. అమరావతిని పడుకోబెట్టారు. మిగతా ప్రాంతాలలో పెద్దగా భవనాలు నిర్మించలేదు. ప్రభుత్వపరంగా కార్యక్రమాలను వేగవంతం చేయలేదు. చివరికి ఇప్పుడేమో అమరావతి కేంద్రంగానే పరిపాలన సాగిస్తాం అని చెబుతున్నారు. మూడు రాజధానుల విషయంలో వెనక్కి తగ్గారు. అప్పట్లో విపరీతంగా ఖర్చు పెట్టారు. వైసిపి నిర్లక్ష్యం వల్ల అమరావతి ప్రాంతంలో జంగిల్ విపరీతంగా పెరిగింది. దానిని నిర్మూలించడానికి చాలావరకు ఖర్చు పెట్టాల్సి వచ్చింది. ఒకవేళ నాటి ప్రభుత్వం గనుక పకడ్బందీగా వ్యవహరించి ఉంటే ఇక్కడదాకా వచ్చి ఉండేది కాదు కదా అని" టిడిపి నేతలు అంటున్నారు. మొత్తానికి వైసీపీ నేతలకు జ్ఞానోదయం అయ్యిందని చెబుతున్నారు. అయితే పార్టీ నేతలు అమరావతి రైతుల్ని మభ్యపుచ్చడానికి ఇలాంటి మాటలు చెబుతున్నారని .. గతంలోనూ జగన్ తాను అమరావతిలోనే ఉంటానని చెప్పారని అంటున్నారు. వైసీపీ గతంలో అమరావతినే రాజధానిగా ఉంటుందని చెప్పి ఎన్నికల్లో గెలిచిన తర్వాత మూడు రాజధానులు అనడం వల్ల ప్రజలు నమ్మకం కోల్పోయారు. మరోసారి అదే మాట చెప్పినా నమ్మరని టీడీపీ నేతలంటున్నారు.

## డయోరియా మృతి అవాస్తవం

**విజయవాడ సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి)**

మీడియాలో శుక్రవారం రాత్రి డయేరియాతో ఒక వ్యక్తి చనిపోయాడని వచ్చిన వార్తలన్నీ అవాస్తవం అని ఎన్టీఆర్ జిల్లా డీఎంహెచ్ఓ సుహాసిని స్పష్టం చేశారు. శుక్రవారం రాత్రి న్యూ రాజరాజేశ్వరి పేట వద్ద ఏర్పాటుచేసిన డయేరియా మెడికల్ క్యాంపులో ఆమె మీడియాతో మాట్లాడారు. కుటుంబ కలహాల వలన మద్యం సేవించిన వ్యక్తి గుండె నొప్పితో ప్రభుత్వ ఆసుపత్రిలో చికిత్స తీసుకుంటూ మరణించినట్లు వైద్యులు స్పష్టం చేశారని తెలిపారు.

==============================

## సాఫ్ట్ వేర్ కంపెనీలో అగ్ని ప్రమాదం భారీగా ఆస్తి నష్టం

**హైదరాబాద్ సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి)**

మాదాపూర్ లోని అయ్యప్ప సొసైటీలో ఉన్న ఓ సాఫ్ట్వేర్ కంపెనీలో శనివారం ఉదయం 4:30 గంటలకు మంటలు చెలరేగాయి. ఈ ప్రమాదం జరిగినప్పుడు కంపెనీలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. అయితే, ఆస్తి నష్టం భారీగా సంభవించింది. సమయానికి చేరుకున్న ఫైర్ సిబ్బంది మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. ఏసీలో షార్ట్ సర్క్యూట్ కారణంగానే ఈ ప్రమాదం జరిగినట్లు పోలీసులు భావిస్తున్నారు. ఈ ప్రమాదంలో ఆస్తినష్టం ఎంత జరిగిందో ఇంకా తెలియాల్సి ఉంది.

========================

## రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి

**అన్నమయ్య సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి)**

ఘోర రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మృతి చెందారు. అన్నమయ్య జిల్లా ప్రైవేట్ ట్రావెల్స్ బస్సు బీభత్సం సృష్టించింది. రోడ్డు దాటుతున్నవారిని ఆర్కే ట్రావెల్స్ బస్సు ఢీకొంది. ఘటనలో ఇద్దరు అక్కడికక్కడే మృతి చెందారు. మరో మహిళకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఓబులవారిపల్లె మండలం మంగళంపల్లిలో ఘటన జరిగింది. మృతులు అంకమ్మ(70), రామచంద్రయ్య(55).

============================

## ఆలయాల సందర్శనకు రైలు రెడీ



**హైదరాబాద్, సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి)**

దక్షిణాది పుణ్య క్షేత్రాలు ఎక్కువగా ఉన్నాయి. అందుకే దక్షిణాది ఉండే అనేక పుణ్య క్షేత్రాలకు నిత్యం దేశం నలుమూలల నుంచి ప్రజలు వచ్చి వెళుతుంటారు. అయితే దక్షిణ మధ్య రైల్వే ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాష్ట్రాల ప్రజలకు గుడ్ న్యూస్ చెప్పింది. జ్యోతిర్లింగ దివ్య దక్షిణ యాత్ర పేరుతో ప్రత్యేక రైలును నడపనుంది. ఈ రైలు రెండు తెలుగు రాష్ట్రాల నుంచి భారత్ గౌరవ్ టూరిస్ట్ రైలును నడపనుంది. ఈ నెల 23వ తేదీన సికింద్రాబాద్ రైల్వే స్టేషన్ నుంచి ప్రారంభమయ్యే గజరాత్ గౌరవ్ టూరిస్ట్ రైలు దక్షిణాదిన ఉన్న అనేక ఆలయాలను చుట్టివస్తుంది. ఈ ప్రత్యేక రైలు అరుణాచలం, రామేశ్వరం, మధురై, కన్యాకుమారి, త్రివేండ్రం, తిరుచ్చిలోని రంగనాథస్వామి ఆలయం, తంజావూరులోని బృహదీశ్వర ఆలయాలను దర్శించుకునే వీలుంది. సికింద్రాబాద్ నుంచి బయలుదేరి జనగాం, కాజీపేట, వరంగల్, మహబూబాబాద్, ఖమ్మం, మధిర మీదుగా ఆంధ్రప్రదేశ్‌లోని విజయవాడ, తెనాలి, ఒంగోలు, నెల్లూరు, గూడూరు ఇ రేణిగుంట వంటి ముఖ్యమైన స్టేషన్లలో మార్గ మధ్యంలో ఐరువైపులా ప్రయాణికుల కోసం రైలు ఎక్కేందుకు వీలుంది. ఈ యాత్ర మొత్తం ఏడు రాత్రులు, ఎనిమిది రోజుల వ్యవధిలో సాగుతుంది. ఇందులో అన్ని ప్రయాణ సౌకర్యాలు (రైలు మరియు రోడ్డు రవాణాతో సహా), వసతి సౌకర్యం, భోజన వసతిని కూడా కల్పిస్తారు. తిరువణ్ణామలై – అరుణాచలం ఆలయం రామేశ్వరం – రామనాథస్వామి ఆలయం మధురై – మీనాక్షి అమ్మన్ ఆలయం కన్యాకుమారి – రాక్ మెమోరియల్, కుమారి అమ్మన్ ఆలయం త్రివేండ్రం – శ్రీ పద్మనాభస్వామి ఆలయం తిరుచ్చి – శ్రీ రంగనాథస్వామి ఆలయం తంజావూరు – బృహదీశ్వర ఆలయం టూర్ ధర ఒక్కొక్కరికి స్లీపర్ క్లాస్ లో పర్యాటనకుగాను, థర్డ్ ఏసీ టిక్కెట్ ధర 22,500 రూపాయలు, సెకండ్ ఏసీ టిక్కెట్ ధర 29,500 రూపాయలుగా నిర్ణయించారు. దక్షిణ మధ్య రైల్వే నుంచి ఈ రైలులో దక్షిణ భారతంలోని ఆలయాలను దర్శించుకునేందుకు టిక్కెట్లను బుక్ చేసుకోవాలంటే 9701360701, 9281030726, 9281030740, 9281495845 నంబర్లలో సంప్రదించవచ్చు.

## హైదరాబాద్ రాష్ట్రానికి ఎన్నికైన తొలి ముఖ్యమంత్రి బూర్గుల రామకృష్ణారావు


**( పెండ్యాల రామ్ కుమార్, మంథని ) ( భారతశక్తి ప్రతినిధి)**

బూర్గుల రామకృష్ణారావు బహుభాషావేత్త, స్వాతంత్ర్యోద్యమ నాయకుడు, రచయిత, న్యాయవాది. హైదరాబాదు రాష్ట్రానికి ఎన్నికైన తొలి ముఖ్యమంత్రి. రెండు రాష్ట్రాలకు గవర్నరుగా కూడా పనిచేసాడు. రామకృష్ణారావు 1899 మార్చి 13 న నరసింగరావు, రంగనాయకమ్మ దంపతులకు మహబూబ్ నగర్ జిల్లా, తలకొండ పల్లి మండలం కల్వకుర్తి దగ్గరలోని పడకల్ గ్రామంలో జన్మించాడు. వీరి స్వగ్రామం బూర్గుల, ఇంటి పేరు పుల్లం రాజు వారు. అయితే స్వగ్రామమైన బూర్గుల నామమే వారి ఇంటిపేరుగా మారింది. ధర్మవంత్ స్కూలు (హైదరాబాద్) లో ప్రాథమిక విద్యను అభ్యసించాడు. 1915లో మెట్రిక్ పరీక్షలో ఉత్తీర్ణులయ్యాడు. పూణె లోని ఫెర్గూసన్ కళాశాలలో బీఏ (హానర్స్) డిగ్రీ చదివాడు. బొంబాయి విశ్వవిద్యాలయం నుంచి ఎల్ఎల్‌బీ (లా డిగ్రీ) పూర్తిచేసి, హైదరాబాదులో న్యాయవాద వృత్తిని ప్రారంభించారు. బూర్గుల దగ్గర పివినరసింహారావు జూనియర్ లాయర్‌గా పనిచేశాడు. బూర్గుల1924లో పెళ్ళి చేసుకున్నాడు. 1923లో హైదరాబాదులో న్యాయవాద వృత్తి ప్రారంభించి అగ్రస్థాయికి చేరాడు. న్యాయవాదిగా ఉంటూనే, రాజకీయాల్లో పాల్గొనడం జరిగింది. ఆంధ్రోద్యమం, గ్రంథాలయోద్యమం, భూదానోద్యమం మొదలైన వాటిలో పాల్గొన్నాడు. మాడపాటి హనుమంతరావు, సురవరం ప్రతాపరెడ్డి మొదలైన వారితో కలిసి పనిచేసాడు. శ్రీకృష్ణదేవరాయాంధ్ర భాషానిలయంకు అధ్యక్షుడిగా, కార్యదర్శిగా పనిచేసాడు. హైదరాబాదు రాష్ట్ర కాంగ్రెస్ వ్యవస్థాపకుల్లో బూర్గుల ప్రముఖుడు. పార్టీ తరఫున ఆయన అనేక కార్యక్రమాలకు నేతృత్వం వహించాడు. 1931లో నల్లొండ జిల్లా దేవరకొండలో జరిగిన రెండవ ఆంధ్రమహాసభకు బూర్గుల అధ్యక్షత వహించాడు. శాసనోల్లంఘన ఉద్యమంలోను, క్విట్ ఇండియా ఉద్యమంలోను పాల్గొని కారాగారవాసం అనుభవించాడు. 1948లో పోలీసు చర్య తరువాత హైదరాబాదు రాష్ట్రం ఏర్పాటు అయి, వెల్లోడి ముఖ్యమంత్రిగా సైనిక ప్రభుత్వం ఏర్పడినపుడు, ఆయన రెవిన్యూ, విద్యాశాఖల మంత్రి అయ్యాడు. రెవెన్యూ మంత్రిగా వినోబాభావే ప్రారంభించిన భూదానోద్యమానికి చట్టబద్ధత కల్పించాడు. 1948 జనవరిలో ప్రభుత్వ ఏజెంట్ జనరల్‌గా హైదరాబాద్ వచ్చిన కె.యం. మున్షీని నిజాం అజ్ఞలకు విరుద్ధంగా అందరికన్నా ముందే సందర్శించి పాలకుల ఆగ్రహానికి గురయ్యారు. ఆ సంవత్సరంలోనే హైదరాబాద్ స్టేట్ కాంగ్రెస్ నాయకుడై ప్రజా ఉద్యమానికి సారథ్యం వహించాడు. హైదరాబాద్ సంస్థానం భారతదేశంలో విలీనం కావడానికి కృషి సల్పిన తీరు విశిష్టమైనది. రాజకీయ రంగంలోనే కాకుండా సాహిత్య సాంస్కృతిక రంగాల్లో వీరు చేపట్టిన సేవ ప్రత్యేకమైనది. ఖాదీ బోర్డు విచారణ సంఘం, మధ్యప్రదేశ్ విషయ పరిశీలన సంఘం, ఆంధ్రప్రదేశ్ భారత్ సేవక సమాజం అధ్యక్షులుగా ఉన్నాడు. చరిత్ర, శాస్త్ర విజ్ఞానాల తెలుగు ఉర్దూ అకాడమీ, భారతీయ విద్యాభవన్, ప్రశాంతి విద్వత్ పరిషత్ అధ్యక్షులుగా గొప్ప సాంస్కృతిక సేవలందించాడు.

# కొత్త జిల్లాలపై ఫైనల్ కసరత్తు

**కాకినాడ, సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి)**

ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కొత్త జిల్లాల ఏర్పాటు, ఉన్న జిల్లాల సరిహద్దుల మార్పు, మండలాలు, గ్రామాల సర్దుబాట్లు, పేర్ల మార్పు వంటి అంశాలపై అధ్యయనం చేయడానికి ఏడుగురు మంత్రులతో కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో ఈ సబ్ కమిటీ కసరత్తు చేస్తోంది. గత వైసీపీ ప్రభుత్వం చేసిన జిల్లా విభజనలో ఏర్పడిన గందరగోళాన్ని సరిచేయడం, ప్రజల సౌకర్యాన్ని పెంచడం ప్రధాన లక్ష్యాలుగా మార్పు, చేర్పులపై ఆలోచనలు చేస్తున్నారు. ప్రజా అభిప్రాయాలను సేకరించి, శాస్త్రీయంగా పునర్వ్యవస్థీకరణ చేయాలని కమిటీ పనిచేస్తోంది.కానీ మొత్తం ఏడుగురు మంత్రులతో ఏర్పాటు చేశారు. కలెక్టర్లు, ప్రజల నుంచి సూచనలు సేకరించడంలో కమిటీ పాల్గొంటుంది. గత ప్రభుత్వం జిల్లాలు ఏర్పాటు చేసినప్పుడు ప్రజాభిప్రాయాలను పట్టించుకో?కుండా ..అసమంజసమైన సరిహద్దులతో జిల్లాలను ఏర్పాటు చేశారన్న అభిప్రాయం ఉంది. రంపచోడవరం నుంచి జిల్లా కేంద్రానికి 187 కి.మీ. దూరం ఉంది. దీని వల్ల గందరగోళం ఏర్పడింది. ఇప్పుడు ఇవి సరిచేయడానికి కొత్త జిల్లాలు, రెవెన్యూ డివిజన్లు ఏర్పాటు చేయాలని ప్రభుత్వం భావిస్తోంది. అలాగే సరిహద్దులు , పేర్ల మార్పుపైనా కసరత్తులు చేస్తున్నారు. జిల్లాలు, మండలాలు, గ్రామాల సరిహద్దుల మార్చడం, పేర్లు మార్చడం. ప్రజల నుంచి వచ్చిన డిమాండ్ల ఆధారంగా




సాధ్యాసాధ్యాలను పరిశీలించనున్నారు. ఇతర జిల్లాల్లో సరిహద్దులు మార్చే ప్రతిపాదనలు ఉన్నాయి. అద్దంకి (బాపట్ల జిల్లా), కందుకూరు (నెల్లూరు జిల్లా) ఒంగోలు, కొండపి, సంతనూతలపాడు (మొత్తం 5 నియోజకవర్గాలు)తో ప్రకాశం జిల్లా, కృష్ణ జిల్లా నుంచి గన్నవరం, పెనమలూరు మైలీ జిల్లాలో కలపడం (విజయవాడ ఈస్ట్, వెస్ట్, సెంట్రల్, తిరువూరు, మ్మైలవరం ? మొత్తం 7). విజయనగరం జిల్లా నుంచి ఎస్.కోటా విశాఖపట్నంలో చేర్చడం, తూర్పు గోదావరి జిల్లాలో మండపేట చేర్చడం, కాకినాడ జిల్లాలో రామచంద్రాపురం చేర్చడం. తిరుపతి జిల్లాలో రైల్వే కోడూరు చేర్చడం వంటి ప్రతిపాదనలపై చర్చించే అవకాశం ఉంది. కలెక్టర్ల ద్వారా సూచనలు సేకరణ, ప్రజా అభిప్రాయాలు పరిగణనలోకి తీసుకుంటారు. మార్కాపురం కొత్త జిల్లాను గిద్దలూరు, కనిగిరి, మార్కాపురం, యర్రగొండపాలెం, దర్శి నియోజకవర్గాలు చేర్చి ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదన ఉంది. గుంటూరు జిల్లా నుంచి మంగళగిరి, తాడికొండ నియోజకవర్గాల్లోని 29 గ్రామాలు, పెదకూరపాడు, సందిగామ, జగ్గయ్యపేట వంటి 5 నియోజకవర్గాలతో అమరావతి జిల్లా ఏర్పాటు, రంపచోడవరం డివిజన్, చింతూరు డివిజన్ నుంచి 4 మండలాలు కలిపి రంపచోడవరం జిల్లాను ఏర్పాటు చేయాలన్న ప్రతిపాదనలపై చర్చలు జరుగుతున్నాయి. కొన్ని జిల్లాల సరిహద్దులు మార్చే ప్రక్రియ ఉది. కమిటీ ఈ నెలలోనే సమావేశాలు నిర్వహిస్తూ, అసెంబ్లీ సమావేశాలకు ముందు నివేదిక సమర్పించనుంది. మొత్తం ప్రక్రియ 2025 డిసెంబర్ 31కి పూర్తి చేయాల్సి ఉటుది. 2026 జనవరి 1 నుంచి 2027 మార్చి 31 వరకు సెన్సస్ కారణంగా జిల్లా మార్పులు చేయలేరని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి.

# కవితకు అండగా కేసీఆర్...

**హైదరాబాద్, సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి)**

ఆడబిడ్డ ఏడిస్తే ఇంటికి మంచిది కాదు అంటారు. తెలంగాణ సమాజం ఈ సామెతను బలంగా నమ్ముతుంది. ఆడబిడ్డను సాక్షాత్తు ఇంటి దేవతగా కొలుస్తూ ఉంటుంది. ప్రతి పండుగకు చీర సారే పెడుతూ గౌరవించుకుంటుంది. దీనికి ఏ కుటుంబం కూడా మినహాయింపు కాదు. తెలంగాణ అంటేనే ఒక బలమైన అస్తిత్వానికి ప్రతీక. అందువల్లే ఇక్కడ చాలా ధృఢమైన ఉద్యమాలు పుట్టాయి. ఆ ఉద్యమాలలో ఆడవారి పాత్రను బలంగా నిలుపుకున్నాయి. సమ్మక్క సారలమ్మ.. రుద్రమదేవి.. చాకలి ఐలమ్మ.. ఇలా చెప్పుకుంటూ పోతే వీరవనితలు.. ధీర వనితలు చాలామంది ఉన్నారు. వారందరూ ఇప్పటికీ కూడా ప్రజల మదిలో మెదులుతున్నారు. తెలంగాణ సమాజం తెలంగాణ ఉద్యమ సమయంలో ఆ వనితలను మననం చేసుకుంటూ ముందుకు సాగింది. తమ స్వీయ అస్తిత్వాన్ని కాపాడుకుంటూ అడుగులు వేసింది. అలా అడుగులు వేసిన వారిలో కల్వకుంట్ల కవిత కూడా ఒకరు.తెలంగాణ ఉద్యమ సమయంలో.. తెలంగాణకు అస్తిత్వం అయిన బతుకమ్మను నెత్తిన పెట్టుకుని ఆమె చేసిన సాంస్కృతిక ఉద్యమం మామూలుది కాదు. తెలంగాణ ఆడబిడ్డల్ని ఉద్యమంలో మమేకం చేయడానికి ఆమె ఎత్తుకున్న బతుకమ్మ ఎంతో మందిని కదిలించింది. కదిలి వచ్చేలా చేసింది. తెలంగాణ సాంస్కృతి.. తెలంగాణ సంప్రదాయం అంటేనే బూతు లాగా ధ్వనించిన ఒక సందర్భంలో.. బతుకమ్మ ద్వారా వాటన్నింటిని పటాపంచలు చేసింది కవిత. అందువల్లే ఆమె తెలంగాణ బతుకమ్మగా పేరుపొందింది. ఎంగిలి పూల నుంచి మొదలుపెడితే సద్దుల బతుకమ్మ వరకు ఆమె అడుగు పెట్టని ఊరంటూ లేదు. గౌరమ్మను నిలుపుకోవడం.. తంగేడు పూలతో బతుకమ్మను పేర్చడం.. పాటలు పాడి చెరువులో నిమజ్జనం చేయడం.. ఇదే క్రతువుగా సాగిపోయింది కవిత. అటువంటి బతుకమ్మకు నేడు కష్టం వచ్చింది. పుట్టిన ఇంటి నుంచి ఇబ్బందికరమైన వాతావరణం ఎదురైంది. పండగపూట ఏ ఆడబిడ్డకు





ఇటువంటి కష్టం రావద్దు. ఇటువంటి ఇబ్బంది అసలు రావద్దు. పున్నమి 15 రోజుల్లో వెలుగు వెలిగే చంద్రుడు కూడా.. అమావాస్య రోజులలో మసకబారతాడు. అలాగని ఎప్పటికీ చీకట్లో ఉండిపోడు. ఇప్పుడు కవిత పరిస్థితి కూడా అలాంటిదే. తాత్కాలికంగా ఆమె ప్రభ కొంతమేర ఇబ్బందికి గురైనప్పటికీ.. ఆ తర్వాతి రోజుల్లో దీపశిఖలాగా వెలుగుతూనే ఉంటుంది. కర్మ సిద్ధాంతాన్ని బలంగా నమ్మే ఆమె.. ఎట్టి పరిస్థితుల్లోనూ తన ప్రభను కోల్పోరు.పుట్టినింటి నుంచి కాస్త ఇబ్బంది ఎదురవుతున్నప్పటికీ.. మేమున్నామంటూ పుట్టిన గడ్డవాళ్ళు కవిత దగ్గరికి వచ్చారు. కెసిఆర్ స్వగ్రామం చింతమడక గ్రామస్తులు తెలంగాణ బతుకమ్మ దగ్గరికి స్వయంగా వచ్చి ఎంగిలిపూల బతుకమ్మ వేడుకల్లో భాగస్వామి కావాలని స్వాగతం పలికారు. చీర, సారె, పసుపు కుంకుమలతో సాదర ఆహ్వానం పలికారు. ఒక ఆడబిడ్డకు ఇంతకంటే కావలసిందేముంది. పండగ పూట ఇంతకంటే ఘనమైన ఆతిథ్యం ఇంకొకటి ఏముంటుంది. ఇది తెలంగాణ బతుకమ్మకు దక్కిన నిండైన గౌరవం. కెసిఆర్ కుమార్తెకు కెసిఆర్ స్వగ్రామం నుంచి లభించిన గొప్పదైన సత్కారం. ఇప్పుడు కవిత మనసు చాలా తేలికైంది. గుండెలో భారం తగ్గిపోయింది. ఎందుకంటే తెలంగాణ బతుకమ్మ దగ్గరికి బతుకమ్మ వడివడిగా అడుగులు వేసుకుంటూ వచ్చింది కాబట్టి..

# ఆర్టీసీ అప్ డేట్

**హైదరాబాద్, సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి)**

తెలంగాణ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. స్మార్ట్ కార్డులను ఇవ్వాలని ప్రాథమికంగా నిర్ణయించింది. తెలంగాణ ఆర్టీసీ టికెటింగ్ మరియు బస్ పాస్ వ్యవస్థను ఆధునీకరించడానికి సిద్ధమవుతోంది. ఇందుకోసం ప్రయాణికుల కోసం స్మార్ట్ కార్డులు ప్రవేశపెట్టనుంది. మొదట ఈ సౌకర్యాన్ని విద్యార్థుల బస్ పాస్‌లతో ప్రారంభించి, తరువాత మహిళల కోసం అమలు చేస్తున్న 'మహాలక్ష్మి' ఉచిత బస్సు ప్రయాణ పథకం లబ్ధిదారులకు విస్తరించనున్నట్లు అధికారిక వర్గాలువెల్లడించాయి. టీజీఆర్టీసీ అధికారులు ఇచ్చిన సమాచారం ప్రకారం, బస్ పాస్‌లు పొందడం, రెన్యువల్ చేయడం మరింత సులభం కావడంతో పాటు, సంస్థ డిజిటల్ టెక్నాలజీకి అనుగుణంగా ముందడుగు వేయనుంది. ప్రస్తుతం రాష్ట్రవ్యాప్తంగా ఐదు లక్షలకుపైగా విద్యార్థి బస్ పాస్‌లు ప్రస్తుతం ఉన్నాయి. ఇప్పటివరకు విద్యార్థులు రెన్యువల్ కోసం ప్రత్యేక కౌంటర్లకు వెళ్లాల్సి వచ్చింది. ప్రతిపాదిత స్మార్ట్ కార్డు వ్యవస్థ అమలులోకి వస్తే, వీటిని డిజిటల్‌గా రీఛార్జ్ చేసుకోవచ్చు. ఇకపోతే, పొరుగు రాష్ట్రాలైన కర్ణాటక, మహారాష్ట్ర, ఉత్తరప్రదేశ్‌లో అమలులో ఉన్న స్మార్ట్ కార్డు మోడల్లను ఆర్టీసీ అధికారులు పరిశీలిస్తున్నారు. ఇప్పటికే బెంగళూరు, ముంబై, లక్నో వంటి మహానగరాల్లో ఈ సౌకర్యం అందుబాటులో ఉందని తెలుసుకున్న టీజీఎస్ ఆర్టీసీ అధికారులు రాష్ట్రంలోనూ స్మార్ట్ కార్డులను ప్రవేశపెట్టాలని నిర్ణయించినట్లు తెలిసింది. ఇతర రాష్ట్రాల్లో ఉన్న పద్ధతిని, అక్కడ స్మార్ట్ కార్డులు మంజూరు చేసే విధానాన్ని అధ్యయనం చేయనుంది. . ఎప్పటి నుంచి అంటే? అధ్యయనం చేసిన తర్వాత.. ఆ యా రాష్ట్రంలో సమగ్ర అధ్యయనం ద్వారా దేశవ్యాప్తంగా ఉన్న ఉత్తమ పద్ధతులను గుర్తించి, తెలంగాణలో ప్రయాణికులకు అనుకూలంగా అమలు చేయాలని సంస్థ లక్ష్యంగా పెట్టుకుంది. ఈ పథకం రాబోయే నెల్లో దశలవారీగా ప్రవేశపెట్టనున్నట్లు సమాచారం. ప్రస్తుతం మహాలక్ష్మి పథకం కింద ఉచితంగా ప్రయాణించడానికి మహిళలు తమ ఆధార్ కార్డులు చూపించాల్సి వస్తోంది. స్మార్ట్ కార్డులు ప్రవేశిస్తే ఈ ధృవీకరణ అవసరం ఉండదు. దీంతో ప్రతిరోజూ ఆర్టీసీ బస్సులు వినియోగించే లక్షలాది మహిళలకు మరింత సౌలభ్యం కలుగుతుందని భావిస్తున్నారు. ఇతర రాష్ట్రాల నమూనాలను పూర్తిగా అధ్యయనం చేసిన తర్వాతే స్మార్ట్ కార్డుల రూపకల్పన పై టీజీ ఆర్టీసీ తుది నిర్ణయం తీసుకోనుం.

# జూపల్లి కామెంట్స్ పై చర్చోపచర్చలు

**మహబూబ్ నగర్, సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి)**

ఏ మనిషికైనా సరే ఆశావహ దృక్పథం ఉండాలి. సాధిస్తాను అనే సంకల్పం ఉండాలి. గెలుస్తాను అని నమ్మకం ఉండాలి. అలా అయితేనే ముందుకు వెళ్ళగలుగుతారు. అలాకాకుండా నిరాశతో, నిస్పృహతో, భయంతో ఉంటే ఎప్పటికైనా సరే ఓడిపోతారు. ప్రస్తుతం 30 లక్షలాలు తెలంగాణ కాంగ్రెస్ పార్టీ నాయకుల్లో ఉన్నట్లు కనిపిస్తున్నాయి. ఇటీవల కాలంలో తెలంగాణ రాష్ట్రంలో నాయకుల్లో ఒక రకమైన భయం కనిపిస్తోంది. గులాబీ పార్టీ నుంచి వచ్చిన ఎమ్మెల్యేలు కాంగ్రెస్లో చేరినప్పటికీ.. ఫిరాయింపుల వ్యవహారంలో స్పీకర్ నోటీసులు ఇవ్వడంతో ఒక్కసారిగా స్వరం మార్చారు. తాము అభివృద్ధినిధుల కోసం మాత్రమే ముఖ్యమంత్రిని కలిసినట్టు కవరింగ్ ఇచ్చారు. ఇందులో ఇంకా కడియం శ్రీహరి, మరో ఎమ్మెల్యే వివరణ ఇవ్వాల్సి ఉంది. వీరు మాత్రమే కాదు, మిగతా ఎమ్మెల్యేలు కూడా భయం భయంతోనే ఉన్నారు. కొంతమంది ఎమ్మెల్యేలు రైతులు యూరియా కొరతతో ఇబ్బంది పడుతుంటే విదేశాలకు వెళ్తున్నారు. రైతులు ధర్నా చేస్తుంటే విదేశాల్లో ఉండి వారు వినోదం చూస్తున్నారు.. కాంగ్రెస్ ఎమ్మెల్యేలు మాత్రమే కాదు.. భయపడుతున్న వారి జాబితాలోకి ఇప్పుడు ఆ జాబితాలోకి మంత్రులు చేరిపోయారు.తాజాగా మంత్రి జూపల్లి కృష్ణారావు చేతులెత్తేశారు.. ఆదిలాబాద్ జిల్లాలో పర్యటిస్తున్న



ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు. ఆదిలాబాద్ లోని బోద్ ప్రాంతాన్ని రెవెన్యూ డివిజన్ గా ప్రకటించాలని అక్కడి ప్రజలు ఆయనను డిమాండ్ చేశారు. దీనిపై కృష్ణారావు సంచలన వ్యాఖ్యలు చేశారు. " వచ్చేసారి నేను గెలుస్తానో లేదో తెలియదు. ఒకవేళ నేను గెలిచినా కూడా కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వస్తుందో రాదో తెలియదు. అందువల్లే నేను ప్రజలకు ఎటువంటి హామీని ఇవ్వదలేను.. నా జేబులో నుంచి ఖర్చుపెట్టే డబ్బు అయితే చెప్పగలను. ప్రభుత్వం నుంచి వచ్చేదానికి నేను హామీని ఇవ్వలేను" అని మంత్రి స్పష్టం చేశారు.. దీంతో ఆయన చేసిన వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాలలో సంచలనంగా మారాయి. మరో రెండు పర్యాయాలు తానే ముఖ్యమంత్రి అని రేవంత్ చెప్పుకుంటుంటే.. కృష్ణారావు చేసిన వ్యాఖ్యలు మాత్రం అందుకు విరుద్ధంగా ఉన్నాయి.ఇటీవల కాలంలో మునుగోడు ఎమ్మెల్యే కోమటిరెడ్డి రాజగోపాల్ రెడ్డి అదృష్టం మీద నేరుగా విమర్శలు చేస్తున్నారు. తనకు మంత్రి పదవి ఇవ్వలేదని మండిపడుతున్నారు. ఏకంగా ముఖ్యమంత్రి మాట్లాడుతున్న మాటలకే గట్టి కౌంటర్ ఇస్తున్నారు. పుచ్చుకుపల్లి మాత్రం ఏకంగా కాంగ్రెస్ ప్రభుత్వమే వచ్చే ఎన్నికల్లో అధికారంలోకి రాదని స్పష్టం చేస్తున్నారు.. అంటే ఇప్పుడు ప్రజల్లో కాంగ్రెస్ పట్ల ఆగ్రహం ఉన్నట్టే కదా.. ప్రభుత్వం చేపడుతున్న ఏ పని కూడా ప్రజల్లోకి వెళ్లడం లేదనే కదా.. మరి దీనిపై ముఖ్యమంత్రి ఎలా స్పందిస్తారు.. ఎలాంటి ప్రకటన చేస్తారనేది చూడాల్సి ఉంది. అన్నట్టు జూపల్లి కృష్ణారావు మంత్రిగా బాధ్యతలు తీసుకున్న తొలి రోజుల్లో ఆయన నియోజకవర్గంలో జరిగిన ఓ ఘటన సంచలనం రేపింది. దాని వెనుక ఉన్నది కృష్ణారావు అని ప్రచారం కూడా జరిగింది. అప్పటినుంచి ఆయన ఏ సభలో కూడా ఆశావాహ దృక్పథంతో మాట్లాడటం లేదని గులాబీ నాయకులు అంటున్నారు. క్షేత్రస్థాయిలో పరిస్థితి అర్థమైంది కాబట్టి మంత్రులు వాస్తవాలు మాట్లాడుతున్నారని.. కృష్ణారావు జ్ఞానోదయం అయిందని.. మిగతా వారికి కూడా త్వరలోనే అవుతుందని గులాబీ నేతలు అంటున్నారు.



# విద్యాశాఖ అధికారుల నిర్లక్ష్యం

**భద్రాద్రి కొత్తగూడెం సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి)**

ప్రభుత్వ సంస్థల్లో పారదర్శకతను, ప్రజల్లో ప్రశ్నించే తత్వాన్ని పెంచ డమే ఉద్దేశంగా సమాచారహక్కు చట్టం ప్రభుత్వంరూపొందించిందని, కానీ మణుగూరు మండలంలో విద్యాశాఖ అధికారుల నిర్ల క్ష్యంతో సమాచార హక్కు చట్టం లక్ష్యం నీరు గారిపోతుందని, సామాజిక సేవకులు కర్నె బాబూరావు ఆరోపించారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడారు. మండల, జిల్లా విద్యాశాఖ అధికారులు బదిలీ అయిన ఆ అధికారుల పేర్లు, మండల విద్యాశాఖ కార్యాలయంలో నేటికీ కనిపిస్తున్నాయని, ప్రస్తుత అధికార పేర్లు లేకుండానే బోర్డులు దర్శన మిస్తున్నాయన్నారు. ప్రజలు సమాచారం కోసం విద్యాశాఖ కార్యాలయానికి వస్తే ఎవరికి దరఖాస్తు అందజేయాల్లో తెలియక అయోమయానికి గురవుతున్నారని, బాబూరావు ఆగ్రహం వ్యక్తం చేశారు.స.హ హక్కు చట్టం ప్రకారం అన్ని కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ కార్యాలయాల్లో బోర్డులు ఏర్పాటు చేసి దానిపై సమాచార అధికారి, సహాయ సమాచార అధికారి, అప్పిలేట్ అధికారి పేర్లు, ఫోన్ నెంబర్లు రాయించి ప్రజలకు స్పష్టంగా కనిపిం చేలా ఏర్పాటు చేయాలి. కానీ మండల విద్యాశాఖ అధికారి ఈ విషయాన్ని పట్టించుకోకపోవడం ఏమిటని ప్రశ్నించారు.

# మేం పార్టీ మారలేదండి....



హైదరాబాద్, సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి) తెలంగాణ రాజకీయాల్లో పార్టీ ఫిరాయింపుల వ్యవహారం వివాదాస్పదమైంది. 2023 ఎన్నికల్లో బీఆర్ఎస్ అధికారం కోల్పోయింది. కాంగ్రెస్ అధికారంలోకి వచ్చింది. దీంతో బీఆర్ఎస్ నుంచి గెలిచిన 10 మంది ఎమ్మెల్యేలు అధికర కాంగ్రెస్ పార్టీలో చేరారు. దీనిపై బీఆర్ఎస్ హైకోర్టును ఆశ్రయించింది. ఫిరాయింపు ఎమ్మెల్యేల ఎన్నిక రద్దు చేయాలని కోరింది. కోర్టు చర్య తీసుకోవాలని స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్‌ను ఆదేశించింది. స్పీకర్ జాప్యం చేయడంతో బీఆర్ఎస్ నేతలు సుప్రీం కోర్టును ఆశ్రయించారు. దీంతో సుప్రీం కోర్టు పార్టీ మారిన ఎమ్మెల్యేపై చర్యలకు గడువు విధించింది. దీంతో స్పీకర్ గడ్డం ప్రసాద్‌కుమార్ ఇటీవలే నోటీసులు జారీ చేశారు. దీంతో పది మంది ఎమ్మెల్యేలు తాజాగా స్పీకర్ నోటీసులకు వివరాణ ఇచ్చారు. అయితే విశేషం ఏమిటంటే పది మంది ఎమ్మెల్యేల్లో 8 మంది తాము పార్టీ మారలేదని వివరణ ఇవ్వడం ఇప్పుడు ఆశ్చరకరంగా మారింది.బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు కాంగ్రెస్‌లో చేరారని ప్రతిపక్షం ఆరోపించింది. ఫిరాయింపు నిరోధక చట్టం ప్రకారం, వారిని అనర్హులుగా ప్రకటించాలని పిటిషన్లు దాఖలయ్యాయి. సుప్రీంకోర్టు గత జులై 31న తీర్పు ఇచ్చి, స్పీకర్ మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని ఆదేశించింది. ఆదేశాలు ఆలస్యాన్ని విమర్శించి, పార్లమెంట్‌కు ఈ విధానాన్ని పునర్విచారించాలని సూచించింది. ఫిబ్రవరి నుంచి నోటీసులు జారీ అయ్యాయి, ఇది రాజకీయ ఒత్తిడిని పెంచింది. ఈ కేసు రాష్ట్రంలో పార్టీ మార్పులకు ఆటంకం కల్పుతున్నట్లు కనిపిస్తోంది.ఎనిమిది మంది ఎమ్మెల్యేలు లిఖితపూర్వకంగా స్పీకర్‌కు సమాధానాలు ఇచ్చారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డిని కలవడం నియోజకవర్గాల అభివృద్ధి కోసమేనని, పార్టీ సభ్యత్వం మారలేదని చెప్పారు. పోచారం శ్రీనివాస్‌రెడ్డి, బండ్ల కృష్ణమోహన్‌రెడ్డి, కాలే యాదయ్య, గూడెం మహిపాల్‌రెడ్డి, అరికెపూడి గాంధీ వంటివారు బీఆర్ఎస్ సూత్రాలకు నిబద్ధులమని పేర్కొన్నారు. కొందరు తమ ఫొటోలను మార్ఫింగ్ చేశారని, సీఎంతో కలయికలు గౌరవార్థమేనని వివరించారు. ఇక దానం నాగేందర్, కడియం శ్రీహరి మాత్రం మరిన్ని రోజులు కావాలని కోరారు. 8 మంది ఎమ్మెల్యేకు ఇందుకు ఆధారాలు కూడా చూపించారు. స్పీకర్ వాటిని ఫిరాయింపు ఆరోపణలు చేసినవారికి పంపారు.కొందరు ఎమ్మెల్యేలకు ప్రభుత్వ పదవులు లభించాయి. పోచారం శ్రీనివాస్‌రెడ్డికి వ్యవసాయ సలహాదారు పాత్ర, అరికెపూడి గాంధీకి పబ్లిక్ అకౌంట్స్ కమిటీ చైర్మన్ స్థానం ఇచ్చారు. ఇది బీఆర్ఎస్‌లో ఆగ్రహాన్ని రేకెత్తించింది. గతంలో అరికెపూడి గాంధీ బీఆర్ఎస్‌పై తీవ్ర వ్యాఖ్యలు చేసి, పార్టీలో బ్రోకర్లు ఉన్నారని అన్నారు. కానీ ఇప్పుడు బీఆర్ఎస్‌లోనే ఉన్నామని చెప్పడం మాట మార్పుగా కనిపిస్తోంది. పాడి కౌశిక్‌రెడ్డి వంటి నాయకులు సవాల్ విసిరారు. ఈ పదవులు ఫిరాయింపు ఆరోపణలను మరింత బలపరుస్తున్నాయి, ఎందుకంటే అవి ప్రతిపక్షాలకు కేటాయించాల్సినవి.స్పీకర్ ప్రసాద్ కుమార్ ఒక్కొక్కరినీ విచారించనున్నారు. బీఆర్ఎస్ ప్రతినిధులు, ఎమ్మెల్యేలు, న్యాయవాదులు హాజరుకావాలి. విచారణలు ఆలస్యం చేయకుండా చూడాలని స్పీకర్ హెచ్చరించారు. ఈ ప్రక్రియ బీఆర్ఎస్‌కు ప్రయోజనం కలిగించవచ్చు, ఎందుకంటే ఫిరాయింపులు ఆగిపోయాయి. మొత్తంగా, ఈ కేసులు తెలంగాణలో రాజకీయాలను మార్చవచ్చు. అనర్హత తీర్పు వచ్చిన తర్వాత ఉప ఎన్నికలు జరిగే అవకాశం ఉంది. ఇది కాంగ్రెస్ ఆధిపత్యాన్ని పరీక్షిస్తుంది. రాజ్యాంగపరమైన బాధ్యతలు, రాజకీయ అవకాశవాదం మధ్య సమతుల్యత అవసరమని ఈ సంఘటనలు సూచిస్తున్నాయి.

# జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తాం: మంత్రులు పొన్నం, తుమ్మల



హైదరాబాద్, సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి) జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని యూసుఫ్ గూడా డివిజన్ లోని సర్కిల్ 19 లో 5.55 కోట్ల రూపాయలు వ్యయంతో పలు అభివృద్ధి కార్యక్రమాలను మంత్రులు పొన్నం ప్రభాకర్ ,తుమ్మల నాగేశ్వరరావు ప్రారంభించారు. యూసుఫ్ గూడా డివిజన్ లోని నవోదయ కాలని లో 7 పనులకు 178.35 లక్షల రూపాయల వ్యయంతో (నవోదయ కాలని ,మారుతి నగర్, కమలాపురి కాలని ,ఇంజనీర్స్ కాలని ) సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు. శంకుస్థాపన చేసుకున్న సీసీ రోడ్ల పనులు వేగంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

తరువాత యూసుఫ్ గూడా డివిజన్ లోని లేబర్ అడ్డా రోడ్డు లో 14 పనులకు 377.35 లక్షల రూపాయల వ్యయంతో ( ఒఔ నగర్, యూసుఫ్ గూడా బస్తీ , శ్రీ కృష్ణ నగర్ , హైలం కాలని ) సీసీ రోడ్లకు శంకుస్థాపన చేశారు లేబర్ అడ్డా లో కూలీలలో జీహెచ్ ఎంసీ శానిటేషన్ సిబ్బందితో ముచ్చటించారు.. వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు.

ప్రజా పాలన ప్రభుత్వంలో వారి సమస్యలు పరిష్కారం చేస్తున్నామని నూతన రేషన్ కార్డులు ఇచ్చామని,సన్న బియ్యం పంపిణీ చేస్తున్నామని వారికి తెలిపారు.. ఈ కార్యక్రమంలో మేయర్ గద్వాల విజయ లక్ష్మీ, రాజ్యసభ సభ్యుడు అనిల్ కుమార్ యాదవ్, సాట్ చైర్మన్ శివసేన రెడ్డి, అంజన్ కుమార్ యాదవ్, సిఎన్ రెడ్డి, అజారుద్దీన్ , నవీన్ యాదవ్ ఇతర ముఖ్య నేతలు, అధికారులు పాల్గొన్నారు.

మంత్రి పొన్నం ప్రభాకర్ మాట్లాడుతూ యూసుఫ్ గూడా డివిజన్ లో 5.55 కోట్ల రూపాయల తో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేసుకున్నాం. ఈ ప్రాంతంలో ప్రజలకు మౌలిక సదుపాయాలు కల్పిస్తున్నాం. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో అనివార్య కారణాల వల్ల ఉప ఎన్నిక వచ్చింది.. ఇది ఉప ఎన్నికల కోసం కాదు. కృష్ణ నగర్ లో చాలా కాలంగా పెండింగ్ లో డ్రైనేజీ పనులు మొన్న శంకుస్థాపన చేసుకున్నాం ఇక నుండి వర్షం కురిసినపుడు ఇక్కడ ఇబ్బందులు ఉండవు. ఇటీవల కంటోన్మెంట్ ఉప ఎన్నికల్లో గెలిచాం.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో కూడా కాంగ్రెస్ పార్టీ జెండా ఎగురవేస్తామన్నారు.

మంత్రి తుమ్మల మాట్లాడుతూ జూబ్లిహిల్స్ నియోజకవర్గంలో యూసుఫ్ గూడా డివిజన్ లో ఈరోజు 5.55 కోట్ల రూపాయలు అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేసుకున్నాం. హైదరాబాద్ నగరాన్ని విశ్వనగరం గా అభివృద్ధి చేయడానికి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గారి నాయకత్వంలో కేబినెట్ పనిచేస్తుంది.. మీరు మరింత మద్దతు ఇవ్వండి. జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో ఇప్పటి వరకు దాదాపు 90 కోట్ల కు పైగా అభివృద్ధి కార్యక్రమాలు చేపట్టాం.. జూబ్లీహిల్స్ ఒకటే కాదు హైదరాబాద్ మొత్తం సమస్యలు పరిష్కారం చేస్తున్నాం . మీకు ఏ పనులు కావాలన్నా అడగండి.. సంక్షన్ అయిన పనులు వేగంగా పూర్తి చేయాలి.డ్రైనేజీ,రోడ్లు ఇతర పనులు పది కాలాల పాటు మన్నిక ఉండేలా పనులు పూర్తి చేయాలి. మీ సమస్యలు స్థానిక నాయకుల దృష్టికి తీసుకురండి.. మీ సమస్యల పరిష్కారం చేసే బాధ్యత మాదని అన్నారు.

## నల్గొండ జిల్లాలో దాదాపు 40 వేల కుక్కలు

నల్లగొండ సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి) నల్లగొండ పట్టణంలోని రాంనగర్ పార్క్ లో డాగ్ అడాప్షన్, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్,పలు అంశాల అవగాహన కార్య క్రమంలో రాష్ట్ర రోడ్లు భవనాలు, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కోమటి రెడ్డి వెంకట్ రెడ్డి పాల్గొన్నారు.మంత్రి మాట్లాడుతూ దేశంలో కుక్క కాటుతో ఎంతో మంది చనిపోతున్నారని ఇటీవల వార్తల్లో చూస్తున్నాము. ఈ విషయంపై సుప్రీంకోర్టు సైతం స్పందించింది. నల్గొండ జిల్లాలో సుమారు 40 వేల కుక్కలున్నట్లు అధికారులు అంచనా వేశారు. అమెరికా లాంటి దేశంలో మనుషుల్లాగే కుక్కలకు కూడా విలువ ఇస్తున్నారు . కుక్కలను ఎవరు చంపాల్సిన అవసరం లేదు. పాపం మూట కట్టుకోవద్దు. కుక్కలను దత్తత తీసుకునే కార్యక్రమం మంచి కార్యక్రమం. ఇలాంటి కార్యక్రమాలకు పూర్తి సహకారం అందిస్తామని అన్నారు. హైదరాబాద్ తర్వాత రెండవ అతిపెద్ద ప్రోగ్రాం నల్గొండలో నిర్వహించాము. డాగ్ అడాప్షన్, వ్యాక్సినేషన్, స్టెరిలైజేషన్ పై జిల్లా యంత్రాంగం అవేర్నెస్ పెంచాలి. కుక్క కాటుకు గురికాకుండా ఉండేలా,ఒకవేళ గురైనా తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పించే కార్యక్రమాలు విస్తృతం చేయాలని అన్నారు.

==============================

## వేములవాడలో తప్పని యూరియా కష్టాలు

వేములవాడ సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి) ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో రైతులకు యూరియా కష్టాలు తప్పడం లేదు. నిద్ర లేచింది మొదలు యూరియా కోసం సొసైటీలు, గ్రోమోర్ సెంటర్ ల వద్ద క్యూ కట్టాల్సిన పరిస్థితి ఏర్పడింది. వేములవాడలో వేకువజాము నుంచే రైతులు చెప్పులు, ఆధార్ కార్డులు, రాళ్లు క్యూలో పెట్టారు. మహిళలు పురుషులు అనే తేడా లేకుండా కుటుంబ సభ్యులతో రైతులు యూరియా పంపిణీ చేసే సెంటర్ల వద్ద పడిగాపులు కాస్తున్నారు. రోజంతా వెయిట్ చేసిన రైతుకు ఒక బస్తా కంటే ఎక్కువ ఇవ్వడం లేదని అన్నదాతలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఎకరానికి ఒక బస్తా ఇవ్వాలని డిమాండ్ చేస్తున్నారు. రైతులు వ్యవసాయ పనులు చేసుకోవాలా?...లేక యూరియా కోసం నిద్ర లేచింది మొదలు రాత్రి పడుకునే వరకు సొసైటీల చుట్టు తిరగాలా అని ప్రశ్నిస్తున్నారు. ప్రభుత్వ తీరు అధికారుల వైఖరిపై ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రైతులకు సరిపడా యూరియా వెంటనే సప్లై చేయాలని కోరుతున్నారు.

==========================

## దమ్మనపేట రిజర్వ్ ఫారెస్టు లో పంటలను ధ్వంసం చేసిన అధికారులు

మంచిర్యాల సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి) దండేపల్లి మండలం లింగాపూర్ బీట్ లోని దమ్మన్నపేట రిజర్వు ఫారెస్ట్ లో గిరిజనులు వేసిన పంటను ఫారెస్ట్ అధికారులు ధ్వంసం చేసారు. కవరేజ్ కి వెళ్ళిన మీడియాను ఫారెస్ట్ అధికారులు అనుమతించలేదు. దాంతో జర్నలిస్టులు రోడ్డుపై బైటయించి నిరసన తెలిపారు.

## మత మార్పిడి చేస్తున్నారని ఆరోపణ

భూపాలపల్లి సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి) మతమార్పిడి చేస్తున్నారనే ఆరోపణలతో పలువురు భూపాలపల్లి పట్టణంలోని ఎల్బీనగర్ లో గల మున్సిపల్ శాఖ టౌన్ ప్లానింగ్ అధికారి సునీల్ ఇంటిముందు ఆందోళనకు దిగారు. పోలీసుల జోక్యంతో గొడవ సద్దుమణిగింది. భూపాలపల్లి మునిసిపాలిటీలో టౌన్ ప్లానింగ్ అధికారిగా పనిచేస్తున్న సునీల్, అతడి భార్య 12 మంది విద్యార్థినులను ఇంటికి పిలిపించుకున్నారు. అయితే విద్యార్థులంతా పట్టణంలోని బీసీ, ఎస్సీ హాస్టల్ విద్యార్థినిలు ఉన్నారు. అలాగే కాటారం మండలంలోని గంగారంలోని మోడల్ స్కూల్కు చెందిన వారు ఉన్నారు. వీరిని శుక్రవారం రాత్రి ఇంటికి పిలిపించుకుని ఏసు ప్రార్థనలు చేయిస్తూ మత మార్పిడి చేసేందుకు కుట్ర చేసినట్లు అందులోని ఓ విద్యార్థిని ద్వారా విద్యార్థినిల తల్లిదండ్రులకు సమాచారం అందింది.

# బరితెగిస్తున్న లీడర్లు...

నల్గొండ, సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి) సదుకుంటేనే పని జరుగుతుంది.. వారానికి రెండుసార్లు వస్తే చాలుశీర్షిక చదివి మమ్మల్ని తిట్టుకుంటున్నారు కదూ. మీ స్థానంలో మేము ఉంటే అలాగే తిట్టుకునే వాళ్ళం. కనబడితే రెండు చెంపలు వాయించే వాళ్ళం కూడా. ఎందుకంటే ఆ శీర్షిక అలా ఉంది కాబట్టి. వాస్తవానికి ఈ తరహా భాషను ప్రయోగించాలంటే మాకు కూడా చాలా ఇబ్బందిగా ఉంటుంది. ఎందుకంటే మా న్యూస్ వెబ్సైట్ ను అందరూ చూడాలనేదే తాపత్రయం. అంటే తప్ప ఒక సెక్షన్ రీడర్స్ చదవాలనేది కాదు. కాకపోతే జరిగిన దారుణం అటువంటిది. ఇటువంటి దారుణాన్ని వెలుగులోకి తీసుకొచ్చే క్రమంలో ఆ తరహా భాష వాడక తప్పడం లేదు. పెద్ద మనసుతో క్షమిస్తారని కోరుకుంటున్నాం. ప్రభుత్వ పథకాలు పేదలకు అందాలని ఏలుతున్న నాయకులు చెబుతుంటారు. పెద్దపెద్ద సమావేశాలు పెట్టి మరి గొప్పగా వ్యాఖ్యానిస్తూ ఉంటారు. వాస్తవానికి ప్రభుత్వం ప్రవేశపెట్టే ప్రతి పథకం పేదవాడికి చేరితే అంతకుమించిన ఆనందం ఇంకొకటి ఉండదు. ఎందుకంటే పథకం అనేది పేదవాళ్లకు చేరినప్పుడు క్రమక్రమంగా పేదరికం తగ్గిపోతుంది. తద్వారా జీవించే హక్కు.. అందరికీ సమానంగా ఉంటుంది. ఒకరి మీద ఆధారపడకుండా స్వశక్తితో బతికే వారి సంఖ్య పెరుగుతుంది. అంతకు మించిన ఆనందం ఇంకెక్కడ ఉంటుంది. పైగా పథకాలను పకడ్బందీగా ప్రభుత్వాలు అమలు చేస్తే.. వాళ్ల అధికారానికి ఇబ్బంది ఉండదు. కానీ మన ప్రభుత్వాలు అలా చేయవు కదా. పథకాల విషయంలో అధికార పార్టీ నేతల నొక్కుడు ఎక్కువగా ఉంటుంది కదా. పైగా అధికార పార్టీ నేతలకు పేటెంట్ రైట్ మాదిరిగా ప్రభుత్వ పథకాలు ఉంటాయి కదా.. పైగా ఇలాంటి వ్యవహారాలలో ఏ వ్యవస్థలు జోక్యం చేసుకోలేవు. జస్ట్ చూస్తూ ఉంటాయి.పేదలకు పథకాలు కావాలి కాబట్టి నేతల చుట్టూ తిరుగుతూ ఉంటారు. ఆ అధికార పార్టీలో ఉన్న నాయకులు పేదల అవకాశాన్ని ఆసరాగా చేసుకొని రకరకాల వ్యవహారాలకు పాల్పడుతుంటారు. అయితే తెలంగాణలోని ఓ ప్రాంతంలో ఓ ప్రభుత్వ పథకానికి సంబంధించి ఓ మహిళ అధికార పార్టీ నాయకుడిని కలిసింది. మొదట్లో కచ్చితంగా చేస్తానని హామీ ఇచ్చిన అతడు.. ఆ తర్వాత ఆమెను అనేక పర్యాయాలు తన వద్దకు రప్పించుకున్నాడు. వచ్చిన ప్రతి సందర్భంలో ఆమె అందం అతడిని భూమి మీద నిలువనీయకుండా చేసేది. దీంతో అతడు ఆమె అందాన్ని సొంతం చేసుకోవాలని అనుకున్నాడు.

ఇందులో భాగంగానే ఆమె ఫోన్ నెంబర్ తీసుకున్నాడు. ఇక అప్పటినుంచి అసలు కథ మొదలుపెట్టాడు.తన వద్దకు రావాలని.. మల్లెపూలు పెట్టుకోవాలని.. అందంగా తయారు కావాలని.. వారానికి రెండుసార్లు వచ్చిపోతే సరిపోతుందని.. డబ్బులు ఇవ్వాల్సిన అవసరం లేదని.. ప్రభుత్వ పథకమే కాదు ఇంకా చాలా అందుతాయని ఆఫరించాడు. దీంతో ఆమె భయపడిపోయింది. ఇలాంటిది తప్పని చెప్పింది. అయినప్పటికీ అతడు వినిపించుకోలేదు. దీనికి తోడు మరింత దూకుడుగా వెళ్లడం మొదలుపెట్టాడు.. దీంతో తప్పనిసరి పరిస్థితుల్లో ఆమె ఒప్పుకుంది. అయితే అతని బాగోతాన్ని మొత్తం ఫోన్లో రికార్డ్ చేసింది. అది కాస్త సోషల్ మీడియాలోకి ఎక్కడంతో ఒక్కసారిగా సంచలనం నమోదయింది.ఇక్కడ పేర్లు బయట పెట్టవచ్చు. ప్రాంతాలతో సహా వెల్లడించవచ్చు. లీగల్ గా ఇబ్బంది అవుతుంది కాబట్టే ఆ వివరాలు బయట పెట్టడం లేదు. సాధారణంగా అధికార పార్టీ అనగానే కార్యకర్తలకు కొమ్ములు ఉండవు. నాయకులకు పేటెంట్ రైట్స్ ఉండవు. అధికారమనేది కేవలం ఐదు సంవత్సరాలు మాత్రమే ఉంటుంది. ఆ తర్వాత మారిపోతూ ఉంటుంది. కానీ ఇటువంటి నాయకులు అధికార పార్టీలో ఉంటే మాత్రం అధికారం ఐదేళ్లు కాదు కదా.. ఐదు నిమిషాలు కూడా ఉండదు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన మాజీ శాసనసభ్యులు


రామడుగు: సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి) రామడుగు మండలం గోపాలరావుపేట గ్రామానికి చెందిన రేణికుంట అజయ్(సింగర్ిడ డ్యాన్స్ మాస్టర్) వారి తండ్రి రేణికుంట పోచయ్య గత కొన్ని రోజుల క్రితం మరణించగా వారి కుటుంబ సభ్యులను మాజీ శాసనసభ్యులు సుంకే రవిశంకర్ శనివారం పరామర్శించారు. అనంతరం రేణికుంట పోచయ్య చిత్రపటానికి మాజీ శాసనసభ్యులు సుంకే రవిశంకర్ పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. వారితో పాటు వారి కుటుంబ సభ్యులు రేణికుంట హరీష్ దుర్గయ్య నాయకులు పూడూరు మల్లేశం ఎడవల్లి పాపిరెడ్డి వేల్పుల హరికృష్ణ దాసరి అరుణ్ కుమార్ పురాణం రమేష్ దాసరి శంకరయ్య దాసరి రమేష్ రేణికుంట శ్రావణ్ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

==============================

## కరెంట్ ఆఫీస్ సెంటర్ లో విద్యార్థిని రాత్రి దారుణ హత్య

నెల్లూరు సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి) బి ఫార్మసీ ఫైనల్ ఇయర్ పూర్తయిన మైధిలి ప్రియను నిఖిల్ కత్తితో పొడిచి దారుణంగా హతమార్చాడు. మాట్లాడాలని కరెంట్ ఆఫీస్ సెంటర్ సమీపంలోని రూముకి పిలిచి, కత్తితో పొడిచి చంపిన స్నేహితుడు ఆపై పోలీస్ స్టేషన్లో లొంగిపోయాడు. పోలీసులు మృతదేహాన్ని నెల్లూరు మార్చురీకి తరలించారు.

## రాజకీయ పార్టీలకు స్థిరమైన, నిర్దిష్టమైన ఏకాభిప్రాయం ఉండాలి: బీసీ జనార్ధన్ రెడ్డి



విజయవాడ సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి) రాజకీయ పార్టీలకు స్థిరమైన, నిర్దిష్టమైన ఏకాభిప్రాయం ఉండాలని మంత్రి బీసీ జనార్ధన్ రెడ్డి అన్నారు. ఏ ఎండకా గొడుగు కాసే రాజకీయ పార్టీలను ప్రజలు విశ్వసించే రోజులు పోయాయి. యూటర్న్ తీసుకోవడానికి ముందు అమరావతి ప్రజలు, మహిళలు, రైతులకు వైసిపి క్షమాపణ చెప్పాలి. అమరావతిని స్మశానంతో పోల్చిన వైసీపీ.. నేడు ఏ మొహం పెట్టుకుని అమరావతి రాజధాని అంటుందని అన్నారు.

మూడు రాజధానులు పేరిట ఐదేళ్ల కాలాన్ని వృధా చేసినందుకు జగన్మోహన్ రెడ్డి సిగ్గుతో తల దించుకోవాలి. అమరావతి మునిగిపోతుందంటూ దుష్ప్రచారం చేసిన నేతలు.. నేడు సమర్థించడం వెనుక రాజకీయ దురాలోచన ఏమిటి. అధికారం కోసం ఊసరవెల్లిలా రంగులు మార్చే తత్వం వైసిపిది.. ఈ విషయం మరోసారి రుజువైంది. జగన్ తత్వమెరిగి గత ఎన్నికల్లో ప్రతిపక్ష హోదా కూడా లేకుండా ప్రజలు 11 సీట్లకు పరిమితం చేశారు. మాట తప్పని, మడమ తిప్పని నేత నేడు మనసు మార్చుకోవడం వెనుక ఏ కుటిల రాజకీయం ఉందో ప్రజలకు చెప్పాలి. జగన్మోహన్ రెడ్డి తలకిందులుగా తపస్సు చేసిన ప్రజలు వైసీపీని మళ్లీ నమ్మే పరిస్థితి లేదు. కూటమి ప్రభుత్వం ఆధ్వర్యంలో విజనరీ చంద్రబాబుతోనే అమరావతి ప్రజా రాజధాని సాధ్యం. వైసీపీని నమ్మి మరోసారి మోసపోవడానికి రాష్ట్ర ప్రజలు సిద్ధంగా లేరని అన్నారు.



## చందలా పూర్ లిఫ్ట్ పనులు ప్రారంభించాలి ఇర్కోడ్ లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలి

సిద్దిపేట సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి) ఘన్ పూర్ పంప్ హౌస్ ప్రారంబానికి సిద్ధం చేయాలిగోపులపూర్ కస్తూరి పల్లి చెక్ డ్యామ్ పనులు ప్రారంభించాలి.వచ్చే యాసంగి పంటకు శాశ్వత కాలువల నిర్మాణం చేపట్టాలి. సిద్దిపేట నియోజకవర్గం లో సాగు నీటి పై ఇరిగేషన్ అధికారులతో మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు సమీక్షా.సిద్దిపేట నియోజకవర్గం లో ఈ సారి యాసంగి కి తలెత్తిన సమస్యలు వచ్చే వానకాలం, యాసంగి పంటకు ఉండకుండా చూడాలని మాజీ మంత్రి ఎమ్మెల్యే హరీష్ రావు అన్నారు. సిద్దిపేట క్యాంప్ కార్యాలయం లో ఇరిగేషన్ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్బంగా మాట్లాడుతూ. ఈ సారి యాసంగి పంటకు సాగు నీటి ఇబ్బందులు తలెత్తాయని, అధికారుల సమన్వయం తో తాత్కాలిక కాలువ ఏర్పాటు కావడం వలన కొంత ఇబ్బందులు తొలిగాయని వచ్చే యాసంగి పంట వరకు శాశ్వతంగా కాలువ ఏర్పాటు కావాలని అందుకు ప్రణాళికలు చెపట్టాలన్నారు. ఈ సారి 50వెల ఎకరాలకు సాగు నీరు ఇచ్చామని పెరిగిన ఆయకట్ట దృష్ట్యా ఖీట -7, ఆర్ డి-8, ఆర్ డి-9 కాలువలు త్వరితగతిన పూర్తి చేయాలని రంగనాయక సాగర్ మల్లన్న సాగర్ అనుసంధానం చేయాలని కోరారు. నియోజకవర్గం లోని పెండింగ్ పనులు, పెండింగ్ కాలువ లు వెంటనే పూర్తి చేయాలాన్నరు..ఇర్కోడ్ లిఫ్ట్ పనులు వేగవంతం చేయాలని కోరారు, చందలా పూర్ లిఫ్ట్ పనులు వేంటనే ప్రారంభించాలని కోరారు, ఇర్కోడ్ లిఫ్ట్ పనులు వేగవంతం చేసి ప్రారంబానికి సిద్ధం చేయాలి. నంగునూర్ మండలం లోని ఘన్ పూర్ గ్రామం వద్ద నిర్మించిన ఘన్ పూర్ పంప్ హౌస్ పనులు చివరి దశలో ఉన్నాయని త్వరితగతి పూర్తి చేసి పంప్ హౌస్ ని అందుబాటులో కి తేవాలని. ఈ పంప్ హౌస్ పూర్తి అవుతే వాగు అవుతలి గ్రామాలకు 3వేల ఎకరాలకు సాగు నిరందుతుందని చెప్పారు. కస్తూరి పల్లి, గోపులా పూర్ చెక్ డ్యామ్ పనులు ప్రారంభం చేయాలని చెప్పారు, సిద్దిపేట నియోజకవర్గం లో పలు గ్రామాల సాగు నీటి సమస్యల అడిగి తెల్సుకున్నారు. రైతులకు సాగు నీటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని అధికారులకు సూచించారు.

## బాపట్ల జిల్లా నూతన కలెక్టర్‌గా డా.వాసుదేవ వినోద్ కుమార్ బాధ్యతలు స్వీకరణ



బాపట్ల, సెప్టెంబర్ 14( భారతశక్తి ప్రతినిధి) బాపట్ల జిల్లా నూతన కలెక్టర్ గా డాక్టర్ వాసుదేవ వినోద్ కుమార్ బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా తొలుత జిల్లా కలెక్టర్‌కు ఘన స్వాగతం పలికిన ఇంచార్జి జేసీ గంగాధర్ గౌడ్, కలెక్టరేట్ ఏవో మల్లికార్జునరావు, ఆర్డీఓ పి.గ్లోరియా, ఇతర అధికారులు ఘన స్వాగతం పలికారు. వేద మంత్రోచ్ఛారణల మధ్య కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగాజిల్లా నూతన కలెక్టర్‌ను పలువురు జిల్లా అధికారులు మర్యాద పూర్వకంగా కలిశారు.

# కాలువ నిండా నీళ్లు ఉన్నా రైతుల కంట్లో కన్నీళ్లు





పోరుమామిళ్ళ, ( భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 14: అధికారుల నిర్లక్ష్యంతో నిరుపయోగంగా మారిన తెల్లపాడు ఎత్తిపోతల పథకంను మరమ్మత్తులు చేసి వారంలోగా చెరువులకు నీళ్లు అందించకపోతే సిపిఐ పక్షాన ఆందోళన ఉధృతం చేస్తామని జిల్లా కార్యదర్శి గాలి చంద్ర హెచ్చరించారు.

శనివారం స్థానిక సిపిఐ నాయకులు కార్యకర్తలు రైతులతో కలిసి కలసపాడు మండలంలోని తెల్లపాడు సమీపంలోని తెలుగు గంగ కాలువపై మరమ్మత్తులకు నోచుకోక నిరుపయోగంగా ఉన్న ఎత్తిపోతల పథకమును సందర్శించిన సందర్భంగా గాలి చంద్ర మాట్లాడుతూ,

కడప జిల్లాలో మారుమూల ప్రాంతమైన కలసపాడు మండలంలోని తెల్లపాడు గ్రామపంచాయతీలోని తెల్లపాడు, ఎగువతంబళ్లపల్లె, ఎగువరామాపురం గ్రామపంచాయతీల పరిధిలోని తడుకు చెరువు,తిక్కమ్మ చెరువు, మేలకుంట చెరువు,రంపకుంట చెరువు, దూలవారిపల్లె చెరువు,కొండపేట కొత్తచెరువులకు నీటిని నింపడం కోసం సుమారు 17 కోట్ల రూపాయల ప్రజాధనంతో చేపట్టిన ఎత్తిపోతల పథకం అధికారుల నిర్లక్ష్యం కారణంగా రెండు నెలల నుంచి నుంచి పనిచేయక చేయక కాలువనిండా నీళ్లు పోతున్న చెరువులలో మాత్రం చుక్కనీరు లేక రైతులు లబోదిబోమని నెత్తినోరు కొట్టుకుంటుంటే, మరమ్మత్తులు చేసి వినియోగంలోకి తేవాల్సిన ఇరిగేషన్ అధికారులు నిమ్మకు నీరెత్తినట్లు వ్యవహరించడం సిగ్గుచేటు అన్నారు. సుమారు 15 గ్రామాలకు సంబంధించినటువంటి రైతులు,రైతు కూలీలకు సంబంధించిన అతి ముఖ్యమైన తాగునీరు,సాగునీరు సమస్యనే పట్టించుకోకపోవడమే కాక, లిఫ్ట్ ఇరిగేషన్ కి వెళ్లే దారిపై ఉన్న కంప చెట్లను కూడా తొలగించకపోవడం అధికారుల నిర్లక్ష్య వైఖరికి నిలువెత్తు నిదర్శనం అన్నారు. ఎత్తిపోతల పథకం నకు సంబంధించిన ట్రాన్స్ఫార్మర్ కాలిపోవడంతో పాటు, మోటారు మరమ్మత్తులకు గురై రెండు నెలలు కావస్తుంటే ఇరిగేషన్ అధికారులు కానీ,ఈ ప్రాంత ప్రజా ప్రతినిధులు కానీ ఏమాత్రం స్పందించకుండా తాత్సారం చేస్తే ఇక చెరువులకు నీళ్లు ఎప్పుడు అందిస్తారు?రైతులు ఎప్పుడు పైర్లు పెట్టుకుంటారు?ఈలోగా కాలువకు నీళ్లు నిలుపుదల చేస్తే ఈ సంవత్సరమంతా ఈ 15 గ్రామాల ప్రజలు కరువు కాటకాలతో తాగు, సాగునీటికి తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తుంది.

కావున ప్రజల అత్యవసరమైన ఈ సమస్యపై దృష్టి సారించి వెంటనే కాలిపోయిన ట్రాన్స్ఫార్మర్ స్థానంలో కొత్త ట్రాన్స్ఫార్మర్ ఏర్పాటు చేయడంతో పాటు, మరమ్మతులకు గురైన మోటార్లను కూడా రిపేరు చేసి వెంటనే తడుకు చెరువు,తిక్కమ్మ చెరువు, మేలకుంట చెరువు,రంపకుంట చెరువు, దూలంవారిపల్లె చెరువు, కొండపేట కొత్తచెరువు తదితర చెరువులకు నీరు నింపి రైతులను,రైతు కూలీలను, పశు సంపదను ఆదుకోవాలని భారత కమ్యూనిస్టు పార్టీగా మేము డిమాండ్ చేస్తా ఉన్నాం.

అలా కాక ఈ విషయంపై ప్రభుత్వం,ఇరిగేషన్ అధికారులు స్పందించకుండా ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తే మాత్రం రైతుల పక్షాన ఈ ప్రాంత ప్రజల పక్షాన, రైతు కూలీల పక్షాన పెద్ద ఎత్తున ఉద్యమం చేపడుతామని హెచ్చరించారు.

ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు బాలు,రైతు సంఘం జిల్లా కార్యదర్శి భాస్కర్,ఏరియా సహాయ కార్యదర్శి పిడుగు మస్తాన్,మండల కార్యదర్శి సునీల్,ఏరియా కార్యవర్గ సభ్యులు వెంకట రమణ,రవికుమార్, కేశవ,నాగరాజు, నాగేష్,జి.ఎల్. నరసింహ, రవి,జాకోబ్, మండల నాయకులు రామాపురం భాష, రమణారెడ్డి మరియు అధిక సంఖ్యలో పార్టీ కార్యకర్తలు రైతులు రైతు కూలీలు మహిళలు పాల్గొన్నారు.

# దేవస్థానం అభివృద్ధి కోసమే ఇచ్చాను



పోరుమామిళ్ల, ( భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్14 : మండలంలోని రంగ సముద్రం గ్రామపొలం సర్వే నెంబర్ 930/2లో 3.50 ఎకరాలు మా పూర్వీకుల నుండి వచ్చిందని, అందులోని కొంత భూమి ఆక్రమణలకు గురైందని న్యాయం జరగాలని అప్పన సముద్రం గంగాధరాచారి శనివారం మీడియా సమావేశంలో చెప్పడం జరిగింది. ఈ సందర్భంగా గంగాధరాచారి మాట్లాడుతూ...నా పూర్వీకుల నుండి సంక్రమించిన సర్వేనెంబర్ 930/2 లోని 3.50 ఎకరాల భూమిలో 2ఎకరాలు మా అన్న పిల్లలతో కలిసి 2002 లో అమ్ముకోవడం జరిగిందని, మరో 90 సెంట్ల భూమిని కూడా ఇండ్ల రామకృష్ణారెడ్డికి అమ్మగా ఆయన 2012 లో దాన్ని కల్లూరి రమణారెడ్డి ( కరెంటు రమణారెడ్డి)కి అమ్మడం జరిగిందని తెలిపారు. మిగిలిన స్థలంలో 35 సెంట్లు నా ఇష్టపూర్వకంగా కత్తెరగండ్లలోని శివాలయంకు ఇవ్వడం జరిగిందని, ఈ స్థలాన్ని అమ్మి శివాలయం అభివృద్ధికి వెచ్చించమని కోరానన్నారు. ఇంకా 25 సెంట్లు భూమి వుండాలని ఆచారి ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. శివాలయంకు ఇచ్చిన 35 సెంట్లు ఇంకా మిగిలివున్న 25 సెంట్లు మొత్తం 60 సెంట్ల భూమిని కల్లూరి రమణారెడ్డి (కరెంటు రమణారెడ్డి) ఆక్రమించుకొని వెంచర్ వేసుకున్నాడనిఆచారి బాధను వ్యక్తం చేస్తున్నాడు. భూమి లేకున్నా ఎక్కువగా చూపించి అమ్మి మోసం చేశావంట కదా అని విలేఖరులు అడిగిన ప్రశ్నకు సమాధానంగా ఎక్సెస్ చూపించేందుకు నేను రాజకీయ నాయకుణ్ణి కాదని, వ్యాపార దిగ్గజాన్ని కాదని సాధారణ పౌరుణ్ణి అని సమాధానం ఇచ్చారు గంగాధరాచారి. నేను మోసం చేస్తే మోసపోయేంత అమాయకుడా రమణారెడ్డి అన్నారు. నాదగ్గర వున్న రికార్డుల ప్రకారమే దేవస్థానం అభివృద్ధి కోసం ఇచ్చానన్నారు. ఇండ్ల రామకృష్ణారెడ్డికి అమ్మిన డాక్యుమెంట్లు, ఇండ్ల రామకృష్ణారెడ్డి కరెంటు రమణారెడ్డికి అమ్మిన డాక్యుమెంట్లను మీడియాకు చూపించాడు. దేవస్థానం ఛైర్మెన్ భైరిశెట్టి శ్రీనివాసులు మాట్లాడుతూ...సమస్యను తహసీల్దార్ చంద్రశేఖర్ రెడ్డి దృష్టికి తీసుకుపోతే ఆయన మాకు ఏమాత్రం సహకరించడం లేదని, ఒకసారి 3.50 ఎకరాలు, మరోసారి 2.50 ఎకరాలు చూపిస్తూ పూటకోమాట మాట్లాడుతున్నారని వాపోయారు. ఈ కార్యక్రమంలో కత్తెర గండ్ల దేవస్థానం ఛైర్మన్ భైరిశెట్టి శ్రీనివాసులు, కార్యదర్శి సూరపురెడ్డి వెంకటరమణారెడ్డి, రాఘవేంద్ర రెడ్డి, పోతుగంటి బాలయ్య, చెన్నవరం చెన్నారెడ్డి, రమణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మూడేళ్లుగా నిలిచిపోయిన కలవట్టు

## వర్షాకాలంలో బీసీ కాలనీ ప్రజల కష్టాలు దారుణం



పోరుమామిళ్ల, ( భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 14 : పోరుమామిళ్ల మండలం సంచర్ల పంచాయితీ నాగులకుంట్ల బీసీ కాలనీ వద్ద గల కలవట్టు సరైన రీతిలో లేక, పూర్తిగా బురదతో మురికి నీటితో నిండిపోయి ఉంది. దాదాపు మూడు సంవత్సరాలుగా అధికారులకు ఎన్నిసార్లు తెలియజేసినా, పట్టించుకోకపోవడం వల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

ద్విచక్ర వాహనంపై వెళ్లాలన్నా, వాహనాలతో ధాన్యాలు తరలించాలన్నా, ఆటోలు రావాలన్నా కష్టమే. స్కూల్ పిల్లలు అవతలికి వెళ్లి బస్సు ఎక్కాలన్నా బురదలో మునిగి పోతున్నారు. ప్రతి రోజు షూలు మట్టి లోనే ఇరుక్కుపోతున్నాయి. వర్షాకాలం కాబట్టి పరిస్థితి మరింత దారుణంగా ఉంది. ఇంట్లో నుంచి బయటకి రావడమే పెద్ద సవాలుగా మారింది” అని కాలనీవాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఓట్లు అడిగేటప్పుడు ఇచ్చిన హామీలు ఎక్కడ? మా ఇబ్బందులు కనబడవా? మేము మనుషులం కాదా? అంటూ ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.ఇప్పటికైనా అధికారులు తక్షణమే స్పందించి కలవట్టు పనులు పూర్తి చేయాలని కాలనీవాసులు డిమాండ్ చేస్తున్నారు. ఇంకా నిర్లక్ష్యం కొనసాగితే ఆందోళన తప్పదని, రోడ్డుపైనే పోరాటం చేస్తాం అని స్పష్టంగా హెచ్చరించారు.

# మనిషిని మార్చే శక్తి సాధనం పాట

## ప్రముఖ కవి, పత్రికా రచయిత, విమర్శకుడు చౌడూరి నరసింహారావు








హైదరాబాద్, (భారత శక్తి )సెప్టెంబర్ 14 : మనిషి వ్యక్తిత్వాన్ని తీర్చి దిద్ది ఉత్తమునిగా మార్చగల శక్తి సాధనం పాటని, తల్లి జోలపాట నుండి దేశభక్తి గీతాల వరకు పాటలకు ఎంతో ప్రాధాన్యత ఉన్నదని, మన దేశ స్వాతంత్ర సమరంలో దేశభక్తి గీతాలే ప్రధాన భూమికను వహించాయని, నేటి విద్యార్థులకు దేశభక్తి గీతాలను నేర్పించవలసిన ఆవశ్యకత ఎంతైనా ఉందని, కొన్ని సేవా సంస్థలు ఆ బాధ్యతను తీసుకున్నాయని, ఇటువంటి దేశభక్తి గీతాల పోటీలను భారత్ వికాస్ పరిషత్ వంటి సంస్థలు చేపట్టడం ఎంతో అభినందనీయమని, అందునా జిజాబాయి బ్రాంచ్ లెవెల్ లో నేషనల్ గ్రూప్ సాంగ్స్ కాంపిటీషన్ నిర్వహించడం సంతోషించదగినదని ప్రముఖ కవి, పత్రికా రచయిత, విమర్శకుడు, సాహిత్య కళా భూషణ్ చౌడూరి నరసింహారావు అభిప్రాయపడ్డారు.

మణికొండ న్యూ కమ్యూనిటీ హాల్లో శుక్రవారం నాడు భారత్ వికాస్ పరిషత్ జిజాబాయి శాఖ ఏర్పాటు చేసిన బ్రాంచ్ లెవెల్ నేషనల్ గ్రూప్ సాంగ్స్ కాంపిటీషన్ లో విశిష్ట అతిథిగా పాల్గొని చౌడూరి నరసింహారావు కీలక ఉపన్యాసం చేశారు. ఈ కార్యక్రమానికి బివిపి జిజాబాయి శాఖ అధ్యక్షుడు మాదిరెడ్డి పెంటారెడ్డి అధ్యక్షత వహించి మా బ్రాంచీలో నేషనల్ గ్రూప్ సాంగ్స్ కాంపిటీషన్ నిర్వహించుకోవడం సంతోషాన్ని కలిగిస్తుందని అన్నారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా పాల్గొన్న మణికొండ మునిసిపాలిటీ ఎక్స్ ఛైర్మన్ కస్తూరి నరేంద్ర, ఎక్స్ వైస్ ఛైర్మన్ కె. నరేంద్ర రెడ్డి, బివిపి జిజాబాయి శాఖను, పోటీల్లో పాల్గొంటున్న వివిధ పాఠశాలలకు చెందిన విద్యార్థులను అభినందించారు గౌరవ అతిథిగా పాల్గొన్న బివిపి ప్రాంత సంపర్క్ ప్రముఖ్ రఘు సతీష్ కుమార్ బ్రాంచి లెవెల్లో గెలుపొందిన వారు ప్రాంత లెవల్ కు అక్కడ గెలిస్తే నేషనల్ లెవెల్ కు పంపుతామని నేషనల్ లెవెల్ లో గెలిచిన వారికి విశేషమైన స్థాయిలో బహుమతి ఉంటుందని తెలిపారు. మరో అతిథి ప్రాంత ఎన్. జి. ఎస్. సి. కన్వీనర్ ఎన్. సదాశివరెడ్డి పోటీల నియమ నిబంధనలను విద్యార్థులకు న్యాయం నిర్ణయితలకు వివరించారు. మరొక గౌరవ అతిథి ప్రముఖ రచయిత, మెజీషియన్ చొక్కపు వెంకటరమణ ప్రదర్శించిన ఇంద్రజాల ప్రదర్శన అందరినీ మంత్రముగ్ధులను చేసింది. విద్యార్థుల్లో ఉత్సాహాన్ని, ఉల్లాసాన్ని నింపింది. హిందీ- సంస్కృత గీతాల విభాగంలో మణికొండ జడ్పీహెచ్ఎస్ స్కూల్ ప్రథమ బహుమతి, కోకాపేట ఎం పి హెచ్ ఎస్ కు ద్వితీయ బహుమతి లభించాయి. రీజినల్ విభాగంలో నార్సింగ్ తెలంగాణ రెసిడెన్షియల్ స్కూల్ కు ప్రథమ బహుమతి, కోకాపేట ఎంపీహెచ్ఎస్ కు ద్వితీయ బహుమతి లభించింది. ఈ పోటీల్లో గెలుపొందిన విద్యార్థులకు ప్రాంత స్థాయి పోటీలకు పంపుతామని జిజాబాయి శాఖ ఎన్జీఎస్సీ కన్వీనర్ కమల కుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో నాలుగు ప్రభుత్వ పాఠశాలలకు చెందిన ఐదు ప్రైవేటు పాఠశాలలకు చెందిన 300 మంది విద్యార్థులు పాల్గొన్నారు. రోజంతా సాగిన కార్యక్రమంలో నిర్వాహకులు మధ్యాహ్నం అందరికీ భోజన ఏర్పాట్లు చేశారు. పోటీల్లో పాల్గొన్న విద్యార్థులందరికీ ప్రశంసా పత్రాలు ఇచ్చారు.

కార్యక్రమానికి ముందు విద్యార్థులు ప్రదర్శించిన స్వాగత గీత నృత్యం అందరినీ ఆకట్టుకుంది. అతిథులకు నిర్వాహకులు జ్ఞాపిక, శాలువలతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో రవికాంత్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ప్రభూజి, సిహెచ్ వీరభద్రరావు, రామ్మూర్తి, జగన్నాథ్, సత్యనారాయణా చార్య, భాస్కర్, శ్రీనివాసరావు, మల్లేష్, ప్రాంత కార్యదర్శి శివరాంజీ, లక్ష్మణ్, ఇందిరా, సుబ్బారెడ్డి, వెంకటేశ్వర్లు, బుజ్జయ్య, స్థానిక నాయకులు బీరప్ప, సిద్ధప్ప, శ్రవణ్ కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# గుర్తుకొస్తున్నాయి.... గుర్తుకొస్తున్నాయి...

## 25 సంవత్సరాల తర్వాత కలుసుకున్న పూర్వ విద్యార్థులు..

ఆళ్లగడ్డ , (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 14

నంద్యాల జిల్లా ఆళ్లగడ్డ పట్టణంలోని శ్రీ రాఘవేంద్ర పబ్లిక్ స్కూల్లో 2000-2001 సంవత్సరం పదవ తరగతి చదివిన పూర్వ విద్యార్థుల అత్మీయ సమ్మేళనం శనివారం నిర్వహించారు. ఇక్కడ విద్యనభ్యసించిన పూర్వ విద్యార్థులు వివిధ స్థాయిలో ఉన్నవారు అందరూ హాజరయ్యారు. పూర్వ విద్యార్థులు ఆనాటి మధుర జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందంగా గడిపారు. పాఠశాల కరస్పాండెంట్ ఎర్రం పాపిరెడ్డి, ప్రిన్సిపాల్ మాలతి ల ఆధ్వర్యంలో శ్రీ రాఘవేంద్ర స్వామి వారి చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి మాట్లాడుతూ ... పూర్వ విద్యార్థులు తాము చదువుకున్న పాఠశాలను మరిచిపోకుండా ఇలా అందరూ కలిసి ఆత్మీయ సమ్మేళనం నిర్వహించుకోవడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ఆనాడు తమ పాఠశాలలో క్రమశిక్షణతో కూడుకున్న విద్యను అభ్యసించిన విద్యార్థులందరూ ఈరోజు ఉన్నత స్థానాలలో ఉండడం ఎంతో గర్వకారణం అన్నారు. అజ్ఞానాంధకారాన్ని తొలగించి విజ్ఞానాన్ని ప్రసాదించిన గురువులను ఈరోజు అందరూ కలిసి సత్కరించుకోవడం ఎంతో ఆనందంగా ఉందని పూర్వ విద్యార్థులు ఎం. సౌజన్య, రజని, డాక్టర్ తనూజ, తదితర విద్యార్థులు గురువులను కొనియాడారు. అనంతరం పాఠశాల ప్రిన్సిపాల్ మాలతి, వసంత లక్ష్మి,మహేశ్వర్ రెడ్డి, మునీర్ భాష, నరసింహారెడ్డి, లక్ష్మీపతి, వెంకటేశ్వర్లు, జనార్ధన్, భాస్కర్ లను సన్మానించారు. ఈ కార్యక్రమంలో హైదరాబాద్ , బెంగళూరు, కర్నూల్, తదితర ప్రాంతాల్లో స్థిరపడిన పూర్వ విద్యార్థులు సౌజన్య, డా. తనూజ, రజని, జమాల్ హుస్సేన్, హరికృష్ణ, నరసింహ చక్రవర్తి, ఆదినారాయణ, మహబూబ్ పీరా, సుబ్రమణ్యం, సురేష్, రఘుకార్తీక్ పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.

==================================

# జపనీస్ ఆశ్చర్యకరమైన పరిశోధన

## చైతన్య హాస్పిటల్, కరీంనగర్ డాక్టర్ డిసి. తిరుపతిరావు ఎండి..



కరీంనగర్, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 14

ఆహార లోపాల వల్ల మాత్రమే ఆమ్లత్వం కలుగుతుంది, కానీ ఒత్తిడి వల్ల కూడా ఇది ఎక్కువగా ఉంటుంది.రక్తపోటు, ఉప్పగా ఉండే ఆహారాలను ఎక్కువగా తీసుకోవడం వల్ల మాత్రమే కాదు, ప్రధానంగా భావోద్వేగాలను నిర్వహించడంలో, లోపాల వల్ల కూడా వస్తుంది.కొలెస్ట్రాల్, కొవ్వు పదార్థాల వల్ల మాత్రమే కాదు, అధిక సోమరితనం, లేదా నిశ్చల కదలని, జీవనశైలి కూడా ఎక్కువ బాధ్యత వహిస్తుంది.ఆస్తమా, ఊపిరితిత్తులకు ఆక్సిజన్ సరఫరా అంతరాయం వల్ల మాత్రమే కాదు, తరచుగా విచారకరమైన భావాలు, ఊపిరితిత్తులను అస్థిరంగా మారుస్తాయి.మధుమేహం, గ్లూకోజ్ ఎక్కువగా తీసుకోవడం వల్ల మాత్రమే కాదు, క్లోమం పనితీరును దెబ్బతీస్తుంది.మూత్రపిండాలలో రాళ్లు: కాల్షియం ఆక్సలేట్ నిక్షేపాలవల్ల మాత్రమే కాకుండా, భావోద్వేగాలు మరియు ద్వేషం వల్లకూడా కలుగుతాయి.స్పాండిలైటిస్: ఒ4ఒ5 లేదా గర్భాశయ రుగ్మత వల్లమాత్రమే కాదు: కానీ భవిష్యత్తు గురించి భారం లేదా అధిక చింతలు వల్లకూడా ఎక్కువ.మనం ఆరోగ్యంగా ఉండాలనుకుంటే ముందుగా మీ మనసును సరిచేసుకోండి:క్రమం తప్పకుండా వ్యాయామాలు చేయండి.కదలండి.ధ్యానం చేయండి.నవ్వండి మరియు ఇతరులను కూడా నవ్వించండి.స్నేహితులను తయారు చేసుకోండి.ఈ కార్యకలాపాలు మీ ఆత్మ, మనస్సు మరియు శరీరాన్ని బలోపేతం చేయడానికి మీకు సహాయపడతాయి.ఆరోగ్యంగా ఉండండి మరియు మీ జీవితాన్ని ఆస్వాదించండి.ఎక్కువగా కంపించండి.. చైతన్య హాస్పిటల్ కరీంనగర్ డాక్టర్ డిసి. తిరుపతిరావు ఎండి.. అన్నారు.

============================

# గుంటూరు జీటీ రోడ్డుపై గుంతలు వెంటనే పూడ్చాలని అధికారులను ఆదేశించిన ఎమ్మెల్యే గళ్ళా మాధవి



గుంటూరు, , (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 14

గుంటూరు నగరంలో భారీ వర్షాల కారణంగా జీటి రోడ్డుపై ఏర్పడిన గుంతలను గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఎమ్మెల్యే గళ్ళా మాధవి శనివారం స్వయంగా పరిశీలించారు. ప్రజల భద్రతకు ప్రాధాన్యం ఇస్తూ, వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా గుంతలను వెంటనే పూడ్చి, ఎప్పటికప్పుడు రోడ్డు పరిస్థితిని పర్యవేక్షించాలని సంబంధిత అధికారులకు కఠిన ఆదేశాలు జారీ చేశారు. చుట్టగుంట సెంటర్ నుండి మార్కెట్ సిగ్నల్ వరకు నూతన బిటి రోడ్డు నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేసి ప్రభుత్వానికి పంపినట్లు ఎమ్మెల్యే గళ్ళా మాధవి తెలిపారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలు నాణ్యమైన రహదారులపై సురక్షితంగా ప్రయాణించడానికి చర్యలు వేగవంతం చేస్తున్నాం. వర్షాకాలంలో ఎటువంటి ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవడం మా బాధ్యత. ప్రజల భద్రత, సౌకర్యం కోసం రహదారి అభివృద్ధి పనులను ప్రాధాన్యతతో పూర్తి చేస్తాం అని హామీ ఇచ్చారు.

# కోట్లు తో లిఫ్ట్ ఇరిగేషన్ పనులు ప్రారంభం

## బద్వేల్ టిడిపి ఇన్చార్జ్ రితీష్ రెడ్డి

బద్వేలు (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 14

బద్వేలు నియోజకవర్గంలోని కాశినాయన మండలంలో ఇటుకలపాడు , సావిశెట్టిపల్లె , కొండరాజు పల్లె ,వరికుంట్ల గ్రామాల చెరువులకు బ్రహ్మ సాగర్ ఎడమ కాలువ నుండి లిఫ్ట్ ద్వారా చెరువులకు నీరు నింపేందుకు 32 కోట్లు రూపాయలతో పనులు ప్రారంభించిన బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ రితీష్ రెడ్డి బద్వేల్ బిజెపి ఎమ్మెల్యే అభ్యర్థి బొజ్జ రోషన్న, బద్వేల్ మార్కెట్ యార్డ్ చైర్మన్ నరిశెట్టి సుప్రజ కాంట్రాక్టర్ పద్మనాభ రెడ్డి లు కలసి సావిశెట్టిపల్లె దగ్గర శనివారం శంకుస్థాపన చేసి పనిని ప్రారంభించారు అనంతరం బద్వేల్ నియోజకవర్గ టిడిపి ఇంచార్జ్ రితీష్ రెడ్డి మీడియాతో మాట్లాడుతూ కాశినాయన మండలంలో తెలుగు గంగ కాలువకు ఎగువన ఉండే గ్రామాల ప్రజలకు ఐదువేల ఎకరాలకు నీరు అందించడమే లక్ష్యమని అంతేకాకుండా రైతులు ఎలాంటి ఇబ్బంది పడకుండా ఉండాలంటే కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడం రైతుల అదృష్టమని కాశినాయన మండలంలో ఎమ్మెల్సీ సొంత మండలం అయినప్పటికీ ఆయన చేసింది ఏమీ లేదు అని ప్రజలను మభ్యపెట్టడం తప్పితే ఆయన ఏమి చేయలేదన్నారు ఈ లిఫ్ట్ ఇరిగేషన్ పనులకు రైతులందరూ కాంట్రాక్టర్ కు సహకరించి పనులకు ఎటువంటి ఆటంకం కలగకుండా దగ్గర ఉండి ప్రభుత్వానికి చెడ్డ పేరు రాకుండా చూసుకోవాలని తెలుగు గంగ డి ఈ శ్రీకాంత్ రెడ్డి ఏఈ రమణారెడ్డిలకు సూచించారు రితీష్ రెడ్డిని విలేకరులు కత్తెరగండ్ల శివాలయం గురించి మీరేమంటారు అంటే నాకు డాక్యుమెంట్ ఇవ్వండి నేను ప్రెస్ మీట్ పెడతాను అని రితీష్ రెడ్డి చెప్పారు అంతేకాకుండా ఓబులాపురం నుండి వరికుంట్ల వరకు రోడ్డు చాలా అద్వానమైన పరిస్థితిలో ఉన్నది కంపచెట్లు తొలగించాలని వెంటనే తొలగిస్తామని ఆయన హామీ ఇచ్చారు

# మనసున్న మారాజు జగ్గారెడ్డి

## చూపును కోల్పోయిన వికాస్ కు 7 లక్షల 50 వేల రూపాయలు ఆర్థిక సాయం



సంగారెడ్డి, (భారత శక్తి ప్రతినిధి) సెప్టెంబర్ 14 : కంటి చూపు కోల్పోయి బాధపడుతున్న విద్యార్థికి మాజీ ఎమ్మెల్యే, టిపిసిసి వర్కింగ్ ప్రెసిడెంట్ జగ్గారెడ్డి పెద్ద మనసుతో ఆపన్న హస్తం అందించారు. నిజామాబాద్ లోని స్నేహ సొసైటీకి చెందిన అంధుల పాఠశాలలో 5వ తరగతి చదువుతున్న వికాస్ నాయక్ కు మూడు సంవత్సరాల వయసులో అనారోగ్యంతో చూపును కోల్పోయాడు. తన కోసం తన తండ్రి చికిత్స కోసం 6 లక్షల రూపాయలు అప్పు వడ్డీ లక్ష రూపాయల అయిందని, ఆర్థిక సాయం చేయాలని జగ్గారెడ్డిని వికాస్ నాయక్ కోరారు. తన తండ్రికి రెండు కిడ్నీలు పాడయ్యాయని అని పేర్కొన్నాడు తక్షణమే స్పందించి 7 లక్షల 50 వేల రూపాయల నగదును జగ్గారెడ్డి అందించారు. అయితే వికాస్ పాటలు పౌరాణిక గాథల్లో పద్యాలను, మల్లన్న బీరప్ప వీరగాథలను రాగయుక్తంగా ఏగతాటిగా చెప్పడంలోను, హనుమంతుని భక్తులకు ఉన్న హనుమాన్ మాల ధరించుకుంటా అని వికాస్ చెప్పడంతో విద్యార్థి ప్రతిభను చూసి జగ్గారెడ్డి అబ్బురపడ్డారు. అలాగే వికాస్ మాట్లాడుతూ కానీ స్వయంగా యూట్యూబ్ ఛానల్ పెట్టుకుంటా తనకు సపోర్ట్ చేయమని కోరాడు. వెంటనే స్పందించిన జగ్గారెడ్డి కొత్త స్మార్ట్ ఫోన్ తెప్పించి ఇవ్వడమే కాకుండా యూట్యూబ్ ఛానల్ ఏర్పాటుకు సహకరిస్తానని భరోసా ఇచ్చారు. బాగా చదువుకుని కలెక్టర్ అవుతానని వికాస్ చెప్పడంతో కష్టపడి చదువుకోవాలని కలెక్టర్ గా కావాలని మీ కుటుంబం బాగా చూసుకోవాలని అందుకు తన సహకారం ఎప్పుడూ ఉంటుందని జగ్గారెడ్డి అన్నారు. అంతేగాక ఇకపై తమ ఇంట్లో జరిగే ప్రతి కార్యక్రమంలో పాటలు పాడేందుకు పిలుస్తానని అన్నారు. వికాస్ కు స్వయంగా కార్ ఏర్పాటు చేసి నాయక్ కుటుంబాన్ని వారి స్వస్థలమైన కామారెడ్డి జిల్లా ఎల్లారెడ్డి నియోజకవర్గ గాంధారి మండలం లొంక తాండకు పంపించారు.

# శివాని విద్యాసంస్థల ఓరియంటేషన్ సమావేశం

-ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం

కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి వెల్లడి.




ఉమ్మడి వరంగల్ బ్యూరో,(భారత శక్తి)సెప్టెంబర్14: హన్మకొండ భీమారంలోని ఎం.టి. ఆర్.గార్డెన్ లో శివాని విద్యాసంస్థల ద్వితీయ సంవత్సర విద్యార్థిని విద్యార్థులకు వారి తల్లిదండ్రులకు సమావేశం ఓరింటేషన్ కార్యక్రమం నిర్వహించడం జరిగింది ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా టీవీ యాంకర్ కార్పొరేట్ మోటివేటర్ కె.వి ప్రదీప్ హాజరయ్యారు .ఈ కార్యక్రమాన్ని ఉద్దేశించి మోటివేటర్ ప్రదీప్ మాట్లాడుతూ. నిజమైన గెలుపు అపజయాలను అధిగమించినప్పుడు విద్యార్థిని ,విద్యార్థులకు ఆనందం వస్తుంది. అదేవిధంగా ప్రతి కఠిన పరిస్థితికి నీ బలము పరీక్షించడానికి ఒక సమయం వస్తుందని అన్నారు. ప్రతి అనుభవం నీకు ఒక గుణపాఠం ప్రతి కష్టం నీ గెలుపుకు పునాది అవుతుందని తెలిపారు .నీ కష్టం నీ గెలుపుకు దారి లాంటిది. నీ ఆశయం నీకు దిక్సూచి లాంటిదని అన్నారు. కళాశాల సెక్రటరీ కరస్పాండెంట్ తాళ్లపల్లి స్వామి మాట్లాడుతూ. ఒకసారి గెలవాలన్నా సంకల్పం మనసులో పెన వేసుకుంటే విజయానికి మరింత సమయం ఉండదు .జీవితంలో ప్రతిక్షణం నిన్ను ముందుకు నడిపించే గెలుపు నీకు ఎదురుచూస్తుంది అని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థిని విద్యార్థులు తల్లిదండ్రులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయడం జరిగిందని అన్నారు. ఈ కార్యక్రమంలో విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృత కార్యక్రమాలు అధ్యాపకులను తల్లిదండ్రులను అలరింప చేసాయి. అత్యున్నంత ర్యాంకులు సాధించిన విద్యార్థిని విద్యార్థులకు బహుమతులు ప్రధానం చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్, డైరెక్టర్లు, అధ్యాపకులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# ఎన్కౌంటర్లో మరణించిన మావోయిస్టు మోడెం బాలకృష్ణ పార్థివదేహానికి నివాళులర్పించిన మధుయాష్కీ గౌడ్

## ఆపరేషన్ కంగారును వెంటనే ఆపాలి మావోయిస్టులను చర్చలకు పిలవాలి: మధుయాష్కీగౌడ్




ఎల్బీనగర్ సెప్టెంబర్: 14 భారత శక్తి .

పోలీస్ ఎన్కౌంటర్ లో మరణించిన మావోయిస్టు కేంద్ర కమిటీ సభ్యులు మోడెం బాలకృష్ణ పార్థివదేహాన్ని చాదర్ ఘాట్లోని వారి నివాసం వద్ద కు వెళ్లి టీపీసీసీ ప్రచార కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కి గౌడ్. నివాళులర్పించారు. ఆయన కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. పేద కుటుంబంలో పుట్టిన బాలకృష్ణ ఆ రోజుల్లోనే ఇంజనీరింగ్ చదివి.. నక్సలిజం వైపు ఆకర్షితులయ్యారని, ఇంగ్లీషులో ఉన్న బ్రిటిష్ కాలం నాటి జైల్ మాన్యువల్ ను తెలుగులో అనువదించిన మొదటి వ్యక్తి బాలకృష్ణ గారన్నారు. మావోయిస్టు ఉద్యమంలో చేరి ప్రజల కోసం తన జీవితాన్ని త్యాగం చేశారన్నారు. మావోయిస్టులంటే ఉగ్రవాదులు కాదని, సమాజంలో దోపిడీ, అన్యాయాలను ప్రశ్నించేవారన్నారు. మావోయిస్టులు అడుగుతున్న ప్రజలకు సామాజిక, ఆర్థిక న్యాయం లాంటి సమస్యలను పరిష్కరించకుండా.. వారిని లేకుండానే చేయాలని కేంద్ర ప్రభుత్వ ఆలోచన దుర్మార్గమన్నారు. చర్చలకు సిద్ధమని చెప్పినా, వారిని పిలవకుండా ఆపరేషన్ కగార్ పేరుతో మావోయిస్టులను అంతమొందించడమే లక్ష్యంగా కేంద్రంలోని మోడీ- అమిత్ షా లు వ్యవహరిస్తున్న తీరు తీవ్ర ఆక్షేపనీయమన్నారు. 2026 మార్చి 31 వరకు మావోయిస్టులు లేకుండా ఏరి వేస్తామని కేంద్ర ప్రభుత్వం ప్రకటించడం దుర్మార్గమని, కానీ అదే మర్చి 31, 2026 వరకు దేశంలో పేదరిక నిర్మూలన చేపడుతాం... ఆర్థిక అసమానత రూపుమాపుతాం.. నిరుద్యోగం నిర్మూలిస్తాం.. అని చెప్పాలిగే దమ్ముందా కేంద్ర ప్రభుత్వానికని ప్రశ్నించారు. తనకు అనుకూల పారిశ్రామిక వేత్తలకు దేశంలోని సహజ సంపదలను దోచి పెట్టేందుకే నక్సలిజం నిర్మూలన తప్పా.. దేశంలో పేదల హక్కుల రక్షణ, వారి సమస్యల నిర్మూలనకు కాదన్నారు. హింసకు హింస పరిష్కారం కాదు. తుపాకీతో సమస్యలు తీరవన్నారు. వెంటనే ఆపరేషన్ కగార్ ను ఆపాలని, మావోయిస్టులను చర్చలకు పిలవాలని డిమాండ్ చేశారు.

దేశంలోనే ఉంటున్న దేశ పౌరులైన మావోయిస్టులను చంపడం హేయమైన చర్య అన్నారు. ప్రజలు ఎవరైనా మోడీ ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే అర్బన్ నక్సలైట్స్ అని ముద్ర వేసి అణిచివేయాలని చూస్తున్నారని వి. మోడెం బాలకృష్ణ సతీమణి జైల్లో ఉన్నదని, బాలకృష్ణ దహన సంస్కారాలకు కూడా బెయిల్ ఇవ్వకపోవడమంటే ప్రభుత్వానికి మానవత్వం లేనిదని పేర్కొన్నారు.

# బీపీ లెక్క పక్కగా..



డబ్బులు లెక్క చూసుకుంటాం. జమ, ఖర్చులను పరిశీలిస్తుంటాం. ఎక్కడైనా లెక్క తప్పుతుంటే సరిచేసుకోవటానికి ప్రయత్నిస్తాం. ఇవి సరే.. అధిక రక్తపోటు (హైబీపీ) లెక్కలను ఎప్పుడైనా చూసుకుంటున్నారా? రక్తపోటు మితిమీరితే దుష్ప్రభావాలకు దారితీస్తుంది మరి. అందుకే బీపీ లెక్కలను అదుపు తప్పకుండా చూసుకోవాలని, సరిచేసుకోవటానికి తగు జాగ్రత్తలు తీసుకోవాలని కొత్త మార్గదర్శకాలు దిశా నిర్దేశం చేస్తున్నాయి.

అధిక రక్తపోటు చడీచప్పుడు లేకుండా శరీరాన్ని దెబ్బతీస్తుంది. నియంత్రణలో లేకపోతే గుండెపోటు, పక్షవాతం, గుండె వైఫల్యం, కిడ్నీ జబ్బులు, విషయ గ్రహణ సామర్థ్యం క్షీణించటం, మతిమరుపు వంటి సమస్యలెన్నో చుట్టుముడతాయి. అందువల్ల దీన్ని తేలికగా తీసుకోవటానికి లేదు. ఉప్పు తగ్గించటం, వ్యాయామం చేయటం, బరువు అదుపులో ఉంచుకోవటం, మానసిక ఒత్తిడిని తగ్గించుకోవటం వంటి జాగ్రత్తలు తప్పనిసరి. అవసరమైతే వీలైనంత త్వరగా మందులు ఆరంభించటం మంచిదని అమెరికన్ హార్ట్ అసోసియేషన్ కొత్త మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. తాజా శాస్త్రీయ రుజువుల ఆధారంగా రూపొందించిన వీటిల్లోని కీలకాశాలేంటో ఓసారి చూద్దాం.

**కొలతలు అవే**

అధిక రక్తపోటు కొలతలు ఏమీ మారలేదు. 2017 నాటి మార్గదర్శకాలే ఇప్పుడూ కొనసాగించారు.

నార్మల్– 120/80 కన్నా తక్కువ

అధికం– 120/80 నుంచి 129/80

ఒకటో దశ అధిక రక్తపోటు– 130/80 నుంచి 139/89

రెండో దశ అధిక రక్తపోటు– 140/90, అంతకన్నా ఎక్కువ

**మందులు మాత్రం కచ్చితంగా..**

ప్రస్తుతం రక్తనాళాల్లో పూడికలు, పక్షవాత లక్షణాలు, మధుమేహం, కిడ్నీజబ్బులు, ఊబకాయం వంటి ముప్పు కారకాలుండి.. వచ్చే పదేళ్లలో గుండెజబ్బు వచ్చే అవకాశం 10% కన్నా ఎక్కువగా ఉన్నవారికి రక్తపోటు 130/80 కన్నా మించితే డాక్టర్లు మందులు మొదలెడుతున్నారు. మిగతావారికి రక్తపోటు అదేపనిగా 140/90 కన్నా ఎక్కువుంటే మందులిస్తున్నారు. 130/80 నుంచి 140/90 మధ్యలో ఉన్నవారికి జీవనశైలి మార్పులే సూచిస్తున్నారు. అయితే వీరి విషయంలో మరింత శ్రద్ధ అవసరమని.. జీవనశైలి మార్పులతో 3–6 నెలల్లో ఎలాంటి ఫలితమూ కనిపించకపోతే మందులు మొదలెట్టాలని కొత్త మార్గదర్శకాలు సూచిస్తున్నాయి. వచ్చే పదేళ్లలో గుండెజబ్బు ముప్పు అంచనా 7.5%, అంతకన్నా ఎక్కువున్నా.. మధుమేహం వంటి గుండెజబ్బు ముప్పు కారకాలున్నా దీన్ని కచ్చితంగా పాటించాలని చెబుతున్నాయి.

ఇప్పటివరకూ 140/90 దాటినవారికి ఒక మందుతో మొదలెట్టి, రక్తపోటు తగ్గకపోతే మోతాదు పెంచుతున్నారు. అప్పటికీ ఫలితం లేకపోతే రెండో మందు జత చేస్తున్నారు. వీరికి మొదట్నుంచే రెండు మందులను ఆరంభించాలని కొత్త మార్గదర్శకాలు చెబుతున్నాయి. వీటిని విడివిడిగానైనా, కాంబినేషన్ మాత్రగానైనా ఇవ్వచ్చు. దీంతో త్వరగా రక్తపోటు అదుపులోకి వస్తున్నట్టు ప్రయోగ పరీక్షలు సూచిస్తుండటం గమనార్హం.

గర్భిణుల విషయంలోనూ రక్తపోటు 140/80, అంతకన్నా ఎక్కువుగా ఉంటే చికిత్స ఆరంభించటమే మంచిది. వీరిలో రక్తపోటును కచ్చితంగా అదుపులో ఉండేలా చూసుకుంటే గుర్రపువాతం, గర్భవాతం, పక్షవాతం, కిడ్నీజబ్బులు, నెలలు నిండకముందే కాన్పు కావటం వంటి తీవ్ర దుష్ప్రభావాలు తగ్గుముఖం పడుతున్నట్టు అధ్యయనాలు సూచిస్తున్నాయి. కాన్పు తర్వాతా అధిక రక్తపోటు కొనసాగే అవకాశం ఉండటం వల్ల పర్యవేక్షించటం, సరైన సమయంలో చికిత్స చేయటమూ ముఖ్యమే. వీరు కనీసం ఏడాదికి ఒకసారైనా రక్తపోటు పరీక్ష చేయించుకోవాలి.

రక్తపోటు 180/120 ఉన్నట్టయితే (గర్భిణులు మినహా) చాలా తీవ్రమైన సమస్యగా పరిగణించాలి. మరింత కచ్చితంగా చికిత్స చేయాలి.

**ఇంటి పరీక్షలకూ ప్రాధాన్యం**

ఆసుపత్రిలో రక్తపోటు పరీక్ష చేస్తే కొన్నిసార్లు ఎక్కువగా తేలొచ్చు. అక్కడి వాతావరణం, వేచి ఉండటం, డాక్టర్‌ను చూడగానే ఆందోళనకు గురికావటం వంటివి దీనికి కారణమవుతుంటాయి. ఇంట్లో బాగా విశ్రాంతిగా ఉన్నప్పుడు పరీక్షించుకుంటే రక్తపోటు కచ్చితంగా తెలుస్తుంది. అందుకే ఇంటి పరీక్షకు ప్రాధాన్యం ఇవ్వాలని కొత్త మార్గదర్శకాలు చెబుతున్నాయి. కాకపోతే నాణ్యమైన బీపీ కొలత పరికరాలు వాడటం, సరైన పద్ధతిలో పరీక్షించుకోవటం ముఖ్యం. డాక్టర్లు, నర్సుల వద్ద నేర్చుకొని దీన్ని పాటిస్తే మంచి ఫలితం కనిపిస్తుంది.

రక్తపోటును కొలవటానికి ఇప్పుడు స్మార్ట్‌వాచ్‌ల వంటి పరికరాలున్నాయి. అయితే ఇవి అంత కచ్చితమైనవి, విశ్వసనీయమైనవి కావు. కాబట్టి పట్టీతో కూడిన నాణ్యమైన పరికరాలతోనే రక్తపోటు కొలుచుకోవాలి.

**ఉప్పు తగ్గించటం ముఖ్యం**

అధిక రక్తపోటు గలవారు రోజుకు 2.3 గ్రాముల వరకూ ఉప్పు (సోడియం) తీసుకోవచ్చని ఇప్పటివరకూ అనుకునేవారు. దీన్ని 1.5 గ్రాములకే పరిమితం చేయటం మంచిదని కొత్త మార్గదర్శకాలు నిర్దేశిస్తున్నాయి. ఉప్పు మరీ తక్కువైతే ఎలా? అనుకునేవారు కిడ్నీజబ్బులేవీ లేకపోతే పొటాషియం ఆధారిత సైంధవ లవణం వంటి ప్రత్యామ్నాయ ఉప్పులు వాడుకోవచ్చు. అలాగని వీటిని ఎక్కువగా తింటామంటే కుదరదు. పరిమితి తప్పనిసరి.

**కొన్ని పరీక్షలూ తప్పనిసరి**

అధిక రక్తపోటు గలవారంతా మూత్రంలో అల్బుమిన్, క్రియాటినైన్ నిష్పత్తి పరీక్ష చేయించుకోవాలి. కిడ్నీ ఆరోగ్యాన్ని తెలుసుకోవటానికిది తోడ్పడుతుంది. గురక (స్లీప్ అప్నియా) గలవారితో పాటు చాలామందికి రక్తంలో ఆల్డోస్టిరాన్, రెనిన్ నిష్పత్తి ముందస్తు పరీక్ష కూడా అవసరం. అడ్రినల్ గ్రంథులు మరింత అధికంగా ఆల్డోస్టిరాన్‌ను ఉత్పత్తి చేయటం

# టెస్టోస్టిరాన్‌కు ప్రాసెస్ పదార్థాల దెబ్బ


చిప్స్, చాక్లెట్లు, బిస్కట్లు, ఇన్‌స్టంట్ నూడుల్స్, ప్యాకెట్లలో అమ్మే పదార్థాల వంటివి తింటున్నారా? కూల్‌డ్రింక్స్, శక్తి పానీయాల వంటివి తాగుతున్నారా? మరోసారి ఆలోచించుకోండి. అతిగా ప్రాసెస్ చేసి, తయారుచేసే ఇలాంటి ఆహార పదార్థాల మూలంగా యువకుల్లో మరింత కొవ్వు పెరుగుతున్నట్టు యూనివర్సిటీ ఆఫ్ కోపెన్‌హాగెన్ తాజా అధ్యయనం పేర్కొంటోంది. అంతేకాదు, వీటిని ప్యాక్ చేయటానికి వాడిన ప్లాస్టిక్ నుంచి పుట్టుకొచ్చే రసాయనాలతో



టెస్టోస్టిరాన్‌తో పాటు సంతానం కలగటానికి తోడ్పడే ఇతర హార్మోన్లూ తగ్గుతున్నాయనీ హెచ్చరిస్తోంది. గత 50 ఏళ్లుగా ఊబకాయం, మధుమేహం గణనీయంగా పెరిగాయి. అదే సమయంలో వీర్యం నాణ్యతా పడిపోతోంది. దీనికి ఒక కారణం అతిగా ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తుల మీద ఎక్కువగా ఆధారపడటం కావొచ్చని భావిస్తున్నారు. వీటి దుష్ప్రభావాలు ఉత్పత్తి ప్రక్రియ పద్ధతులతోనా, ఇందుకు వాడే పదార్థాలతోనా, లేకపోతే ఎక్కువగా తినటంతో తలెత్తుతున్నాయా? అనే దానిపై శాస్త్రవేత్తలు ఇంకా చర్చిస్తూనే ఉన్నారు. దీని విషయంలో తాజా అధ్యయనం కొత్త విషయాన్ని వెలుగులోకి తెచ్చింది. ఒక మాదిరిగా ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తులతో పోలిస్తే, అతిగా ప్రాసెస్ చేసిన వాటితో ఎక్కువగా బరువు పెరుగుతున్నట్టు బయటపడింది. అదీ ఈ రెండు రకాల్లో క్యాలరీలు సమానంగా ఉన్నప్పటికీ. వీర్యం నాణ్యతను దెబ్బతీసే కాలుష్య కారకాలూ వీరిలో ఎక్కువగా ఉంటున్నట్టూ తేలింది. మరీ ఎక్కువగా తినకపోయినా కూడా అతిగా ప్రాసెస్ చేసిన ఆహార ఉత్పత్తులతో సంతాన సామర్థ్యం, జీవక్రియ ఆరోగ్యం దెబ్బతింటున్నట్టు ఫలితాలు సూచిస్తున్నాయని అధ్యయనానికి నేతృత్వం వహించిన జెస్సికా ప్రెస్టన్ చెబుతున్నారు.

# వయసు మందకొడి

వయసుతోపాటుకదలికలు,చురుకుదనంతగ్గటం వంటి మార్పులు సహజమే. అయినప్పటికీ ఇందుకు జబ్బులేవైనా కారణమవుతున్నాయేమో చూడటమూ ముఖ్యమే. ఉదాహరణకు– కొద్దికాలంలోనే మందగొడిగా తయారైనా, తీవ్రమవుతున్నా ఆలోచించాల్సిందే. వృద్ధాప్యం ముంచుకొస్తున్నకొద్దీ చురుకైన, సమన్వయంతో కూడిన కదలికల మీద చాలా అంశాలు ప్రభావం చూపుతాయి మరి.



వినికిడి, చూపు, స్పర్శ తగ్గటం: వినికిడి లోపం.. చూపు తగ్గటం, చుట్టుపక్కల దృశ్యాలు సరిగా కనిపించకపోవటం, లోతు తెలియక పోవటం.. చేతులు, పాదాల్లో స్పర్శజ్ఞానం తగ్గటం కదలికల మీద గణనీయమైన ప్రభావం చూపుతాయి.

నాడీ వ్యవస్థ మార్పులు: మెదడు, వెన్నెపాము.. స్పర్శ, చలన నాడులు మారటం మూలంగా విశదీకరణ వేగం నెమ్మదిస్తుంది. అడ్డంకులకు, ఆటంకాలకు ప్రతిస్పందించే సామర్థ్యం తగ్గుముఖం పడుతుంది.

కండర బలం, శక్తి, సాగే గుణం తగ్గటం: వృద్ధులు శరీర నియంత్రణ మీద పట్టు కోల్పోతుంటారు. అటక మీద వస్తువులను పెడుతున్నప్పుడు అవి చేతుల్లోంచి జారిపోవటమూ చూస్తుంటాం. దీనికి కారణం కండరాలు మునుపటిలా ఆయా పనులకు అనుగుణంగా సహకరించకపోవటమే.

తూలిపోవటం: శరీరం స్థిరంగా ఉండే ప్రక్రియ చాలా సున్నితమైంది. ఇందుకు లోపలి చెవి, మెదడులోని భాగాలు సహకరిస్తుంటాయి. వయసు మీద పడుతున్నప్పుడు ఇవి అంత సమర్థంగా పనిచెయ్యవు. దీంతో తూలిపోయే ముప్పు ఎక్కువ.మందులు: కొన్నిరకాల యాంటీహిస్టమిన్లతో మగత రావటం, కొన్ని రక్తపోటు మందులతో తల తిప్పటం, తేలిపోవటం వంటివీ చురుకుదనం తగ్గేలా చేయొచ్చు.

ఏకాగ్రత కొరవడటం: దీని మూలంగా వస్తువులు జారిపోవటం, దేనికో ఒకదానికి ఢీకొనటం, కింద పడిపోవటం వంటి ఇబ్బందులు ఎదురవుతాయి.

జబ్బుల ప్రభావం: కీళ్లనొప్పి, మధుమేహం, పార్కిన్సన్స్ వంటి దీర్ఘకాల జబ్బులూ మందకొడితనం మరింత ఎక్కువయ్యేలా చేస్తాయి.


జాగ్రత్తలు అవసరం వయసుతో పాటు తలెత్తే ఇలాంటి మార్పుల్లో చాలావాటిని వెనక్కి తిప్పటం సాధ్యం కాదు. అయినప్పటికీ చురుకుదనం పెంచుకోవటానికి, గాయాలు కాకుండా చూసుకోవటానికి మార్గాలు లేకపోలేదు.

చేతి పట్టు బలాన్ని పెంచుకోవటానికి, చలన నైపుణ్యాలను మెరుగుపరచుకోవటానికి ప్రయత్నించాలి. టెన్నిస్ బంతిని రోజుకు రెండు, మూడు సార్లు నొక్కటం.. తరచూ వేళ్లను మృదువుగా సాగదీయటం.. చొక్కా గుండీలను పెట్టటం, తీయటం.. జిగ్‌సా పజిళ్లు పూరించటం వంటివి ఇందుకు తోడ్పడతాయి.శారీరకంగా చురుకుగా ఉండాలి. క్రమం తప్పకుండా వ్యాయామం చేయాలి. వీటిల్లో శరీరాన్ని స్థిరంగా ఉంచటానికి తోడ్పడే యోగా వంటివీ ఉండేలా చూసుకోవాలి. వారానికి రెండు మూడు సార్లు రబ్బరు పట్టీలను లాగటం వంటివీ చేయాలి. ఇవి కండరాలు బలంగా ఉండటానికి తోడ్పడతాయి.గాఢ నిద్రకు ప్రాధాన్యమివ్వాలి. ఎందుకంటే కంటి నిండా నిద్ర పట్టకపోతే ఏకాగ్రత, స్థిరత్వం తగ్గుతాయి. దీంతో మందకొడితనం ఎక్కువయ్యే అవకాశముంది.

# ఆ క్షణం ఆగితే ...

అలా చేసి ఉండకపోతే బాగుండేది'. ఆత్మహత్యకు పాల్పడి, అదృష్టవశాత్తూ ప్రాణాలతో బయటపడిన వారి నోటి నుంచి వచ్చే మొదటి మాట ఇదే. తాము చేసిన పనికి చింతించే వాళ్లే ఎక్కువ. ఆ క్షణం ఆగి, కాసేపు వివేచనతో ఆలోచించగలిగితే బలవన్మరణాలు చాలావరకూ తగ్గుతాయనటంలో సందేహం లేదు.

ఉన్నది ఒక్కటే జీవితం. ఏం సాధించినా అందులోనే. అలాంటి అమూల్యమైన జీవితాన్ని క్షణికావేశంలో చేజేతులా కాల్చుకుంటే? కథ అక్కడితోనే సమాప్తమవుతుంది! తమ మీద ఆధారపడ్డవారిని, తమ మీదే ఆశలు పెట్టుకొని జీవిస్తున్నవారిని రోడ్డున పడేసినట్టే అవుతుంది.



ప్రతి ఒక్క మరణమూ సామాజికంగా, భావోద్వేగపరంగా, ఆర్థికంగా విపరీత ప్రభావం చూపుతుంది. అందుకే వీటిని నివారించటం ప్రతిఒక్కరి బాధ్యత, కర్తవ్యం. వరల్డ్ సూసైడ్ ప్రివెన్షన్ డే ఇదే సూచిస్తోంది. మనసు విప్పి మాట్లాడుకునే వాతావరణం కల్పించటం, సానుభూతి చూపటం, దన్నుగా నిలవటం ద్వారా ఆత్మహత్యలను నివారించాలని నినదిస్తోంది.

**అన్నీ నివారించదగినవే**

ప్రపంచవ్యాప్తంగా ఏటా సుమారు 8 లక్షల మంది బలవన్మరణాలకు పాల్పడుతుండగా.. వీరిలో 1.71 లక్షల మంది మనదేశానికి చెందినవారే! నిజానికివన్నీ నివారించదగ్గ మరణాలే. ఒకింత సంయమనంతో వ్యవహరిస్తూ, సానుకూల దృక్పథంతో ఆలోచించగలిగితే వీటిని చాలావరకు ఆపేయొచ్చు. ఏదో సాధించాలనే తపన.. ఏమీ సాధించలేదేనన్న నిరాశ.. ఇంకేమీ సాధించలేమోనన్న నిస్పృహ.. ఇలాంటి స్థితిలోనే ఎంతోమంది నిండు జీవితాలను ఛిద్రం చేసుకుంటున్నారు. పరీక్షలో మార్కులు తక్కువ వచ్చాయనో.. భార్యతోనో, భర్తతోనో పొరపొచ్చాలు తలెత్తాయనో.. చిన్న చిన్న సమస్యలకే కుంగిపోయి బలవన్మరణాలకు పాల్పడటం ఎంతవరకు సమంజసం? తాము పోయినంత మాత్రాన సమస్యలు మాయమవుతాయా? ఆత్మహత్యలకు తెగబడే ముందు ఒక్క క్షణం ఆగి, తమను తాము ప్రశ్నించుకుంటే ఎన్నో జీవితాలు నిలబడతాయి.

**మానసిక సమస్యలు ప్రధానం**

ఆత్మహత్యలతో ప్రాణాలు పోగొట్టుకుంటున్నవారిలో 90% మంది ఎప్పుడో అప్పుడు ఏదో ఒక మానసిక సమస్యతో బాధపడ్డవారే! వీటిల్లో ప్రధానమైంది కుంగుబాటు (డిప్రెషన్). దీని బారినపడ్డవారు తీవ్రమైన నిరాశా నిస్పృహల్లో కూరుకుపోయి, దేనికీ పనికిరామని భావిస్తుంటారు. ప్రతిదీ నిష్ప్రయోజనంగా తోస్తుంది. భవిష్యత్తు కనిపించదు. సమస్య తీవ్రమవుతున్న కొద్దీ తాము బతికి ప్రయోజనం లేదనే ఆలోచన మనసును తొలిచేస్తుంటుంది. దీన్ని గుర్తించి, సరైన చికిత్స తీసుకోకపోతే ఆత్మహత్యలకూ ప్రేరేపించొచ్చు. కొందరు జన్యుపరంగా కుంగుబాటుకు లోనవుతుంటారు. ఇలాంటి వారిలో కొందరు కుంగుబాటు లక్షణాలు.. తీవ్రమైన కష్టాలు, ఇబ్బందులేవీ లేకపోయినా ఆత్మహత్యలకు ఒడిగడుతుంటారు. మెదడులో సెరటోనిన్ స్థాయులు తగ్గటమూ కుంగుబాటుకు దారితీయొచ్చు. స్కిజోఫ్రినియా, బైపోలార్ డిజార్డర్ వంటి సమస్యలూ ఆత్మహత్యల ముప్పును పెంచొచ్చు.

**మూడు రకాలు..**

ఆత్మహత్యలు ఎక్కువగా 15–24 ఏళ్లు, 45–60 ఏళ్ల వారిలో కనిపిస్తుంటాయి. నిజానికి ఆత్మహత్య ఆలోచన మనసులో మెదిలినా చాలామందిలో అక్కడితోనే ఆగిపోతుంది. కొందరు మాత్రం దాన్నుంచి బయటపడలేక, రకరకాల ప్రయత్నాలు, సన్నాహాలు చేసుకుంటూ.. చివరికి ఆత్మహత్యకు ఒడిగడుతుంటారు. ఇంకొందరు కోపంతోనో, సహనం నశించో విచక్షణ కోల్పోయి అప్పటికప్పుడు అఘాయిత్యానికి పాల్పడుతుంటారు (ఇంపల్సివ్ సూసైడ్).

బాత్రూమ్, పడకగదిలో మరీ ఎక్కువసేపు ఉండటం వంటి అనుమానాస్పద పరిస్థితుల్లో గడియ పగలగొట్టి అయినా లోపలికి వెళ్లి చూడాలి. ఏమాత్రం సంకోచం పనికిరాదు.

ఇప్పుడు ఆత్మహత్యల నివారణకు అన్నిచోట్లా సహాయ కేంద్రాలు ఉన్నాయి. ఫోన్ కాల్‌తోనూ సాయం చేస్తాయి. వీటిల్లో ఆత్మహత్యలకు పాల్పడేవారు చెప్పే మాటలను శ్రద్ధగా వింటూ, సానుభూతి చూపిస్తారు. ఇలా మాట్లాడే క్రమంలోనే మనసు మార్చుకునే వాళ్లు ఎందరో.

**నివారణ మార్గాలున్నాయి**

కుంగుబాటుతో బాధపడుతున్నా యుక్తవయసు పిల్లలకు దాని గురించి తెలియదు. నిరాశా నిస్పృహలకు లోనవుతూ, ఏదో ఒక బలహీన క్షణాన తీవ్ర సాహసానికి ఒడిగడుతుంటారు. దీన్ని గుర్తించటం కీలకం. దీర్ఘకాలంగా హుషారు, సంతోషం లోపించటం.. రోజువారీ పనులనూ సరిగా చేసుకోలేకపోవటం, నలుగురితో కలివిడిగా లేకపోవటం వంటివన్నీ కుంగుబాటు సంకేతాలే.

# కాన్పుసూదితో నడుం నొప్పా?



ప్రసవ సమయంలో నొప్పి తెలియకుండా ఉండటానికి డాక్టర్లు నడుము వద్ద సూది మందు ఇస్తుండటం తెలిసిందే. దీని మూలంగా నడుం నొప్పి వస్తోందని చాలామంది మహిళలు చెప్పటం, ఎముకల నిపుణులను సంప్రదించటం చూస్తూనే ఉంటాం. నిజానికి నెలలు, ఏళ్ల తర్వాత తలెత్తే దీర్ఘకాల నడుం నొప్పికి.. కాన్పు సమయంలో ఇచ్చే సూదికి సంబంధం లేదు. సూదితో నడుం నొప్పి వస్తోందని అనుకోవటం కేవలం అపోహే. లావు సూది వాడటం, అది కండర బంధనాలను చీల్చుకొని లోపలికి వెళ్లటం వల్ల తొలిరోజుల్లో కొందరికి కాస్త నొప్పి కలిగితే కలగొచ్చు. ఇదీ రెండు, మూడు రోజుల్లోనే తగ్గిపోతుంది. అరుదుగా సూదితో వెన్ను పొరకు చిన్న చిల్లుపడినా, రెండు మూడు సార్లు సూది ఇచ్చినా ఒకట్రెండు వారాల వరకూ నొప్పి ఉండొచ్చు. అంతే తప్ప దీర్ఘకాల నడుం నొప్పికేమీ దారితీయదు. మరి మహిళల్లో నడుం నొప్పి ఎందుకొస్తుంది? కడుపు భాగం, నడుం చుట్టూరా ఉండే కండరాలు బలహీనం కావటం.. బరువు పెరగటం, పిల్లలను ఎత్తుకోవటం, పాలు పట్టటానికి ఒకవైపు తిరిగి ఎక్కువసేపు అలాగే పడుకోవటం, వంగి చేసే పనులు ఎక్కువ కావటం, ప్రసవం తర్వాత తలెత్తే హార్మోన్ల మార్పులతో కీళ్లలో కాస్త స్థిరత్వం తగ్గటం, కాన్పు సమయంలో కటి కండరాలు సాగటం, కదలికలు తగ్గటం వంటివి కారణం కావొచ్చు. ఊబకాయం, అధిక బరువు గలవారికి, పొట్టిగా ఉండేవారికి, అప్పటికే డిస్క్ సమస్యలతో బాధపడేవారికిది వచ్చే అవకాశం ఎక్కువ. విటమిన్ డి లోపం, శారీరక శ్రమ తగ్గటం, ఎక్కువసేపు కూర్చొని పనులు చేయటం వల్ల కండరాలు బిగుసుకుపోవటమూ నొప్పికి దోహదం చేయొచ్చు. కొత్తగా డిస్క్ సమస్యలు బయలుదేరినా, అంతకుముందు ఉన్నవి తీవ్రమైనా నడుం నొప్పి తీవ్రం కావటం గమనిస్తుంటాం. కాన్పు సమయంలో ఇచ్చే సూది, దీర్ఘకాల నడుం నొప్పి మీద దిల్లీలోని ఎయిమ్స్‌లో 5వేల మందిపై అధ్యయనం నిర్వహిస్తున్నారు. వీటి మధ్య సంబంధం లేదనే ప్రాథమిక ఫలితాలు సూచిస్తున్నాయి. తుది ఫలితాలు త్వరలో వెలువడనున్నాయి. కాన్పు తర్వాత కడుపు, నడుం కండరాలను బలోపేతం చేసే వ్యాయామాలతో మున్ముందు నడుంనొప్పి రాకుండా చూసుకోవచ్చు.



# అలాంటి పిచ్చి చేష్టలు చేయొద్దు...

: ఒక సినిమా ఆశించిన ఫలితాన్ని ఇవ్వకపోతే నిరుత్సాహపడొద్దని, తప్పెక్కడ జరిగిందో గ్రహిస్తే మరో ప్రయత్నంతో విజయం అందుకోవచ్చని వర్ధమాన దర్శకులకు మారుతి సలహా ఇచ్చారు. తన సినిమాని ప్రేక్షకులు చూడటం లేదంటూ తనను తాను చెప్పుతో కొట్టుకున్న 'త్రిబాణధారి బార్బరిక్' ) దర్శకుడి గురించి ప్రస్తావించారు. తన నిర్మాణ సంస్థలో రూపొందిన 'బ్యూటీ' సినిమా ప్రీ రిలీజ్ ఈవెంట్‌లో మాట్లాడారు."'బ్యూటీ' మూవీ రైటర్ సుబ్రహ్మణ్యం నాకెప్పటి నుంచో తెలుసు. ఈ కథ ఆయనదే అయినా దర్శకత్వ బాధ్యతలను మరొకరికి ఇవ్వగలిగారు. 'భలే ఉన్నాడే' సినిమా ఫెయిల్యూర్‌తో బాధపడున్న శివ సాయివర్ధన్‌కు ఆ అవకాశం ఇప్పించా. ఎవరైనా బాధలో ఉంటే నా వంతు ప్రోత్సాహం ఇవ్వాలనుకుంటా""'ది రాజాసాబ్' షూటింగ్‌తో నేనెంత బిజీగా ఉన్నా నిర్మాత విజయ్‌పాల్‌తో తరచూ మాట్లాడేవాడిని. ఆయన నిర్మాణంలో మోహన్ శ్రీవత్స తెరకెక్కించిన 'త్రిబాణధారి బార్బరిక్' టైటిల్ విషయంలో ఎన్నో సలహాలిచ్చా. బార్బరిక్ అంటే ఎక్కువ మందికి చేరువ కాకపోవచ్చు అంటూ కొన్ని పేర్లను మోహన్‌కు సూచించేవాడిని. కానీ, ఆయన ఒక ట్రాన్స్‌లో ఉండిపోయారు. ఆ టైటిల్‌తోనే రిలీజ్ అయింది. మంచి సినిమాని ప్రేక్షకులు చూడటం లేదంటూ ఆయన చెప్పుతో కొట్టుకోవడం బాధ కలిగించింది.

డైరెక్టర్లు, కళాకారులు దయచేసి అలాంటి పిచ్చి చేష్టలు చేయొద్దు. ఆడియన్స్‌ను థియేటర్లకు తీసుకొచ్చేందుకు కొందరు అసభ్య పదజాలంతో ప్రమోషన్స్ చేస్తున్నారు. మరికొందరు సినిమాలే మానేస్తాం అంటున్నారు. ఒక సినిమా అనుకున్నంతగా ప్రదర్శితం కాకపోతే ఇంతకు దిగజారుతారా? ఒకటి కాకపోతే మరొక సినిమా హిట్ అవుతుంది. కాంట్రవర్సీగా మాట్లాడితేనే తమ సినిమాపై ప్రేక్షకుల దృష్టి ఉంటుందని పలువురు అనుకుంటున్నారు"

"కుటుంబ సమేతంగా ప్రేక్షకుడు సినిమా చూడాలన్న ఉద్దేశంతోనే నేను ద్వంద్వార్థ సంభాషణలు రాయడం మానేశా. ఒకప్పుడు నాపై 'బూతు డైరెక్టర్' ముద్రేశారు. ఇప్పుడు రూ.400 కోట్లతో ప్రభాస్‌తో 'ది రాజాసాబ్' తీస్తున్నా. ఇలాంటి ప్రయాణాన్ని గమనించండి" అని విజ్ఞప్తి చేశారు.



# హంగులు మితిమీరొద్దు బలమైన కథలే ముద్దు



ఇప్పుడు అన్ని చిత్రసీమలూ పాన్ ఇండియా మంత్రాన్నే జపిస్తున్నాయి. అగ్రతారల సినిమాలన్నీ పాన్ ఇండియాలైపోతున్నాయి. ఈ మోజులో నిర్మాతలూ వెనకా ముందు చూసుకోకుండా బడ్జెట్‌లు పెంచుకుంటూ పోతున్నారు. 'ఈ స్టార్ ఆకర్షణలు, భారీ హంగులెన్ని ఉన్నా.. ప్రేక్షకుల్ని థియేటర్లలో కూర్చోబెటగలిగేది బలమైన కథే' అన్నది దర్శక నిర్మాతలు మర్చిపోతున్నారు. దీంతో రూ.వందల కోట్లతో ముస్తాబవుతున్న సినిమాలన్నీ బాక్సాఫీస్ ముందు బోర్లా పడుతున్నాయి. మితిమీరిన హంగులతో బడ్జెట్ పెరగడంతో నిర్మాతలు, డిస్ట్రిబ్యూటర్లు, ఎగ్జిబిటర్లకు భారీ నష్టాలు వస్తున్నాయి. అదే సమయంలో బలమైన కథతో తక్కువ బడ్జెట్‌లో తెరకెక్కిన చిత్రాలు ప్రేక్షకుల్ని ఆకట్టుకుంటున్నాయి. హంగుల కంటే బలమైన కథే ముఖ్యమని చాటుతున్నాయి.

ఈ ఏడాది భారతీయ చిత్రసీమలో ప్రతి భాష నుంచి పదుల సంఖ్యలో పాన్ ఇండియా సినిమాలు తెరపైకి వచ్చాయి. వీటిలో రూ.200కోట్ల నుంచి రూ.500కోట్ల బడ్జెట్‌తో నిర్మితమైన చిత్రాలు డజను దాకా ఉన్నాయి. ఈ మధ్య వచ్చిన 'కూలీ', 'వార్ 2' నుంచి మొదలు 'గేమ్ ఛేంజర్', 'థగ్ లైఫ్', 'సికందర్', 'హౌస్‌ఫుల్ 5', 'ఎల్2 ఎంపురాన్', 'హరి హర వీరమల్లు' మొదలైనవన్నీ ఈ జాబితాలోకే వస్తాయి. వాటి తారాగణం.. వరల్డ్ సెటప్.. సెట్లు, గ్రాఫిక్స్ హంగులు.. ఇలా ఏ కోణంలో చూసినా అవన్నీ ప్రేక్షకుల్లో అంచనాల్ని ఆకాశమంత ఎత్తుకు తీసుకెళ్లినవే. కానీ, కథ పరంగా చూసినప్పుడు ఆ అంచనాలను అందుకోలేకపోయాయి. అందుకే ఇవన్నీ విడుదలకు ముందు రూ.1000కోట్ల వసూళ్లు పక్కా అని ఊరించినా.. తెరపైకి వచ్చాక ప్రేక్షకుల తీర్పుతో ఆరంభ వసూళ్లతోనే సరిపెట్టుకున్నాయి.

"చిన్న సినిమా 'సైయారా'తో దక్కిన భారీ విజయం బాలీవుడ్ బాక్సాఫీస్‌కు పునరుజ్జీవాన్నిచ్చింది. కానీ, ఆ తర్వాత 'వార్ 2', 'కూలీ' లాంటి భారీ బడ్జెట్ చిత్రాల నిరాశపరిచిన ప్రదర్శన వల్ల మళ్లీ ఆందోళనకర పరిస్థితులు ఏర్పడ్డాయ"ని బాలీవుడ్ ఎగ్జిబిటర్లు, డిస్ట్రిబ్యూటర్లు తెలిపారు. ఆ రెండు చిత్రాలకు స్టార్ ఆకర్షణలు ఉన్నప్పటికీ.. స్క్రిప్ట్‌లలో తాజాదనం, బలమైన కంటెంట్ లేకపోవడం ప్రధాన లోపమని వాళ్లు అభిప్రాయపడ్డారు.

## కథా బలం.. వసూళ్ల వర్షం

"పాన్ ఇండియా చిత్రాల్ని స్టార్ల ద్వారా సృష్టించే ధోరణి తొలి రోజు భారీ వసూళ్లను అందించగలదు కానీ, నిజమైన విజయం కేవలం కంటెంట్ ద్వారానే నిర్ణయించబడుతుంద"ని అన్నారు కార్మిక్ ఫిల్మ్ సహ-స్థాపకుడు, దర్శకుడు సునీల్ వాధ్వా. పరిమిత బడ్జెట్‌లలో నిర్మితమై.. ఇటీవల బాక్సాఫీస్ ముందు భారీ విజయాల్ని దక్కించుకున్న 'మహావతార్ నరసింహ', 'సైయారా' విజయాలు దీనికి ఓ ఉదాహరణ అన్నారు. నిజానికి ఈ రెండింటిలోనూ స్టార్ మెరుపులు లేవు. అన్ని భాషలకు పరిచయమున్న తారాగణమూ లేదు. భావోద్వేగాలతో నిండిన బలమైన కథలే కనిపించాయి. అవి ప్రేక్షకుల్ని మెప్పించాయి. అందుకే ఆయా చిత్రాలు భారీ బడ్జెట్ సినిమాల్ని తలదన్నేలా రూ.వందల కోట్ల వసూళ్లతో సత్తా చాటాయి.

ఇవనే కాదు ఈ ఏడాది వివిధ భాషల్లో కథా బలంతో స్వచ్ఛమైన వినోదాలతో అంచనాల్ని మించి వసూళ్లు కొల్లగొట్టిన చిన్న, పరిమిత బడ్జెట్ చిత్రాలు చాలానే ఉన్నాయి. ఈ జాబితాలో తెలుగు నుంచి 'సంక్రాంతికి వస్తున్నాం', 'మ్యాడ్ స్క్వేర్', 'కోర్ట్', 'లిటిల్ హార్ట్స్' లాంటి చిత్రాలుండగా.. పరభాషల్లో 'తుడరుమ్', 'సు ఫ్రమ్ సో', 'లోక చాప్టర్ 1: చంద్ర', 'టూరిస్ట్ ఫ్యామిలీ', 'రేఖా చిత్రం', 'డ్రాగన్' లాంటివి కనిపిస్తాయి.

ఇవన్నీ ఎలాంటి పాన్ ఇండియా ట్యాగ్‌లు తగిలించుకోకున్నా.. నిర్మాతలు పెట్టిన ఖర్చుకు ఐదింతల నుంచి పదింతల లాభాల్ని అందించాయి. కమర్షియల్ హంగులు లేకున్నా.. బలమైన కథలుంటే బాక్సాఫీస్ బరిలో ఎలా మెరుపులు మెరిపించొచ్చో అందరికీ చూపించాయి.ఆశలన్నీ వాటిపైనే.. ప్రస్తుతం తేజ సజ్జా నటించిన 'మిరాయ్' పాన్ ఇండియా స్థాయిలో ప్రేక్షకుల్ని పలకరించింది. దీనికి ఇటు దక్షిణాదితో పాటు అటు ఉత్తరాది సినీ ప్రియుల నుంచి మంచి మౌత్ టాకే లభిస్తోంది. దీంతో ఇది వసూళ్ల పరంగా 'హను-మాన్' రికార్డుల్ని అధిగమించే అవకాశముందని సినీ విశ్లేషకులు అంచనా వేస్తున్నారు. ఇక మరోవైపు రానున్న రోజుల్లో 'ఓజీ', 'కాంతార:చాప్టర్ 1', 'ఇడ్లీ కడై', 'థామా', 'డెకాయిట్' లాంటి భారీ అంచనాలున్న చిత్రాలు థియేటర్ల ముందు వరుస కట్టనున్నాయి. వీటిలో కొన్ని హిట్టు కొట్టినా ఈ ఏడాది బాక్సాఫీస్‌కు అదిరే ముగింపు దక్కినట్లే.



# లాల్ సింగ్ చడ్డా రూ.200 కోట్ల నష్టం

# అదంతా బూడిదలో పోసిన పన్నీరే: ఆమిర్

తాను కీలక పాత్రలో నటించిన 'లాల్ సింగ్ చడ్డా' రూ.200 కోట్లకు పైగా నష్టాలను మిగిల్చిందని బాలీవుడ్ అగ్ర కథానాయకుడు ఆమిర్‌ఖాన్ అన్నారు. 'థగ్స్ ఆఫ్ హిందుస్థాన్' కన్నా ముందు అపజయాలను పెద్దగా చవిచూడని ఆమిర్ ఆ తర్వాత వరుస ఫ్లాప్‌లను ఎదుర్కొన్నారు. అదే పరంపర 'లాల్ సింగ్ చడ్డా'కు కొనసాగింది. తాజాగా యూట్యూబ్ ఛానల్ ఇంటర్వ్యూలో మాట్లాడుతూ.. పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నారు.

"నేను నిర్మించే ప్రతి సినిమా బడ్జెట్ విషయంలో జాగ్రత్తగా ఉండటం నాకు అలవాటు. కథకు ఏది అవసరమో దాన్నే ఎంపిక చేసుకుంటాను. ఈ సినిమా చేయడం వల్ల ఇంత లాభం వస్తుందనే విషయంపై కాకుండా నష్టాల పాలవ్వకుండా చూడటమే నా ప్రథమ కర్తవ్యం. దురదృష్టవశాత్తూ 'లాల్ సింగ్ చడ్డా' విషయంలో దానిని విస్మరించా. అప్పటివరకూ నేను చేసిన సినిమాలన్నీ హిట్ మీద హిట్ కొట్టడంతో ఈ మూవీ విషయంలో అతి నమ్మకం ఎక్కువైంది. కానీ, నా అంచనా తప్పింది. బడ్జెట్ విషయంలో పరిమితులు పెట్టుకోకపోవడంతో నష్టాలు మిగిల్చింది"

"దంగల్'కు ఇండియాలో రూ.385 కోట్లు వచ్చాయి. 'లాల్ సింగ్ చడ్డా' కనీసం రూ.100-200 కోట్లు వస్తాయని అనుకున్నా. ఈ అంచనాతోనే బడ్జెట్ వేసుకుని, సెట్స్‌పైకి వెళ్లాం. 'ఒక విషయం గుర్తు పెట్టుకోండి. మీ సినిమా రూ.120 కోట్లు వసూలు చేస్తుందని మీరు భావించినప్పుడు బడ్జెట్ రూ.80 కోట్లకు మించకుండా ప్లాన్ చేసుకోవాలి. రూ.50-60 కోట్ల మధ్య ఉంటేమరీ మంచిది'. కానీ, ఈ సినిమా ఫుల్ రన్ పూర్తయ్యేనాటికి రూ.200 కోట్ల నష్టాన్ని మిగిల్చింది. కరోనా సమయంలో దేశంలో ఆంక్షలు ఉండటంతో విదేశాల్లో షూటింగ్ చేద్దామని అనుకున్నాం. బడ్జెట్‌లో ఎక్కువ మొత్తం ప్రయాణాల మీద ఖర్చు చేశాం. దానివల్లే ఎక్కువ వృథా అయింది. చైనాలో టేబుల్ టెన్నిస్‌పై ఒక పెద్ద సీక్వెన్స్ తెరకెక్కించాం. ఫైనల్ ఎడిట్‌లో ఆ మొత్తం సీక్వెన్స్ తీసేశాం. ఆ ఖర్చంతా బూడిదలో పోసిన పన్నీరే" అని ఆమిర్ పేర్కొన్నారు. కరోనా తర్వాత సినిమా మేకింగ్ ఖర్చు పెరిగి పోయిందని.. అది కూడా తన సినిమాపై ప్రభావం చూపిందన్నారు. ఈ సినిమా చర్చల సమయంలోనే ఇది మెయిన్ స్ట్రీమ్ ఫిల్మ్ కాదని.. కథ, సబ్‌ప్లాట్స్ విషయంలో ఇబ్బందులున్నాయని దర్శకుడు అద్వైత్ చందన్‌కు చెప్పినట్లు వివరించారు'లాల్ సింగ్ చడ్డా 'లో ( నాగచైతన్య, కరీనా కపూర్‌ఖాన్, మోనా సింగ్, మానవ్ విజ్ తదితరులు కీలక పాత్ర పోషించారు. ఎన్నో అంచనాల మధ్య విడుదలైన ఈ మూవీ ప్రేక్షకులను మెప్పించలేకపోయింది. ఇటీవల 'మైదాన్' మేకింగ్ విషయంలోనూ భారీ నష్టాలను మూటగట్టుకున్నట్లు నిర్మాత బోనీ కపూర్ తన గోడును వెళ్లబోసుకున్నారు.




# క్లాసికల్ డ్యాన్సర్‌గా శ్రద్ధ?

జానపద ప్రపంచంలో తనదైన ముద్ర వేసిన మహారాష్ట్ర నృత్యకారిణి, గాయని విఠాబాయి భావు మంగ్ నారాయణ్ జీవితం తెరపైకి రాబోతున్నట్లు కొన్ని రోజులుగా వార్తలు వస్తోన్న సంగతి తెలిసిందే. ఈ ప్రాజెక్టులో బాలీవుడ్ కథానాయిక శ్రద్ధా కపూర్ ప్రధాన పాత్రలో నటిస్తుండగా, లక్ష్మణ్ ఉటేకర్ తెరకెక్కిస్తున్నారు. ఇంకా అధికారికంగా ప్రకటించని ఈ చిత్రంలోని తన పాత్ర కోసం శ్రద్ధ క్లాసికల్ డ్యాన్సర్‌గా శిక్షణ తీసుకుంటున్నట్లు సమాచారం. "ఈ చిత్రంతో మహారాష్ట్ర సంస్కృతిని జాతీయ స్థాయికి తీసుకెళ్లడానికి ప్రయత్నాలు చేస్తుంది చిత్రబృందం. ఇందులో క్లాసికల్ డ్యాన్సర్‌గా కనిపించనుంది శ్రద్ధ. ప్రస్తుతం దీని కోసం వర్క్ షాప్‌లకు హాజరవుతుందామె. నవంబరులో ఈ సినిమాను పట్టాలెక్కించనున్నార"ని శ్రద్ధ సన్నిహిత వర్గాలు తెలిపాయి. మరి 'స్త్రీ 2'తో దెయ్యంగా ప్రేక్షకుల్ని పరుగులు పెట్టించిన ఆమె.. క్లాసికల్ డ్యాన్సర్‌గా ఎలాంటి మ్యాజిక్ చేస్తుందో చూడాలి.




# అందరికీ నచ్చే చిత్రం... 'మిరాయ్'

మిరాయ్' విజయం మరెన్నో గొప్ప సినిమాలు చేయడానికి కావల్సినంత ఉత్సాహాన్ని ఇచ్చిందన్నారు ప్రముఖ నిర్మాత టి.జి.విశ్వప్రసాద్. తాము కథని ఎంతగానో నమ్మామని, అది నిజమైనందుకు ఆనందంగా ఉందన్నారు. ఆయన పీపుల్ మీడియా ఫ్యాక్టరీ పతాకంపై కృతిప్రసాద్‌తో కలిసి నిర్మించిన చిత్రం 'మిరాయ్'. తేజ సజ్జా, రితికానాయక్ జంటగా నటించారు. కార్తీక్ ఘట్టమనేని దర్శకుడు. శుక్రవారం ప్రేక్షకుల ముందుకొచ్చిన ఈ చిత్రం విజయవంతంగా ప్రదర్శితమవుతోంది. ఈ సందర్భంగా చిత్రబృందం శనివారం హైదరాబాద్‌లో థ్యాంక్స్ మీట్‌ని నిర్వహించింది.కథానాయకుడు తేజ సజ్జా మాట్లాడుతూ "సినిమాని గుండెల్లో పెట్టుకుని ఆదరిస్తున్నారు ప్రేక్షకులు. ఈ స్పందన ఎంతో ఆనందాన్నిచ్చింది. దర్శకనిర్మాతల కారణంగానే ఈ విజయం సాధ్యమైంది. మంచు మనోజ్ ఇందులో భాగం కావడంతో సినిమా మరోస్థాయికి వెళ్లింది. కథానాయిక రితికా, సంగీత దర్శకుడు హరి గౌరా ఈ సినిమాకోసమే రెండేళ్లు ప్రయాణం చేశారు. 'హను - మాన్' సినిమాకి రానా అందించిన సహకారం మర్చిపోలేను. ఈ సినిమా చూశాక కూడా ఏదైనా చేస్తానని ముందుకొచ్చారు. ఆయనకి ఏ లాభం లేకపోయినా మంచి సినిమా కోసం ముందుకొచ్చారు. గొప్ప నటులైన జగపతిబాబు, శ్రియ, జయరాం మా తపన చూసి మాతో ప్రయాణం చేశారు. కుర్రాళ్లని ప్రోత్సహించడంలో ఎప్పుడూ ముందుండే బంగారంలాంటి హృదయం ఉన్న వ్యక్తి ప్రభాస్. ఆయన ఈ కథని చెప్పడంతోనే సినిమాకి ఇంత బలం చేకూరింది. ఇందులో భాగమైన ప్రతి ఒక్కరికీ ధన్యవాదాలు. మిరాయ్ అందరికీ నచ్చే సినిమా, అందరూ థియేటర్లలో చూసి ఆస్వాదించే సినిమా" అన్నారు.మంచు మనోజ్ మాట్లాడుతూ "12 ఏళ్ల తర్వాత విజయంతో నా ఫోన్ మోగుతూ ఉంది. ఇదంతా కలలా ఉంది. ఈ కథలో నన్ను భాగం చేసిన దర్శకుడికి రుణపడి ఉంటాను. నేను పెరిగినట్టుగా నా పిల్లల్ని పెంచగలనా అని ఎప్పుడూ భయపడుతూ ఉండేవాడిని, ఆ భయాన్ని కార్తీక్ చంపేశారు.

# శంషాబాద్ లో 500 కోట్ల విలువైన 12 ఎకరాల ప్రభుత్వ భూమిని స్వాధీనం చేసుకున్న హైడ్రా

* ప్రహరీతో పాటు లోపల వేసిన షెడ్డుల తొలగింపు
* 12 ఎకరాల భూమి చుట్టూ హైడ్రా ఫెన్సింగ్
* ప్రభుత్వ భూమిగా పేర్కొంటూ హైడ్రా బోర్డు లు

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (భారతశక్తి) : ప్రభుత్వ భూముల పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వం సీరియస్గా పని చేస్తోంది. ఈ బాధ్యతను హైడ్రాకు అప్పగించిన ప్రభుత్వం, నగరంతో పాటు చుట్టుపక్కల ప్రభుత్వ భూముల కోసం జల్లెడ పడుతోంది. ఈ క్రమంలో ఇప్పటికే వందలాది ఎకరాలను స్వాధీనం చేసుకున్న హైడ్రా తాజాగా రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలంలో 500 కోట్ల రూపాయల విలువైన 12 ఎకరాల భూమిని శనివారం స్వాధీనం చేసుకుంది. రంగారెడ్డి జిల్లా శంషాబాద్ మండలం శాతంరాయ్ గ్రామంలోని సర్వే నంబర్ 17 లో కబ్జాకు గురైన ప్రభుత్వ భూమికి విముక్తి కల్పించింది. చుట్టూ నిర్మించిన ప్రహరీని, లోపల ఉన్న షెడ్డులను తొలగించింది.







### 12 ఎకరాల భూమి స్వాధీనం

ఈ భూమిని రాష్ట్ర ప్రభుత్వం 2011 లో ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ బోర్డుకు రాష్ట్ర ప్రభుత్వం కేటాయించింది. అయితే ఈ భూమి తమదంటూ స్థానికంగా నాయకులుగా చెలామణి అవుతున్న ఓ నాయకుడితో పాటు అనీష్ కన్స్ట్రక్షన్స్ అనే సంస్థ క్లెయిమ్ చేస్తోంది. ఈ మేరకు అక్కడ అనీష్ కన్స్ట్రక్షన్ సంస్థ బోర్డులు పెట్టింది. కబ్జాదారులు నిర్మాణాలు చేపట్టడానికి ప్రయత్నించడం తో స్థానికులు హైడ్రాకు ఫోటోలను పంపించారు. రాళ్ళు రప్పలతో వ్యవసాయ వినియోగానికి అవకాశం లేని ఈ ప్రభుత్వ భూమిలో వ్యవసాయం చేస్తున్నామంటూ.. అసఫ్ జాహీ పైగా కుటుంబ వారసుల నుంచి కొన్నామంటూ కబ్జాదారులు చెబుతున్నారు. బోర్డు ఆఫ్ ఇంటర్మీడియట్ ఎడ్యుకేషన్ అధికారులు కూడా యిదే సమయంలో హైడ్రాకు ఫిర్యాదు చేసారు. యిలా స్థానికులతో పాటు ఇంటర్మీడియట్ బోర్డు వారు యిచ్చిన ఫిర్యాదు మేరకు హైడ్రా రంగంలోకి దిగింది. స్థానిక రెవెన్యూ అధికారులతో కలసి క్షేత్రస్థాయిలో పరిశీలించింది.

* శంషాబాద్ మండలంలో పైగా భూములు లేవు

శంషాబాద్ పరిధిలో పైగా కుటుంబాలకు చెందిన భూములు లేవని రెవెన్యూ అధికారులు ధ్రువీకరించారు. వేరే చోట ఉన్న ఆ భూముల రికార్డులను యిక్కడ చూపించి కబ్జాలకు పాల్పడినట్టు పేర్కొన్నారు. అనీష్ కన్స్ట్రక్షన్స్ సంస్థకు చెందిన శ్రీపాద దేశ్ పాండే పలు భూముల వివాదాల్లో ఉన్నట్టు హైడ్రాకు ఫిర్యాదులు అందాయి. ఈ అంశాలన్నింటినీ పరిశీలించాక... శంషాబాద్ మండలం శాతం రాయ్ గ్రామంలో ఉన్న 12 ఎకరాలు ప్రభుత్వ భూమిగా నిర్ధారించుకున్న తర్వాత.. ఆక్రమణలను హైడ్రా తొలగించింది. ఈ 12 ఎకరాలలో ఒక ఎకరం పరిధిలో వున్న కొన్ని నివాసాలు, ఒక దేవాలయం, మసీదును కాపాడుతూనే మిగతా భూమికి కబ్జాల చెర నుంచి విముక్తి కల్పించింది. ఈ మేరకు ప్రభుత్వ భూమిని పరిరక్షిస్తున్నట్టు హైడ్రా బోర్డు పెట్టింది.

## ‘రెడీ టూ సర్వ్’ ఫౌండేషన్ ఆధ్వర్యంలో
# అన్నదాన కార్యక్రమం..

* నిలోఫర్, ఎంఎన్జే ఆసుపత్రుల వద్ద కార్యక్రమం..
* వివరాలు తెలియజేసిన నిర్వాహకుడు పెద్ది శంకర్..

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (భారత శక్తి) : స్వచ్ఛంద సంస్థ ‘రెడీ టూ సర్వ్’ ఫౌండేషన్ ఆదివారం లక్డీకపూల్లోని నిలోఫర్, ఎంఎన్జే ఆసుపత్రుల వద్ద అన్న సంతర్పణ కార్యక్రమాన్ని నిర్వహించింది. ఆసుపత్రులకు వచ్చే రోగులు, బంధువులు, పేదలకు ఉచితంగా భోజనం అందజేసింది. ప్రతి ఆదివారం ఆకలితో బాధపడుతున్న వందలాది పేదల పూట భోజనానికి తోడ్పడాలనే సంకల్పంతో సంస్థ నిరంతరంగా ఈ సేవా కార్యక్రమాన్ని కొనసాగిస్తున్నామని సంస్థ నిర్వాహకుడు పెద్ది శంకర్ తెలిపారు. “ప్రతి వారం మా సేవ కార్యక్రమాలు సమాజానికి చేరువవుతున్నాయి. ఆకలిని తీర్చడం మా ప్రధాన లక్ష్యం” అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో శివ చైతన్య, బి.టి. నాయుడు విజయభాస్కర్, నాగమోహన్, సతీష్ గౌడ్, చంద్రశేఖర్, డైసీ రిత్విక, చంద్ర, సైదులు, శ్రీనాథ్ తదితరులు పాల్గొన్నారు.

# రంగారెడ్డి జిల్లా ఎస్జీఎఫ్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా డాక్టర్ రామచంద్రుడు

* డీఈవో సుశీందర్ రావు చేతుల మీదుగా ఉత్తర్వులు



ఎల్బీనగర్, సెప్టెంబర్ 14 (భారత శక్తి): జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల బహదూర్ గూడ ఎల్బీనగర్ సరూర్నగర్ మండలంలో జరిగిన రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది జోనల్ సెక్రటరీల సమావేశంలో డిఇఓ సుశీందర్ రావు. రంగారెడ్డి జిల్లా ఎస్జీఎఫ్ ఆర్గనైజేషన్ సెక్రటరీగా డాక్టర్ రామచంద్రుడుకు డీఈవో చేతుల మీదుగా ఉత్తర్వులు అందజేశారు.శనివారం ఉదయం సరూర్నగర్ మండలంలో జరిగిన రంగారెడ్డి జిల్లాలోని ఎనిమిది జోనల్ సెక్రటరీల సమావేశంలో డిఇఓ సుశీందర్ రావు రెండు సంవత్సరాల జిల్లా ఆర్గనైజేషన్ సెక్రటరీగా ఉత్తర్వులు అందజేశారు.ఈ సందర్భంగా జిల్లా విద్యాధికారి సుశీందర్ రావు మాట్లాడుతూ, జిల్లాలోని మండల స్థాయి,జోనల్ స్థాయి, జిల్లా స్థాయి స్పోర్ట్స్ గేమ్స్ సకాలంలో పోటీల నిర్వహణ చేయవలసిందిగా ఎంపికైన జిల్లా జట్టును రాష్ట్రస్థాయిలో పాల్గొనేటట్టు పాఠశాలల క్రీడాకారులకు సహాయం చేయవలసిందిగా కోరారు. నూతనంగా ఎన్నికైన రామచంద్రుడు మాట్లాడుతూ, అన్ని సంఘాల యొక్క సీనియర్,జూనియర్ వ్యాయామ ఉపాధ్యాయుల యొక్క సహాయ సహకారాలతో, వాళ్ళ సూచనల మేరకు రెండు సంవత్సరాల పదవీకాలంలో జరిగే టోర్నమెంట్స్ నిర్వహిస్తానని తెలిపారు.ఈ కార్యక్రమంలో టీఎస్ రాష్ట్ర అధ్యక్షులు రాఘవరెడ్డి తెలంగాణ పిడి & పిఈటిల సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి మహ్మద్ సాబేర్, జిల్లా అధ్యక్షులు భాస్కర్ రెడ్డి, భీముడు, బాబయ్య, రవికుమార్, జోనల్ సెక్రటరీలు రాజశేఖర్ రెడ్డి, జైపాల్ రెడ్డి ప్రభాకర్,గంగ్య నాయక్ పిడిఎస్, నరసింహారావు, తిరుపతి, లక్ష్మయ్య,శంకర్, గోపాల్ సింగ్, శేఖర్,స్వాములు పాల్గొన్నారు.




## సీ.ఎం.రిలీఫ్ ఫండ్ తో
# ఎంతో మంది పేదలకు లబ్ది : సుధీర్ రెడ్డి

ఎల్బీనగర్, సెప్టెంబర్ 14 (భారత శక్తి): అనారోగ్య బాధిత కుమారుడు మనీష్ కి 2 లక్షల రూపాయల ఎల్.ఓ.సీ.అందజేస్తున్న ఎల్బీ నగర్ శాసనసభ్యులు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి. కొత్తపేట డివిజన్ పరిధిలోని నాగేశ్వరరావు కాలనీలో నివాసం ఉండే భాస్కర్ రావు కడుపులో గడ్డలకు సంబంధించిన పలు సమస్యలతో బాధపడుతున్న నేపథ్యంలో వారి ఆర్థిక స్థితులు బాగలేక వారి కుటుంబసభ్యులు ఎమ్మెల్యే సుధీర్ రెడ్డిని సంప్రదించారు. వెంటనే స్పందించిన సుదీర్ రెడ్డి ఆపరేషన్ కు కావలసిన డబ్బుల వివరాలను ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేయించారు.దానికి గాను వారికి 2,00,000(రెండు లక్షల రూపాయలు) ఎల్.ఓ.సీ.చెక్కు మంజూరు అయింది. ఈ సందర్భంగా సుధీర్ రెడ్డి మాట్లాడుతూ, పేదల ఆరోగ్య పరిరక్షణకు సీ.యం.సహాయనిధి దోహదపడుతుందని అన్నారు.ఈ పథకం పేదలకు ఒక వరం లాంటిదని అన్నారు.పేద ప్రజలకు నాణ్యమైన అధునాతన వైద్య సేవలను పొందేందుకు సీ.ఎం.సహాయనిధి అండగా ఉంటుందని అన్నారు.ఈ కార్యక్రమంలో భారాస యువ నాయకులు సుమన్ గౌడ్, ప్రతిక్,సింగిరెడ్డి వేణుగోపాల్ రెడ్డి, శ్రీనివాస్ పాల్గొన్నారు.

## సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను
# పంపిణీ చేసిన మధుయాష్కీ గౌడ్

ఎల్బీనగర్ : సెప్టెంబర్ 14 (భారత శక్తి) : సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఎంతోమంది పేదలు ఆర్థికంగా ఉపశమనం పొందగలుగుతున్నారని, ప్రైవేట్ ఆసుపత్రులలో చికిత్స పొందుతున్న సామాన్యులకు వైద్యభారం తగ్గుతుందని టీపీసీసీ క్యాంపెయిన్ కమిటీ చైర్మన్, మాజీ ఎంపీ మధుయాష్కీ గౌడ్ పేర్కొన్నారు. అనారోగ్యంతో ప్రైవేటు ఆసుపత్రులలో చికిత్స పొందిన పలువురు తమ ఆర్థిక ఇబ్బందుల రీత్యా మధుయాష్కీ ని సంప్రదించగా.. స్పందించిన ఆయన సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించారు. వనస్థలిపురం కు చెందిన పారంద పావని (రూ. 21,000/), వియ్యపు సాంబశివరావు ( రూ. 21,000/), ఉడుముల సుధాకర్ రెడ్డి (రూ.60,000/), ఎల్బీనగర్ కు చెందిన చౌకత్ సురేష్ (రూ. 60,000/), దిల్ షుక్ నగర్ చెందిన సిరందాసు శ్రీదేవి (రూ. 58,500/), కర్మన్ ఘాట్ కి చెందిన జి సతీష్ (రూ. 23,000/), వనస్థలిపురం కు చెందిన సిర్సుల్లా రాకేష్ (60,000/), హయత్ నగర్ కు చెందిన లింగం శ్రీశైలం (30,000/) లకు



సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరు చేయించి.. చెక్కులను వనస్థలిపురం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో లబ్ధిదారులకు అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం ఎప్పుడూ పేదల పక్షమేనని వారి సంక్షేమానికి కృషి చేస్తుందన్నారు. ఎంతోమంది సీఎం రిలీఫ్ ఫండ్ పొందడం ద్వారా ఆర్థిక ఉపశమనం పొందగలుగుతున్నారని పేర్కొన్నారు. కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ల అధ్యక్షులు శ్రీపాల్ రెడ్డి, వేణుగోపాల్ యాదవ్, చెన్నగోని రవీందర్ గౌడ్, మార్కెట్ కమిటీ డైరెక్టర్లు పాశం అశోక్ గౌడ్, నేలపాటి రామారావు, నాయకులు బోడ రాజశేఖర్, విజయ భాస్కర్ రెడ్డి, కొండూజు శ్రీనివాస్, రమేష్, దాసరమోని శ్రీనివాస్, శరత్ యాదవ్ పాల్గొన్నారు.

# హిందీ సినిమాపై బండి సంజయ్ కీలక వ్యాఖ్యలు

హైదరాబాద్, సెప్టెంబర్ 14 (భారత శక్తి) : ‘హిందీ కేవలం ఒక భాష మాత్రమే కాదు. కోట్లాది భారతీయుల భావోద్వేగాలు, సంస్కృతికి ప్రతిరూపం’ అని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తెలిపారు. ‘హిందీ దివస్’ను పురస్కరించుకుని ఆదివారం గుజరాత్లోని అహ్మదాబాద్లో నిర్వహించిన ‘హిందీ దివస్’ కార్యక్రమంలో బండి సంజయ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. భాష అనేది నాగరికత మరియు సంస్కృతికి ఆత్మ. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ చెప్పినట్లుగా భాష కేవలం వ్యక్తీకరణ సాధనం మాత్రమే కాదు, అది మన సంస్కృతి, సంప్రదాయం, జాతీయ చైతన్యానికి ఆత్మ. మోడీ నాయకత్వంలో భారత్ నేడు ఆత్మనిర్భరత వైపు, విశ్వగురువుగా మారే దిశగా వేగంగా ముందుకు సాగుతోంది. ఆత్మనిర్భర భారతానికి అతి పెద్ద శక్తి దాని స్థానిక భాషలు, మాతృభాషలే. మోడీ నాయకత్వంలో రూపొందిన జాతీయ విద్యా విధానంలో భారతీయ భాషలకు విద్య, జ్ఞానానికి మూలాధారంగా ప్రాధాన్యం ఇవ్వబడింది. కేంద్ర హోంమంత్రి అమిత్ షా మార్గదర్శకత్వంలో హిందీ, భారతీయ భాషలను సాంకేతికత, పరిపాలనలో విరివిగా ప్రాచుర్యం పొందేలా చేస్తున్నారు. అట్లాగే రాజభాషా విభాగం ఎన్నో ప్రాజెక్టులను ఆరంభించింది. వాటి ద్వారా హిందీతోపాటు ఇతర భారతీయ భాషలు డిజిటల్ యుగంలో మరింత శక్తివంతం అయ్యాయి. భాష అనేది కేవలం సంభాషణ సాధనం కాదు. అది ఆలోచనలు, భావాలు, సంస్కారాల వాహకురాలు. అది మన సంస్కృతి, సంప్రదాయాల సంరక్షకురాలు. సమాజ అభివృద్ధికి పునాది. మన గుర్తింపులో అంతర్భాగం. మాతృభాష మన హృదయానికి అత్యంత చేరువైనది. విదేశీ భాషలు మన జ్ఞానం, అవకాశాలను విస్తరిస్తాయి. అందువల్ల ప్రతి భాషను సంరక్షించడం, గౌరవించడం మన ప్రధాన కర్తవ్యంగా భావించాలి. గతకొన్ని సంవత్సరాలలో రాజభాషా విభాగం అనేక చారిత్రాత్మక కార్యక్రమాలను చేపట్టింది. హిందీ శబ్ద సింధు డిజిటల్ నిఘంటువులో ప్రస్తుతం ఏడు లక్షలకు పైగా పదాలు ఉన్నాయి. అందులో సుమారు ఇరవై ఐదు వేల పదాలు భారతీయ భాషల నుండి సేకరించబడ్డాయి. ఇది కేవలం హిందీకి విస్తరణ మాత్రమే కాదు, భారతీయ భాషల మధ్య ఒక సంధాన సేతును నిర్మించడం కూడా. భారతీయ భాషా విభాగ ప్రాజెక్ట్ హిందీ, భారతీయ భాషల మధ్య సమన్వయానికి అద్భుతమైన ఉదాహరణ. కంఠస్థ, అనువాద్ సాధన్ మరియు ఇతర సాంకేతిక టూల్స్, రాజభాషా అమలును సులభతరం చేసి ఆధునికతను చేర్చాయి. ఈ పరికరాలు హిందీ మరియు భారతీయ భాషలను పరిపాలన, విద్య, సాంకేతికతలతో అనుసంధానిస్తున్నాయి. ఈ రోజుల్లో హిందీ ప్రపంచ వేదికపై బలమైన స్థానంలో నిలిచింది. విద్య, కమ్యూనికేషన్, పరిపాలన భాషగా హిందీ ప్రాధాన్యం నిరంతరం పెరుగుతోంది. హిందీ సినిమా, సాహిత్యం, జర్నలిజం దీనిని ప్రజాదరణలో కొత్త ఎత్తులకు తీసుకెళ్లాయి. విదేశాలలో కూడా కోట్ల మంది హిందీ సినిమాలు చూస్తున్నారు.. హిందీ మాట్లాడుతున్నారు, అర్థం చేసుకుంటున్నారు. ఐక్యరాజ్యసమితి వంటి వేదికలపై హిందీకి వచ్చిన అంగీకారం, భారతదేశ సాంస్కృతిక శక్తికి ప్రతీక. హిందీ రాజభాషా కావడంతో ప్రభుత్వ పనితీరులో ఒక విధమైన సమన్వయం వచ్చింది. ప్రభుత్వ పత్రాలు, ఉత్తర ప్రత్యుత్తరాలు (కరస్పాండెన్స్) హిందీలో లభించడం వలన ప్రజలకు, ప్రభుత్వానికీ మధ్య దూరం తగ్గింది. సాధారణ పౌరుడికి నేరుగా పాలనతో సంభాషించే సౌకర్యం లభించింది. ఇక్కడ మీకో విషయం చెప్పాలనుకుంటున్నా. నేను హిందీయేతర రాష్ట్రమైన తెలంగాణ నుంచి వచ్చాను. కానీ అమిత్ షా ప్రేరణతో అన్ని ప్రభుత్వ పనుల్లోనూ, మాట్లాడే భాషలోనూ హిందీని సులభంగా ఉపయోగిస్తున్నాను.



# భారత్-పాక్ మ్యాచ్‌పై కేంద్రం క్లారిటీ.. బాయ్‌కాట్ చేసే ప్రసక్తే లేదు!

**ఢిల్లీ, సెప్టెంబర్ 14 (భారత శక్తి):** ఆసియా కప్ టోర్నీలో భాగంగా భారత్‌పాకిస్థాన్ జట్ల మధ్య మరికొద్దిసేపట్లో జరగనున్న మ్యాచ్‌ను బహిష్కరించాలంటూ తీవ్రస్థాయిలో డిమాండ్లు వెల్లువెత్తుతున్న వేళ, కేంద్ర ప్రభుత్వం ఈ వివాదంపై స్పష్టత ఇచ్చింది. మ్యాచ్‌ను బాయ్‌కాట్ చేసే ప్రసక్తే లేదని తేల్చి చెప్పింది. ఉగ్రవాదాన్ని, క్రీడలను వేర్వేరుగా చూడాలని స్పష్టం చేసింది.ఇటీవల పహల్గాంలో జరిగిన ఉగ్రదాడి నేపథ్యంలో, పాకిస్థాన్‌తో క్రికెట్ సంబంధాలను తెంచుకోవాలనే వాదన ఊపందుకుంది. ఈ క్రమంలోనే సోషల్ మీడియాలో '#BoycottINDvsPAK' హ్యాష్‌ట్యాగ్ ట్రెండ్ అవుతోంది. దాడిలో మరణించిన వారి కుటుంబ సభ్యులు సైతం మ్యాచ్‌ను రద్దు చేయాలని కోరారు. ఈ నేపథ్యంలో కేంద్ర మంత్రి మనోహర్ లాల్ ఖత్తర్ ప్రభుత్వ వైఖరిని వెల్లడించారు. ఈ అంశంపై ఆయన మాట్లాడుతూ, "ఉగ్రదాడి, క్రికెట్ మ్యాచ్ అనేవి రెండు పూర్తిగా భిన్నమైన అంశాలు. రెండింటినీ ఒకే కోణంలో చూడకూడదు. ఆట అంటేనే భావోద్వేగాలతో కూడుకున్నది. క్రీడాకారులు ఎంతో కష్టపడి ఈ స్థాయికి వస్తారు. అలాంటి సమయంలో మ్యాచ్‌ను వ్యతిరేకించడం సరైన పద్ధతి కాదు. ఇప్పటికే కేంద్ర ప్రభుత్వ క్రీడల విధానాన్ని ప్రకటించాం" అని అన్నారు. తొందరపడి నిర్ణయాలు తీసుకోవద్దని, అన్ని విషయాలను ఆలోచించాలని ఆయన సూచించారు. క్రీడలు, ఇతర అంశాలను కలపడం సరికాదని, ఇలాంటి సున్నితమైన విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలని మంత్రి వివరించారు. కాగా, అభిమానుల డిమాండ్లు, ప్రభుత్వ ప్రకటనల మధ్య ఈ హైవోల్టేజ్ మ్యాచ్ మరికొద్ది సేపట్లో ప్రారంభం కానుంది.

## పోరాడండి.. లేదంటే చనిపోతారు
# ఎలాన్ మస్క్ కీలక వ్యాఖ్యలు

**అమెరిక, సెప్టెంబర్ 14:** వలసలకు వ్యతిరేకంగా బ్రిటన్‌లో భారీ ఎత్తున నిరసనలు వ్యక్తమైన సంగతి తెలిసిందే. లక్ష మందికి పైగా ఆందోళనకారులు పాల్గొన్న ఈ ర్యాలీకి ప్రపంచకుబేరుడు ఎలాన్ మస్క్ మద్దతు తెలిపారు. వలసలకు వ్యతిరేకంగా ఉద్యమిస్తున్న కార్యకర్త టామీ రాబిన్సన్ ఆధ్వర్యంలో జరుగుతున్న ఈ ర్యాలీలో మస్క్ వర్చువల్‌గా మాట్లాడారు. యూకేలో పాలన మార్పునకు పిలుపునిచ్చారు. దేశం విధ్వంసం అంచున ఉందని హెచ్చరించారు. 'బ్రిటన్ పౌరుడిగా ఉండటం గొప్ప విషయం. కానీ, దేశం నాశనం అవడం నేను ఇప్పుడు చూస్తున్నా. చిన్న కోతగా ఇది మొదలైంది. కానీ, ఇప్పుడు భారీగా అక్రమ వలసలతో నిండిపోయింది. ఇది ఇలానే కొనసాగితే మీరు హింసను కోరుకోకపోయినా.. విధ్వంసం మీ వరకు వస్తుంది. ఇప్పుడు మీ వద్ద ఉన్నవి రెండే మార్గాలు. తిరిగి పోరాడండి.. లేదంటే చనిపోతారు. ఇదే నిజమని నేను అనుకుంటున్నా' అని మస్క్ అన్నారు. ఈ సందర్భంగా ప్రధాని కీర్ స్టార్మర్ నేతృత్వంలోని ప్రభుత్వం దిగిపోవాలని మస్క్ డిమాండ్ చేశారు. బ్రిటన్‌లో ప్రభుత్వ మార్పు జరగాలని తాను భావిస్తున్నట్లు తెలిపారు. వెంటనే పార్లమెంటును రద్దు చేసి.. మళ్లీ ఎన్నికలు నిర్వహించాలన్నారు. ఇటీవల అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ సన్నిహితుడు, కన్జర్వేటివ్ పార్టీ యాక్టివిస్ట్ చార్లీ కిర్క్ హత్యకు గురైన సంగతి తెలిసిందే. ఈ విషయాన్ని కూడా మస్క్ ప్రస్తావిస్తూ.. యూఎస్‌లో హింస పెరిగిపోయిందని వ్యాఖ్యానించారు.

# హిందీని ఆ ఒక్క రంగానికే పరిమితం చేయొద్దు

**ఢిల్లీ, సెప్టెంబర్ 14 (భారత శక్తి):** హిందీని కేవలం సంభాషణలకు, అధికారిక కార్యకలాపాలకు మాత్రమే పరిమితం చేయకూడదని, సైన్స్, టెక్నాలజీ, న్యాయం, పోలీసు యంత్రాంగం వంటి కీలక రంగాలకు కూడా దానిని మూలస్తంభంగా మార్చాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. హిందీ ఇతర భారతీయ భాషలకు పోటీ కాదని, వాటన్నిటికీ ఒక నేస్తం మాత్రమేనని ఆయన పునరుద్ఘాటించారు. హిందీ దివస్ సందర్భంగా ఆదివారం జరిగిన ఐదవ అఖిల భారత అధికార భాషా సమ్మేళనంలో అమిత్ షా ప్రసంగించారు. "అన్ని పనులు భారతీయ భాషల్లో జరిగినప్పుడు, ప్రజలతో మన బంధం దానంతట అదే బలపడుతుంది" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఒక ప్రత్యేక పిలుపునిచ్చారు. తమ మాతృభాషలోనే కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు లేఖలు రాయాలని, ఆ లేఖలకు తాను కూడా వారి భాషలోనే సమాధానం ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో భారతీయ భాషలకు, సంస్కృతికి పునరుజ్జీవనం లభించిందని షా ప్రశంసించారు. ఐక్యరాజ్యసమితి, జీ20 వంటి అంతర్జాతీయ వేదికలపై ప్రధాని మోదీ హిందీలో మాట్లాడి భారతీయ భాషల గౌరవాన్ని ఇనుమడింపజేశారని గుర్తుచేశారు. బానిసత్వపు చిహ్నాల నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు ప్రధాని మోదీ తీసుకున్న 'పంచ ప్రాణ్' (ఐదు ప్రతిజ్ఞలు)లో భాషలకు కూడా కీలక పాత్ర ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ చెప్పిన మాటలను ఆయన ఉటంకించారు. 'స్వరాజ్, స్వధర్మం, స్వభాష' అనే మూడు అంశాలు దేశ ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్నాయని అన్నారు. పిల్లలకు వారి మాతృభాషలోనే విజ్ఞానాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. వేరే భాషలో నేర్చుకోవడం వల్ల పిల్లల అభ్యాస సామర్థ్యం 30 శాతం వరకు తగ్గిపోతుందని ఆయన పేర్కొన్నారు. 'భారతీయ భాషా అనుభాగ్' ఏర్పాటుతో అధికార భాషా విభాగం ఇప్పుడు పూర్తిస్థాయి శాఖగా మారిందని ఆయన తెలిపారు. హిందీని కేవలం సంభాషణలకు, అధికారిక కార్యకలాపాలకు మాత్రమే పరిమితం చేయకూడదని, సైన్స్, టెక్నాలజీ, న్యాయం, పోలీసు యంత్రాంగం వంటి కీలక రంగాలకు కూడా దానిని మూలస్తంభంగా మార్చాలని కేంద్ర హోంమంత్రి అమిత్ షా స్పష్టం చేశారు. హిందీ ఇతర భారతీయ భాషలకు పోటీ కాదని, వాటన్నిటికీ ఒక నేస్తం మాత్రమేనని ఆయన పునరుద్ఘాటించారు. హిందీ దివస్ సందర్భంగా ఆదివారం జరిగిన ఐదవ అఖిల భారత అధికార భాషా సమ్మేళనంలో అమిత్ షా ప్రసంగించారు. "అన్ని పనులు భారతీయ భాషల్లో జరిగినప్పుడు, ప్రజలతో మన బంధం దానంతట అదే బలపడుతుంది" అని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సందర్భంగా ఆయన అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులకు ఒక ప్రత్యేక పిలుపునిచ్చారు. తమ మాతృభాషలోనే కేంద్ర హోంమంత్రిత్వ శాఖకు లేఖలు రాయాలని, ఆ లేఖలకు తాను కూడా వారి భాషలోనే సమాధానం ఇస్తానని హామీ ఇచ్చారు. ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వంలో గత దశాబ్ద కాలంలో భారతీయ భాషలకు, సంస్కృతికి పునరుజ్జీవనం లభించిందని షా ప్రశంసించారు. ఐక్యరాజ్యసమితి, జీ20 వంటి అంతర్జాతీయ వేదికలపై ప్రధాని మోదీ హిందీలో మాట్లాడి భారతీయ భాషల గౌరవాన్ని ఇనుమడింపజేశారని గుర్తుచేశారు. బానిసత్వపు చిహ్నాల నుంచి దేశానికి విముక్తి కల్పించేందుకు ప్రధాని మోదీ తీసుకున్న 'పంచ ప్రాణ్' (ఐదు ప్రతిజ్ఞలు)లో భాషలకు కూడా కీలక పాత్ర ఉందని తెలిపారు. ఈ సందర్భంగా ఛత్రపతి శివాజీ మహారాజ్ చెప్పిన మాటలను ఆయన ఉటంకించారు. 'స్వరాజ్, స్వధర్మం, స్వభాష' అనే మూడు అంశాలు దేశ ఆత్మగౌరవంతో ముడిపడి ఉన్నాయని అన్నారు. పిల్లలకు వారి మాతృభాషలోనే విజ్ఞానాన్ని అందించాలని తల్లిదండ్రులకు సూచించారు. వేరే భాషలో నేర్చుకోవడం వల్ల పిల్లల అభ్యాస సామర్థ్యం 30 శాతం వరకు తగ్గిపోతుందని ఆయన పేర్కొన్నారు. 'భారతీయ భాషా అనుభాగ్' ఏర్పాటుతో అధికార భాషా విభాగం ఇప్పుడు పూర్తిస్థాయి శాఖగా మారిందని ఆయన తెలిపారు.

## హైదరాబాద్‌లో వర్షం..
# రహదారులు జలమయం

**హైదరబాద్, సెప్టెంబర్ 14 (భారత శక్తి):** నగరంలోని పలు ప్రాంతాల్లో ఆదివారం సాయంత్రం భారీ వర్షం కురిసింది. ముషీరాబాద్, రామ్‌నగర్, తార్నాక, ఎల్బీనగర్, కాచిగూడ, కుషాయిగూడ, కాప్రా, కీసర తదితర ప్రాంతాల్లో కురిసిన వర్షానికి రహదారులు జలమయ్యాయి. దీంతో వాహనచోదకులు రాకపోకలకు ఇబ్బందులు ఎదుర్కొన్నారు.

# ఐదేళ్లుగా విమోచన దినోత్సవాన్ని కేంద్రమే నిర్వహిస్తోంది

**సికింద్రాబాద్, సెప్టెంబర్ 14 (భారత శక్తి):** హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని పురస్కరించుకుని సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన ప్రత్యేక ఫొటో ప్రదర్శనను తెలంగాణ గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. ఈ సందర్భంగా కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి మాట్లాడుతూ.. గత ఐదేళ్లుగా విమోచన దినోత్సవాన్ని కేంద్రం నిర్వహిస్తోందన్నారు. నిజాం నిరంకుశ పాలనకు వ్యతిరేకంగా ఆనాడు ప్రజలు పోరాడారని గుర్తు చేశారు. రజాకార్ల హింసాకాండపై ప్రజలు తిరుగుబాటు చేశారు.. అప్పటి ప్రజల ఇబ్బందులు, పోరాటాలు తెలిపేలా ఫొటో ప్రదర్శన ఏర్పాటు చేసినట్టు చెప్పారు. కార్యక్రమంలో భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్‌రావు, మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్ తదితరులు పాల్గొన్నారు.

* **ఏర్పాట్లు పరిశీలించిన రాష్ట్ర భాజపా నేతలు**

కేంద్ర సాంస్కృతికశాఖ ఆధ్వర్యంలో సికింద్రా బాద్ పరేడ్ మైదానంలో ఈనెల 17న ఉత్సవాలను అధికారికంగా నిర్వహించనున్నారు. ముఖ్య అతిథులుగా కేంద్ర రక్షణశాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్‌తో పాటు పలువురు కేంద్ర మంత్రులు, మహారాష్ట్రకు చెందిన మంత్రులు హాజరుకానున్నారు. ఈ సందర్భంగా పరేడ్ గ్రౌండ్‌లో ఏర్పాట్లను రాష్ట్ర భాజపా నేతలు పరిశీలించారు.

# 'అలయ్ బలయ్' సీఎం రేవంత్ రెడ్డికి ఆహ్వానం అందజేసిన దత్తాత్రేయ

**హైదరబాద్, సెప్టెంబర్ 14 (భారత శక్తి):** జూబ్లీహిల్స్ నివాసంలో సీఎం రేవంత్ రెడ్డిని ఆదివారం హర్యానా మాజీ గవర్నర్ బండారు దత్తాత్రేయ మర్యాదపూర్వకంగా కలిశారు. అక్టోబర్ 3న హైదరాబాద్ నాంపల్లి ఎగ్జిబిషన్ గ్రౌండ్ లో జరిగే "అలయ్ బలయ్" కార్యక్రమానికి సీఎం రేవంత్ రెడ్డిని దత్తాత్రేయ ఆహ్వానించారు. ఈ మేరకు సీఎంకు ఆహ్వాన పత్రికను ఆయన అందజేశారు. ఈ సందర్భంగా దత్తాత్రేయను సీఎం రేవంత్ శాలువా కప్పి సత్కరించారు. కాగా, తెలంగాణ సంస్కృతి సంప్రదాయాలకు ప్రతీకగా అలయ్ బలయ్ కార్యక్రమాన్ని బండారు దత్తాత్రేయ నిర్వహిస్తారు. రాజకీయాలకు అతీతంగా అలయ్ బలయ్ వేడుకలు ప్రతీ ఏడాది దసరా సమయంలో నిర్వహిస్తారు. ఈ కార్యక్రమంలో ప్రతి ఏటా వివిధ రాజకీయ పార్టీల నాయకులు, ముఖ్యమంత్రులు, అధికారులు, సెలబ్రిటీలు, ప్రముఖులు పాల్గొంటారు. తెలంగాణ ఉద్యమ సమయంలో రాజకీయాలకు అతీతంగా నాయకులను ఒకే వేదిక మీదకు తీసుకురావాలనే ఉద్దేశ్యంతో 2005లో అలయ్ బలయ్ కార్యక్రమాన్న ప్రారంభించిన విషయం విదితమే.

## కాలేజీల బంద్ సస్పెన్స్..
# ఈ రాత్రికి డిప్యూటీ సీఎంతో యాజమాన్యాల సమావేశం



**హైదరబాద్, సెప్టెంబర్ 14 (భారత శక్తి):** రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలని విద్యార్థులు, ప్రైవేటు కాలేజీల యాజమాన్యాలు, మరోవైపు పలు విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి. ఇందులో భాగంగా రేపటి నుంచి కాలేజీల నిరవధిక బంద్‌కు పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. ఈ నేపథ్యంలోనే ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల యాజమాన్యాల ఫెడరేషన్ నేతలను ప్రభుత్వం చర్చలకు పిలిచింది. ఈ రోజు రాత్రి 7 గంటలకు డిప్యూటీ సీఎం భట్టి విక్రమార్కతో ప్రైవేట్ ఉన్నత విద్యా సంస్థల యాజమాన్యాల ఫెడరేషన్ నేతలు భేటీ కానున్నారు. ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిలపై భట్టి వారితో చర్చించనున్నారు. రీయింబర్స్‌మెంట్‌పై ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందోనని విద్యార్థులు, యాజమాన్యాలు ఎదురుచూస్తున్నాయి. చర్చల అనంతరం తదుపరి కార్యాచరణ ప్రకటిస్తామని కాలేజీల యాజమాన్యం తెలిపాయి. మరోవైపు రేపటి నుంచి కాలేజీలు బంద్ ఉంటుందా? లేదా? అని విద్యార్థుల్లో ఉత్కంఠ నెలకొంది. డిప్యూటీ సీఎం భేటీ తర్వాత కాలేజీల బంద్ సస్పెన్స్ వీడనుంది.

## మేడారంలో గద్దెలు మారుస్తున్నారని ప్రచారం..
# రెచ్చిపోయిన మంత్రి సీతక్క



**మేడారం, సెప్టెంబర్ 14 భారత శక్తి):** ములుగు జిల్లా మేడారంలో మంత్రి సీతక్క పర్యటించారు. ఆదివారం బైక్‌పై తిరుగుతూ జాతర పనులు పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మీడియాతో మాట్లాడారు. కొందరు స్వార్థంతో ఇష్టారీతిన మేడారం జాతరపై ఆరోపణలు చేస్తున్నారని మండిపడ్డారు. సమ్మక, సారలమ్మల గద్దెలు మారుస్తున్నామని ప్రచారం చేస్తున్నారని సీరియస్ అయ్యారు. గద్దెల అభివృద్ధికి ఇంకా DPR కూడా సిద్ధం కాలేదని సీతక్క స్పష్టం చేశారు. జాతరపై చిల్లర రాజకీయాలు మానుకోవాలి హితవు పలికారు. కాగా, 2026 జనవరి 28 నుంచి 31 వరకు మేడారం జాతర జరుగనుంది. నాలుగు రోజుల పాటు ఈ జాతర జరుగుతుంది. తొలిరోజు జనవరి 28న సాయంత్రం 6 గంటలకు కన్నెపల్లి నుంచి సారలమ్మను, గోవింద రాజు, పగిడిద్ద రాజులను గద్దెపైకి తీసుకురావడంతో జాతర మొదలవుతుంది. రెండో రోజు 29న సాయంత్రం 6 గంటలకు చిలకల గుట్ట నుంచి సమ్మక్క దేవతను గద్దె మీదకు తీసుకొస్తారు. ఈ క్రమంలో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా ప్రభుత్వం ముమ్మరంగా ఏర్పాట్లు చేస్తోంది.

# గ్రూప్–1పై సాక్ష్యం ఉంటే రేవంత్ లేదా నేనే సిద్ధం: కేటీఆర్‌కు ఏఐసీసీ కార్యదర్శి సవాల్



**హైదరబాద్, సెప్టెంబర్ 14 (భారత శక్తి):** తేరు మైదానానికి ఓ చరిత్ర ఉందని దాన్ని కేటీఆర్ అబద్ధాలకు అడ్డగా మార్చి ఈ రోజు నడిగడ్డ ప్రతిష్టను దిగజార్చు పోయాడని ఏఐసీసీ కార్యదర్శి అలంపూర్ మాజీ ఎమ్మెల్యే సంపత్ కుమార్ విమర్శించారు. ఈ మేరకు ఆయన ఆదివారం ఒక వీడియో విడుదల చేశారు. నిన్న జరిగిన గద్వాల్ సభ అబద్ధాలకు కేంద్రంగా ఉందని, సభ అట్టర్ ప్లాఫ్ అయిందన్నారు. అలంపూర్ నియోజకవర్గంలో గెలిచిన ఎమ్మెల్యే ఎమ్మెల్సీలకు అభివృద్ధిపై ఆలోచన లేదు అని వారికి ఫ్యూడలిస్ట్ ,శాడిస్ట్ రాజకీయాలు చేయడమే తప్ప ప్రజా సమస్యలపై అవగాహన లేదన్నారు. నిన్న సభలో కేటీఆర్ మాట్లాడుతూ గురుకుల హాస్టల్‌లో ఎలుకలు దూరుతున్నాయని చేసిన విమర్శను సంపత్ కుమార్ తిప్పి కొట్టారు. కేసీఆర్ సీఎంగా ఉన్నటువంటి రోజుల్లో నేను, ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ కలిసి కొట్లాడి అలంపూర్ నియోజకవర్గానికి అత్యధిక గురుకులాలను తీసుకువచ్చామని గుర్తు చేశారు. నియోజకవర్గంలో ఒక్కటంటే ఒక్క డబుల్ బెడ్ రూమ్ ఇల్లు కూడా కట్టలేదన్నారు. పెద్ద ధన్వాడ ఇథనాల్ ఫ్యాక్టరీ గురించి కూడా మాట్లాడే అర్హత కేటీఆర్‌కు లేదన్నారు. ఎందుకంటే ఆ రోజు టీఆర్ఎస్ పరిపాలనలోనే ఆ కంపెనీకి స్వయంగా కేటీఆర్ చేతుల మీదుగా 9 పర్మిషన్లు ఇచ్చారని.. అప్పుడు బుద్ధి లేదా కేటీఆర్ అని ప్రశ్నించారు. దళితులు బీసీల గురించి మాట్లాడే నైతికత కేటీఆర్‌కి లేదని అన్నారు. అలాగే, గ్రూప్ 1 ఉద్యోగాలు అమ్ముకున్నారని కేటీఆర్ చేసిన ఆరోపణలకు బదులుగా ఒక్క సాక్ష్యం చూపించిన సీఎం రేవంత్ రెడ్డి, లేదా తాను దేనికైనా రెడీ అని సంపత్ కుమార్ సవాల్ విసిరారు.


# మంత్రి పొన్నం కాన్వాయ్ కి తప్పిన ప్రమాదం



**కొండపాక, సెప్టెంబర్ 14 భారత శక్తి) :** మంత్రి పొన్నం ప్రభాకర్ కాన్వాయ్ లో ప్రమాదం చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళ్లితే.. సిద్దిపేట నుంచి హైదరాబాద్ కు మంత్రి పొన్నం ప్రభాకర్ వెళ్తున్న క్రమంలో కాన్వాయ్ లోని వాహనం కుకునూరు పల్లి గ్రామం వద్ద రాజీవ్ రహదారి డివైడర్ పైకి దూసుకెళ్లింది. సదరు వాహనం డివైడర్ పై నుంచి సిద్దిపేట వైపు వెళ్లే రహదారి వైపు మళ్ళింది. వాహనంలో పొన్నం ప్రభాకర్ సహాయకుడు మంజునాథ్, ఫోటో గ్రాఫర్, అటెండర్, గన్ మెన్ సాంబశివరావులు ఉన్నారు. కారులో ఉన్న వ్యక్తులకు ఎలాంటి గాయాలు కాకపోవడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. ప్రమాదానికి గల కారణాలు, పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.

# ప్రైవేట్ కాలేజీల దోపిడీ.. దాసోహం అంటున్న ప్రభుత్వాలు..

- చీకటి పాలవుతున్న పేద విద్యార్థుల భవిష్యత్తు..
- ప్రభుత్వ విద్యా వ్యవస్థ విచ్చిన్నం అయిపోతోంది..
- కార్పొరేట్ కు దోచిపెడుతున్న ప్రభుత్వ పెద్దలు..
- పిల్లల భవిష్యత్తు కోసం రక్తం చిందిస్తున్న పేరెంట్స్..
- తాము పస్తులు ఉంటూ పిల్లలను పైచదువులకు పంపిస్తున్నారు..
- నిర్బంధ ఉచిత విద్య అనేది కాగితాల వరకే పరిమితం..
- విద్యావంతులే దేశాన్ని నడిపించగలరు అన్నది ఒకప్పటి మాట..
- డబ్బు, పలుకుబడి, రౌడీయిజం ఇవే ఇప్పుడు రాజ్యమేలుతున్నాయి..
- తెలివిగల పిల్లలకు, పేద పిల్లలకు విద్యను దూరం చేస్తున్న దుర్మార్గం..
- అందరూ తెలివిగలవాళ్ళు అయితే తమ మనుగడ సాగదని కుట్ర..
- పిల్లల ప్రాణాలను తీసుకుంటున్న కొన్ని కార్పొరేట్ విద్యా సంస్థలు..
- విద్యా వ్యవస్థలో సమూల మార్పుకోసం పోరాటం సాగిస్తున్నాయి .. కార్పొరేట్ విద్య నియంత్రణ జే.ఏ.సీ, & టి.ఎస్.టి.సి.ఏ" & ఫోరం ఫేర్ యాంటీ కరప్షన్ అండ్ హ్యూమన్ రైట్స్ సంస్థలు"..



(స్పెషల్ కరస్పాండెంట్)

**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (భారత శక్తి) :** ప్రైవేట్ కాలేజీలు నేడు పెద్ద పెద్ద వ్యాపారాలు చేసే కార్పొరేట్ దుకాణాలుగా మారాయి. జ్ఞానం పంచాలి అనే ధర్మాన్ని విస్మరించి, విద్యార్థుల భవిష్యత్తును డబ్బు యంత్రంగా మార్చేశారు. అడ్మిషన్‌ల పేరుతో డొనేషన్లు వసూలు చేయడం, నిర్ణయించిన ఫీజులకు మించి డబ్బులు బలవంతంగా వసూలు చెయ్యడం.. అధిక హాస్టల్, బస్ ఫీజులు వసూలు చేయడం.. ఇవన్నీ నిత్యకృత్యాలుగా మారిపోయాయి..

ప్రభుత్వం నిర్ధారించిన ఫీజు నిర్మాణం కేవలం పుస్తకాలలో మాత్రమే కనిపిస్తుంది. గ్రౌండ్ రియాలిటీ ఏంటంటే విద్యార్థుల తల్లిదండ్రుల కష్టార్జిత డబ్బును విద్య అనే ముసుగులో దోచుకోవడం. చాలా కాలేజీలలో సరైన ఫ్యాకల్టీ లేదు, లాబొరేటరీలు లేవు, లైబ్రరీలు మూసివేసినట్టే. అయినా ఫీజులు మాత్రం ఆకాశాన్నంటుతున్నాయి. ఇది దారుణం కాదా..? మేధావులు ఆలోచించాలి..

ప్రభుత్వం చర్యలు తీసుకుంటున్నట్టు తెగ బిల్డప్పులు ఇస్తుంది.. కమిటీలు, హెల్ప్‌లైన్‌లు, ఇన్స్పెక్షన్లు అంటూ నాటకం ఆడుతుంది. కానీ వాస్తవంగా చూడాలి అంటే ఎన్ని కాలేజీల అనుమతులు రద్దయ్యాయి? ఎన్ని మేనేజ్‌మెంట్‌లు శిక్షించబడ్డాయి? దాదాపు శూన్యం. ఈ మౌన సహకారం వల్లే ప్రైవేట్ కాలేజీలు మరింత దోపిడీకి దిగుతున్నాయి. చట్టాలున్నా అమలు చేయకపోతే ఆ చట్టాలు ఎందుకు..?

అందుకే ప్రభుత్వంపై మాత్రమే ఆధారపడితే ఫలితం లేదు. తల్లిదండ్రులు, విద్యార్థులు కచ్చితంగా ఎదిరించాలి. అదనపు ఫీజులు వసూలు చేస్తే నిరభ్యంతరంగా ఫిర్యాదు చేయాలి. అవసరమైతే ఆర్.టి.ఐ. లేదా కోర్టులను ఆశ్రయించాలి.. విద్యార్థి సంఘాలు, మీడియా సహకారంతో సమస్యను వెలుగులోకి తీసుకురావాలి.. ఆ సమస్య పెద్ద ఎత్తున చర్చగా మారాలి.. ప్రభుత్వం నిద్ర లేచే వరకు ప్రజల పోరాటం నిరంతరంగా కొనసాగాలి.

ప్రైవేట్ కాలేజీల దోపిడీ అనేది విద్యార్థుల భవిష్యత్తుపై మోపుతున్న ఉక్కుపాదం.. విద్యను వ్యాపారంగా చూసే మేనేజ్‌మెంట్‌లు, వాటిని



ప్రోత్సహిస్తున్న ప్రభుత్వం.. ఈ రెండూ సమానంగా బాధ్యత వహించాలి. తల్లిదండ్రులు, విద్యార్థులు గళమెత్తకపోతే ఈ దోపిడీ ఎన్నటికీ ఆగదు. ఇప్పటి మీ మౌనం రేపటి ప్రమాదం ఇది గ్రహించండి..

ఇక నారాయణ, శ్రీ చైతన్య కాలేజీలపై "ఫీజులు, విద్యార్థుల ఆత్మహత్యలు" వంటి ఆరోపణలు తరచుగా వినిపిస్తూనే ఉన్నాయి.. కొన్ని ఉదాహరణలు చూద్దాం.. ఆంధ్రప్రదేశ్ అనంతపురం లోని నారాయణ కాలేజీలో మొదటి సంవత్సరం ఇంటర్ చదువుతున్న చరణ్ అనే విద్యార్థి, తరగతి మధ్య "బయటికి వచ్చి" తర్వాత మూడో అంతస్తు నుంచి దూకి ఆత్మహత్య చేసుకున్నాడు. అలాగే నారాయణ కాలేజ్ గట్కేసర్ లోని ఒక విద్యార్థి తన ఆత్మహత్య చేసుకున్నట్లు ప్రిన్సిపాల్ వేధిస్తున్నాడని లెటర్ రాయడం సంచలనం రేకెత్తించింది..

మరో సంఘటనలో శ్రీ చైతన్య నార్సింగి క్యాంపస్‌లో 2023లో 16ఏళ్ళ పిల్లవాడు ఇంటర్మీడియట్ పరీక్ష ముందే విద్యార్థులపై తీవ్రమైన ఒత్తిడి, అధ్యాపకుల వేధింపులు అని పేర్కొంటూ ఒక లెటర్ రాసి ఆత్మహత్య చేసుకున్నాడు. విద్యార్థులు తరచుగా మార్కులపై ఎక్కువ శ్రద్ధ పెట్టడం, హాస్టల్ వాతావరణం, టీచర్లు / ప్రిన్సిపాల్ ల ప్రవర్తన వల్ల ఒత్తిడికి గురి అవుతున్నారన్నది వాస్తవం.. ఫీజుల కోసం కూడా ఒత్తిడి తెస్తున్నారని ఆరోపణలు కూడా ఉన్నాయి, ముఖ్యంగా కాలేజీ యాజమాన్యం ఫీజులు తగ్గించేందుకు ఒప్పుకోకపోవడంతో తీవ్రమైన మానసిక వేదన కలుగుతోందని విద్యార్థుల తల్లిదండ్రులు వాపోతున్నారు..

ఎం సెట్, ఈఏ సెట్ లాంటి పరీక్షల "పేపర్ లీక్" లో నారాయణ, శ్రీ చైతన్య కాలేజీల పాత్రకూడా ఉందని ఆరోపణలు వున్నాయి.. వీరిపై కేసులు కూడా నమోదై ఉన్నాయి.. ఇక కాలేజీ ప్రవేశాల్లో.. కాలేజీ యజమానులు సీక్రెట్ గా నియమించుకున్న ఏజెంట్ల పాత్ర ముఖ్యంగా ఉంటోంది.. ఖరీదైన అడ్మిషన్ ఫీజులు, అడ్మిషన్ విధానంలో పారదర్శకత లేకపోవడం వంటి ఎన్నెన్నో ఆరోపణలు ఉన్నాయి. ప్రస్తుతం ప్రభుత్వ నివేదికలలో సైతం "నారాయణ / శ్రీ చైతన్య కాలేజ్ ఫీజులు ఎంత?" అన్న ప్రశ్నకు ఖచ్చితమైన జవాబు లేదు.. ఒక ఖచ్చితమైన ఫిగర్ కనబడలేదు.. ఇది మహాపరాధం, దోపిడీ కాక మరేమవుతుంది..?

దురదృష్టం ఏమిటంటే ప్రభుత్వ విద్యా వ్యవస్థ దారుణంగా విచ్చిన్నమైపోతోంది.. ప్రభుత్వాలు మొద్దు నిద్రపోతున్నాయి.. కార్పొరేట్ వ్యవస్థ పాదాల దగ్గర మోకరిల్లుతున్నాయి..

భారతదేశంలో విద్యను రాజ్యాంగం ప్రాథమిక హక్కుగా గుర్తించినప్పటికీ, ప్రస్తుత పరిస్థితుల్లో ప్రభుత్వ విద్యా వ్యవస్థ విచ్చిన్నమవుతున్న దృశ్యం మన కళ్లముందే కనిపిస్తోంది. ఒకప్పుడు గురువే దేవుడు అని భావించిన సమాజం, ప్రభుత్వ పాఠశాలలను విశ్వసించి తమ పిల్లలను అక్కడ చదివించే పరిస్థితి దాదాపు కనుమరుగైపోయింది..

ప్రైవేటు పాఠశాలల ఆధిపత్యం.. ఇంగ్లీష్ మీడియం ఆకర్షణ.. కార్పొరేట్ శైలిలో పాఠ్యపద్ధతులు.. ఆధునిక సౌకర్యాలు ప్రైవేట్ పాఠశాలల్లో కనిపిస్తుండటం కారణంగా తల్లిదండ్రులు ప్రభుత్వ పాఠశాలలపై ఆసక్తి కోల్పోతున్నారు. ఇక తీవ్రమైన ఉపాధ్యాయుల కొరత, బదిలీలు, శిక్షణలో లోపాలు, పాఠ్యాంశాల పాతబడ్డ విధానం కారణంగా నాణ్యమైన విద్య దెబ్బతింటోంది.

అంతే కాకుండా మరుగుదొడ్లు, త్రాగునీరు, డిజిటల్ క్లాస్‌రూములు, లైబ్రరీలు వంటి ప్రాథమిక సౌకర్యాలు లేకపోవడం విద్యార్థులను దూరం చేస్తోంది. మరీ దరిద్రం ఏమిటంటే బడ్జెట్‌లో తగినంత నిధులు కేటాయించకపోవడం, ఉన్న నిధులు సక్రమంగా వినియోగం కాకపోవడం. ప్రభుత్వ పాఠశాలల్లో చదివితే భవిష్యత్తు చీకటిలో పడుతుందని తల్లిదండ్రుల్లో అపోహలు పెరగడం. ఇవన్నీ బలమైన కారణాలుగా మిగిలిపోతున్నాయి.. దీనిపై ఆలోచన చెయ్యాల్సిన అవసరం ఎంతైనా ఉంది..


పేద, మధ్యతరగతి కుటుంబాలు అధిక ఫీజులు కట్టలేక ఇబ్బంది పడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలలు ఖాళీగా మారి, మూతపడే పరిస్థితి ఏర్పడుతోంది. విద్య వాణిజ్యరంగమై, జ్ఞానం కంటే లాభం ప్రధానమైపోతోంది. గ్రామీణ ప్రాంతాల్లో విద్యార్థుల చదువుపై నేరుగా ప్రతికూల ప్రభావం పడుతోంది. దీనిని పరిష్కరించాలి.. మార్గాలు అనేకం ఉన్నాయి.. ప్రభుత్వ విద్యకు అధిక ప్రాధాన్యతనిస్తూ బడ్జెట్ కేటాయింపులు పెంచడం. ఉపాధ్యాయుల నియామకాలు, శిక్షణ, బోధన పద్ధతుల్లో నాణ్యతను పెంపొందించడం. డిజిటల్ టెక్నాలజీ, స్మార్ట్ క్లాస్‌రూములు, లైబ్రరీలు, ల్యాబ్‌లు ఏర్పాటు చేయడం. ముఖ్యంగా తల్లి దండ్రుల్లో నమ్మకం పెంచేలా ప్రభుత్వ పాఠశాలల్లో మార్పులు తీసుకుని రావాలి.. ప్రభుత్వ విద్యనభ్యసించి ఉన్నతస్థాయికి ఎదిగిన వారి చరిత్రలను తెలియజెప్పాలి.. ప్రైవేట్ విద్యా సంస్థలపై కఠిన నియంత్రణలు విధించి, అధిక ఫీజులను నియంత్రించడం చేయాలి.. ప్రభుత్వ విద్యా వ్యవస్థ పునరుద్ధరణ అవసరం అత్యవసరం. లేకపోతే అది విచ్చిన్నమైపోవడం కాకుండా పూర్తిగా అంతరించిపోవడమనే ప్రమాదం ఉంది.





# మొద్దు నిద్రబోతున్న నార్సింగి మున్సిపల్ అధికారులు

**చేనును కాపాడటానికి కంచె వేస్తాం.. కానీ ఆ కంచే చేనును మేసేస్తుంటే ఇక ఏమి చేయగలం.. అలాంటి దౌర్భాగ్యపు పరిస్థితే ఇప్పుడు నార్సింగి మున్సిపాలిటీలో చూటుచేసుకుంది.. నార్సింగి మున్సిపాలిటీలో ప్రభుత్వ అధికారులనే అహభావంతో అవినీతి ముసుగువేసుకుని అక్రమార్కులు చెలరేగిపోతున్నారు.. ప్రభుత్వానికి దక్కాల్సిన పన్నును దోచుకుంటున్నారు.. పూర్తిగా ప్రకృతి వైవిద్యానికి విగాథం కలిగిస్తూ.. చెరువులను మింగేశారు.. ప్రభుత్వ భూమిని కబ్జా చేశారు.. ఈ విషయంపై రాతపూర్వక ఫిర్యాదు చేస్తే.. స్పందించకపోవడం వెనుక అంతర్యం ఏమిటో ప్రభుత్వ ఉన్నతాధికారులే సమాధానం చెప్పాలి..**





**హైదరాబాద్, సెప్టెంబర్ 14 (భారత శక్తి) :** గండిపేట జలాశయాన్ని అనుకుని 111 జీఓ బయో కన్జర్వేషన్ జోన్ లో.. మోకిలా పోలీస్ స్టేషన్ ఎదురుగా.. శంకర్ పల్లి మండలం రంగారెడ్డి జిల్లా, జన్వాడ గ్రామం సర్వే నంబర్, 725/1, 680/1, 680/681 గల భూమి కబ్జాకు గురైంది.. ఇది ప్రభుత్వ భూమి కావడం ఆందోళన కలిగించే విషయం.. ఇక సర్వే నంబర్ 707, 111 జీఓలో గండిపేట్ జలాశయాన్ని అనుకొని కోడి చెరువును మింగేస్తూ, ప్రభుత్వ భూమిని ఆక్రమించి.. ప్రభుత్వం నుండి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా.. పది ఎకరాలలో కే కన్వెన్షన్ హాల్ పేరుతో ఫంక్షన్ హాల్ నిర్మించారు.. ఫిర్యాదు చేసి పక్షం కాలం గడిచినా అధికారుల్లో ఎలాంటి స్పందన కనిపించడం లేదు.. లంచాలు పుచ్చుకుని నిమ్మకునీరెత్తినట్లు ఉండిపోతున్నారు..

యాక్షన్ టేకెన్ రిపోర్టు కోసం అడిగితే.. ఫోన్ ఎత్తకుండా ముఖం చాటేయడం పరిపాటిగా మారింది...ఇరిగేషన్ అధికారులు భారీ ఎత్తున అంటే లక్షల్లో ముడుపులు తీసుకొని అటువైపు కన్నెత్తి చూడని పరిస్థితి నెలకొంది.. నాలా కన్వర్షన్ ద్వారా అగ్రికల్చర్ ల్యాండ్ నుంచి కమర్షియల్ ల్యాండ్ కి కన్వర్ట్ చేసుకోవచ్చు. చేసుకుంటే ప్రభుత్వానికి పన్ను కట్టొచ్చు.. కోట్లల్లో చెల్లించాల్సిన ఆ పన్నును ఎగ్గొట్టాలనే ఆలోచనతో దురహంకారమైన ఆలోచనతో పక్కన ఉన్న కోడి చెరువులోని కొంచెం ప్రభుత్వ భూమిని బరితెగించి మరీ కబ్జాచేసి, దౌర్జన్యంగా.. కే కన్వెన్షన్ హాల్.. రిసార్ట్ నిర్మాణం చేపట్టి.. ఇటు ప్రభుత్వానికి కోట్లల్లో పన్ను ఎగవేస్తూ.. అటు పర్యావరణానికి విఘాతం కలిగిస్తూ.. అవినీతికి పాల్పడుతున్న అక్రమ నిర్మాణదారుడిపై కఠినంగా చర్యలు తీసుకోవాలని స్థానిక గ్రామ ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..

కే కన్వెన్షన్ హాల్ పేరుతో అక్రమంగా నిర్మాణం చేపడుతున్నారని నార్సింగి మున్సిపల్ టౌన్ ప్లానింగ్ కమిషనర్ గారికి వ్రాతపూర్వక ఫిర్యాదు చేస్తే.. పట్టనట్లు వ్యవహరించడంపై అనుమానం వచ్చి స్థానికంగా దర్యాప్తు చేస్తే ఆయనే దగ్గరుండి ఈ అక్రమ నిర్మాణాన్ని ప్రోత్సహించాడని స్థానిక ప్రజలు గుసగుసలాడుతున్నారు.. ఇక్కడ మున్సిపల్ అధికారులకు లక్షల్లో ముడుపులు అందాయని కూడా అనుమానాలు వ్యక్తం అవుతున్నాయి.. ఈ అవినీతిపై మున్సిపల్ అధ్యక్ష స్థాయి అధికారి ఎస్ శ్రీనివాస్ రెడ్డి దృష్టి సారించి, చర్యలు తీసుకోవాలని స్థానిక ప్రజలు డిమాండ్ చేస్తున్నారు..





STATEMENT SHOWING THE DETAILS OF REVENUE SURVEY NUMBERS FALLING IN THE FTL AREA AND BUFFER ZONE OF KODI CHERUVU OF JANWADA VILLAGE IN SHANKARPALLY MANDAL OF RANGAREDDY DISTRICT.WITH LAKE ID: 1600/E/02

| S.No | Survey No | Total Extent of Sy.No in Ac-Gts | FTL Extent in Ac-Gts | Buffer Zone Extent in Ac-Gts | Balance Extent in Ac-Gts | Ownership | Remarks |
|---|---|---|---|---|---|---|---|
| 1 | 2 | 3 | 4 | 5 | 6 | 7 | 8 |
| 1 | 705 | 17-06 | 6-05 | 3-09 | 7-32 | Patta | |
| 2 | 706 | 13-13 | 10-06 | 0-37 | 2-10 | Patta | |
| 3 | 707 | 2-36 | 2-22 | 0-03 | 0-11 | Sarkari | |
| 4 | 708 | 12-38 | 7-14 | 2-10 | 3-14 | Patta | |
| | | Total | 26-07 | 6-19 | | | |

ABSTRACT

| | Ac - Gts | | Ac - Gts |
|---|---|---|---|
| Govt/Shikam land | 2-22 | Govt/Shikam land | 0-03 |
| Patta land | 23-25 | Patta land | 6-16 |
| Total FTL area | 26-07 | Total Buffer Zone area | 6-19 |

Note: This statement is prepared as per the Aarvee Associates company Drawings.

Girdhavar Shankarpally Mandal
Mandal Surveyor Shankarpally Mandal
Tahsildar Shankarpally Mandal
THASILDAR Shankarpally Mandal Ranga Reddy District
Revenue Divisional Officer Chevella Division
Revenue Divisional Officer Chevella Division, R.R. Dist.
Additional Collector (LB) Rangareddy District
District Collector Rangareddy

Printed, Published and Owned by Kesaram Penta Reddy on behalf of Sri Muktheswara Publications, Printed and Published from Sri Muktheswara Publications, Plot No.31, Road No.5, Mallikarjunanagar Colony, Sagar Ring Road Bairamalguda,Hyderabad - 500079, Telangana. Tel: 040-24044446, Fax: 040-24054446, Cell: 9440265569 Email: bharathasakti@gmail.com, RNI No. APTEL/2006/17880, Editor: Kesaram Penta Reddy.